తత్త్వబోధ

వేదాంత జ్ఞానమును
గ్రహించుటకు వలయు
సాంకేతిక పరిజ్ఞానమును,
పదజాలమును ఈ గ్రంథము
చక్కగ అందించును.

"తత్త్వబోధ" ప్రకరణ గ్రంథము.
జటిలమైన, గహనమైన తాత్త్విక
రహస్యాలను గ్రహించాలని
భావించే సాధకుని
ప్రయత్నమును ఈ గ్రంథము
సులభతర మొనరించును. ఇది
సాధకునికి అత్యంత
ఉపయుక్తమైన గ్రంథము.

పునాదిలేని భవనము
నిలువదు. తత్త్వబోధ తెలియని
వానిలో వేదాంతము నిండదు.

గాయకునికి స్వరజ్ఞాన మెంత
అవసరమో తాత్త్వికునికి ఈ
తత్త్వబోధ అంత అవశ్యకము
అంటారు స్వామి సుందర
చైతన్యానంద.

తత్త్వబోధ

NIRBHAYA NIRVANA PARAMARTHA DEEPIKA



నిర్భయ నిర్వాణ పరమార్థ దీపిక:ఈ గ్రంథము లో పరిపూర్ణ బోధ,అద్వైత బోధ.ఆత్మ బోధ ను గూర్చిన వివరణలు సాధకులకు యెంతో వుపయోగకరము.పరిశీలనకు,పరిశోధనకు,విచారణకు యెంతో వుపకరించే వుత్తమ గ్రంథం

download link:
http://www.mediafire.com/view/cafyfi3us88lxfm/NIRBHAYA_NIRVANA_PARAMARTHA_DEEPIKA.pdf

ఆది శంకరుల

తత్త్వబోధ



జ్ఞానబ్రహ్మ

స్వామి సుందర చైతన్యానంద

సర్వ సంపూజ్య భగవాన్ శంకర

ఉపోద్ఘాతము

సత్యవస్తువు నిత్యమై ఉంటుంది. నిత్యమైనది అనంతమై ఉంటుంది. అనంతములు రెండు ఉండేందుకు వీలు లేనందున అనంతమైన సత్య వస్తువు అద్వయమై ఉంటుంది. అదియే ఆత్మ. ఊహలు తెలియని నిర్వికల్ప ధామము.

అధిష్ఠాన సత్తా స్వరూపమైన ఆత్మ మరియొక దానిపై ఆధారపడదు. మరియొక దానిని అంగీకరించని అద్వైత స్థితి తనదియై ఉన్నందున ఆత్మ రెండు తెలియని, రెండు తెలుపని అఖండాత్మగా నున్నది.

అఖండాత్మను అనుభవించాలని తెలిసియో, తెలియకనో ప్రతి వ్యక్తీ తపన పడుతూనే యున్నాడు. అనుభూతిని పొందాలని తపనపడే తనకు అనుభూతి తాను పొందియే ఉన్నట్లు తెలియదు. ఆత్మవిషయములో కావలసింది అనుభూతి కాదు. జ్ఞానము. అనుభూతిని పొందవలయు ననెడి తపన కూడా ఆత్మానుభూతి వలననే కలుగుచున్నది. అయితే దానికి సంబంధించిన జ్ఞానము కొరవడియున్నది. కనుక ఇచ్చట కావలసినది జ్ఞానమే గాని అనుభూతి కాదు.

సత్యవస్తువునకు సంబంధించిన జ్ఞానము మనకు కావాలి. సత్యవస్తువేమిటో తెలియనపుడు తత్సంబంధమైన జ్ఞానము ఎలా కలుగుతుంది? ఒకవేళ జ్ఞానము కలిగినచో, అట్టిస్థితిలో సత్యమును చేరుట యనగా సత్యము తానై ఉండుటయే గనుక ప్రయత్నమెలా సాగుతుంది? సత్యరూపమైన ఆత్మ ఒకచోట ఉండి మరియొక చోట లేకుండా ఉండినచో దానిని ప్రయత్నము ద్వారా పొందేందుకు యత్నించవచ్చు. అనంతమైన ఆత్మకు పరిమిత జీవనమును అంట గట్టేందుకు వీలులేనందున అది సర్వ వ్యాపకమైన సత్తా స్వరూపమై యున్నది. అంతటా

ఆత్మయే యున్నచో దానిని పొందేందుకు ప్రయత్నము వీలు పడునా? ఒకవేళ అంతటా లేనిదైనచో తన అనంతత్వమునకు భంగము వాటిల్లదా?

అద్వయ సత్తా స్వరూపమైన ఆత్మను పొందేందుకు కర్మ నిరుపయోగమై యున్నది. ఆత్మ లేనిదైనచో దానిని పొందేందుకు ప్రయత్నించవలసి యుండును. ఒకవేళ ఆత్మ ఇప్పుడు మనకు లేనిదే యని భావించి దానిని పొందేందుకు ప్రయత్నించి, సాధించినచో ఒక కాలములో లేని వస్తువు ప్రయత్నము ద్వారా మరియొక కాలములో లభ్యమైనదియేనని గ్రహించవలసి యుండును. ఆత్మ కాలములో కలిగిన, కదిలిన ఫలితమే అయినచో, కాలములో ఆవిర్భవించిన ఆత్మ కాలములో అంతరించును గదా?

కాలానికి పరిమితమై, కాలపరిధిలో చరించి అంతరించే ఆత్మ ఎలా కాలాతీతమై మనగలదు? కాలాతీతముగాని వస్తువు అనంతమగుట ఎట్లు? అనంతముగాని వస్తువునకు అంతముండుటచేత అది నిత్యవస్తువు కాలేదు గదా!

కనుక ఆత్మ యనునది ఉన్నదియేగాని, కానున్నది కాదు. అది అఖండమై యున్నది కనుక వస్తువు కాదు; కానేరదు. అది వస్తురహిత చైతన్యమై ఉన్నది. చైతన్యము ఉన్నదియే గనుక సత్తుగా తెలియుచున్నది. సత్తుయైన తనను తెలుసుకొనేందుకు మరియొక సత్తు వేరుగా యున్నదా? రెండు సత్పదార్థములు యున్నచో ఒకటి మరియొక దానిని పరిమిత మొనర్చదా? పరిమితమైన వస్తువు ఆత్మ ఎలా కాగలదు?

'సత్త యాహి చిత్'

సత్తుయే చిత్తుయై యున్నది అన్నారు రమణమహర్షులవారు. కనుక ఆత్మ తనను తానే తెలుసుకొనుచున్నది. ఒకవేళ తనను తాను తెలియనిచో అది లేనిదే యగును గదా! కనుక

సత్తుయే చిత్తుయై యున్నది. మరియొక విధముగా చెప్పినచో చిత్తుయొక్క అస్తిత్వమే సత్తుయని చెప్పవలసియుండును.

ఉన్నది ఆత్మ ఒక్కటియే. మరి మనకు గోచరించు ఈ ప్రపంచము ఏమిటి? ఆత్మ సత్యము గనుక అది త్రికాలముల యందును మార్పు చెందనిదియై యున్నది. త్రికాలముల యందును మార్పు చెందక, అనంతముగా నుండు ఆత్మ ఉండినపుడు దానినుండి జగత్తు ఎలా ఆవిర్భవించగలదు? ఆవిర్భవించి ప్రత్యేక మనుగడను ఎలా కలిగియుండగలదు? భిన్నత్వాన్ని అంగీకరించడ మంటే ఏకత్వాన్ని నిరాకరించడమని భావము. ఒకటి సత్యమైనపుడు రెండవది అసత్యము కాక తప్పదు. మరి ఈ జగత్తు యొక్క ఉనికి ఎలా వచ్చినది?

బ్రహ్మముకన్నా అన్యముగా ఏదియును లేనందున జగత్తు ప్రత్యేకముగా ఆవిర్భవించే అవకాశము లేదు. మరి ఎలా వచ్చినది? బ్రహ్మపదార్థమే పరిణామము చెందియుండాలి. అనంతమైన బ్రహ్మపదార్థము పరిణామము చెందే అవకాశము లేదు. పరిపూర్ణమైన వస్తువునందు పరిణామము పొసగదు. కనుక ఏవిధముగాను ఆవిర్భవించకనే, పరిణామము చెందకనే అధ్యాస వలన లేనిది ఉన్నట్లుగా గోచరించి ఉండాలి. ఇదే యదార్థమైనచో, జగత్తు లేకనే గోచరించునదియే గాని సత్య వస్తువు కానేరదు. ఆధారవస్తువు అజ్ఞానదశలో అగుపించకపోగా మాయావస్తువు కనుల ముందు గోచరించినది. రజ్జువు తెలిసిరాని స్థితిలో సర్పము తెలియ వచ్చినది. ఇది భ్రాంతి. సత్య వస్తువు రజ్జువుయే గాని సర్పము కాదు. సత్యరూపమైన రజ్జువును దర్శించగనే అసత్యరూపమైన సర్పము అదృశ్యమగును. ఇచ్చట అవశ్యమైనది జ్ఞానము. జ్ఞానజ్యోతిలో ద్వైతతిమిరము అదృశ్యమవుతుంది. మరి జ్ఞానమెలా లభిస్తుంది? జ్ఞానము ఉన్నదియే గాని లభించనున్నది కాదు. ఈ సత్యమును శాస్త్రావగాహన ద్వారా గ్రహించాలి. చెవి ద్వారా శబ్దమును మనస్స

వింటుంది. చెముడు ప్రాప్తించగనే మనస్సు వినుట జరుగదు. కనుక శబ్దమును గ్రహించుటకు మనస్సు, చెవి యనునవి ప్రమాణమై యున్నవి. ప్రమాణము లోపించుట వలన వినుట జరుగుట లేదు. శబ్దము ఉన్నను వినుట యనునది జరుగదు. అలాగుననే బ్రహ్మము సర్వత్రా యున్నది. ఇప్పుడే ఇక్కడే యున్నది. శబ్దము ప్రక్కనే యున్నను చెవి యనెడి ప్రమాణము లోపించుటచేత ఎలా తెలియబడుటలేదో అలాగుననే బ్రహ్మము మన ముందే యున్నను ప్రమాణము లేకపోవుటచేత అది మనకు గోచరించుటలేదు. అపౌరుషేయమైన వేదము ప్రమాణమును అందిస్తుంది. ప్రమాణము అందిన దశలో ప్రమేయమును స్ఫటికంలా స్వచ్ఛంగా గోచరిస్తుంది. అట్టి జ్ఞానములో ప్రమాత ప్రమేయములు ఒకటేనని కూడా తెలియగలదు. ఈ విధముగా ప్రమాణము ప్రమాతను పరిపూర్ణునిగా మార్చుతుంది. దీనినే శబ్దప్రమాణమని పిలుస్తారు.

" అజ్ఞాత జ్ఞాపకం ప్రమాణం శాస్త్రం "

మరచిన దానిని స్మృతికి తెచ్చెడి శాస్త్రమే ఇచ్చట ప్రమాణమని చెప్పబడినది. అదియే వేదము.

వేదజ్ఞానము వ్యక్తులతో ప్రారంభమైనదికాదు. అందుచేత అది అపౌరుషేయమని పిలువబడినది. అపౌరుషేయమైనందున ఆదినారాయణుడే దానికి కర్తయై యున్నాడు. నారాయణుని నుండి కదిలిన ఈ జ్ఞానము పరంపరా ప్రాప్తముగా కదిలి వచ్చినది. దీనినే గురు శిష్య పరంపర లేదా కర్ణపరంపర యని చెబుతారు. ఈ పరంపరలో అందినదియే సంప్రదాయము (Tradition) అనబడుతుంది. వేదము సంప్రదాయమును అందించింది. సంప్రదాయము సద్గురువును ప్రసాదిస్తుంది. గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడై యుండాలి. శిష్యుడైనవాడు సాధన చతుష్టయ సంపద కలిగినవాడై యుండాలి. అప్పుడే వారిమధ్య సంప్రదాయము నిలుస్తుంది. సంప్రదాయము తెలియనివాడు

సత్య వస్తువును తెలుసుకొనలేడు. సత్యవస్తువు శాశ్వతమైనదియే గనుక సత్యస్వరూపమైన జ్ఞానమును అందించెడి సంప్రదాయము కూడా నిత్యమైనదియేనని గ్రహించాలి.

సంప్రదాయము పరిధిలో చరించు ముముక్షువు శ్రుతి భావములను గ్రహించినవాడై, ప్రాపంచిక జీవనము నందలి వెలితిని గుర్తించి, సర్వోపద్రవముల నుండి విడిపడి తరించును. దేశకాలాదుల వలలో చిక్కిన సత్పదార్థమే జగత్తుగా తెలియుచున్నందున, దేశకాలాదుల నుండి విడిపడిన జగత్తు బ్రహ్మమే అయియున్నదని ముముక్షువు గ్రహించ గలుగును. తెలియబడు వస్తువు తెలుసుకొను వానికన్నా వేరైయున్నది యనెడి అసత్య భావనయే జగత్సత్యత్వ వాదమునకు ఆధారమై యున్నది. పరిశీలన ద్వారా ఉన్నది బ్రహ్మ మొక్కటియేననియు, చూచే వాని ఆంతర్యములోని అసత్య చిత్రములే జగత్తును కదిలించి కలవర పరచుచున్నవి అని తెలియును. బ్రహ్మ నిర్దేశము నందు సత్య నిర్దేశము నిలిచియున్నది. సత్య నిర్దేశము అనగా స్వరూప నిర్ణయమే నని తెలియును.

కనుక వేదాంత జ్ఞానమును పొందనిదే వ్యక్తికి శాంతిరాదు. అట్టి జ్ఞానము సంప్రదాయము ద్వారానే అందును. సంప్రదాయములో లభించిన గురువు శాస్త్రమును ప్రవచించును. గురుదేవుని ప్రవచనములో భ్రమతొలగి ప్రమ కలుగును.

అయితే శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడైన సద్గురువు బోధించు వేదాంత జ్ఞానమును గ్రహించుటకు గాను, తత్సంబంధమైన సాంకేతిక పదజాలమును, పరిజ్ఞానమును ముముక్షువు పొంది యుండవలెను. అట్టి సాంకేతిక పరిజ్ఞానమును ఈ "తత్త్వబోధ" యనెడి ప్రకరణ గ్రంథము అందించును. జటిలమైన, గహనమైన తాత్త్విక రహస్యములను గ్రహించవలెననెడి మన ప్రయత్నమును ఈ గ్రంథము సులభతరము చేయును. ఇది సాధకునకు అత్యంత ఉపయుక్తమైన గ్రంథము. ఈ గ్రంథము గురుశిష్య సంవాద రూపమున నడచును.

పునాదిలేని భవనము నిలిచేదుండదు. తత్త్వబోధ తెలియని వానిలో వేదాంత జ్ఞానము నింపే దుండదు. గాయకునికి స్వరజ్ఞానము ఎంత అవసరమో తాత్త్వికునికి ఈ తత్త్వబోధ అత్యంత అవశ్యకమై యున్నది.

ముముక్షువులారా! అష్టాదశాధ్యాయిని అయిన భగవద్గీతను గూర్చి అష్టాదశవర్షము నుండి వేదికలపై ప్రసంగించుచునే యున్నాను. వేలమంది నిశ్శబ్దముగా వింటుంటారు. కానీ ఆంతర్యములో మాత్రము కదిలే శబ్దాలు అగినట్లు గోచరించుటలేదు. ముందుకు ఉరకాలనే ముముక్షువులు సత్సంగ సభ్యులుగా చేరారు. నా ఉపన్యాసాలన్నీ శ్రద్ధగా వింటారు. అతిశ్రద్ధతో గ్రంథాలు పఠిస్తారు. ప్రాణసమానంగా నన్ను ప్రేమిస్తారు. ఇదంతా సత్యమే. అయితే ఆధ్యాత్మికంగా ప్రగతిని సాధించలేకపోతున్నారనునది మరీ నగ్నసత్యమువలె గోచరిస్తున్నది.

దీనికి కారణమేమిటి? ఇది సంపూర్ణముగా శ్రోతయొక్క లోపమేనని నేను చెప్పను. చెప్పలేను. వక్తలో కూడా లోపం ఉన్నది. బోధనా సరళిలో కూడా లోపం ఉన్నది. ఇవన్నియు సవరించబడినపుడే వేదాంతబోధ ఫలిస్తుంది.

వేలాది ప్రజలను, వారి దృక్పథములను మార్చాలనే తపనతో శాస్త్రవిషయములతో పాటు నేటి సాంఘిక, రాజకీయ, నైతిక పరిస్థితులను మనస్సు నందిడుకొని, కాలానుగుణంగా, సందర్భాను సారంగా బోధించెడి బోధవలన మనిషి మారే అవకాశము లేదు. మరి దీనికి తరుణోపాయమేమిటి? మళ్ళీ వెనుకకు మఱలుటయే. సంప్రదాయగాడిలో నిలబడి గురుకుల వాసములలో అందించబడిన రీతిన ప్రవచన రూపములో జ్ఞానమును అందించుటయే సరియైన మార్గము అని నాకనిపించింది. బోధ వలన ప్రభావితులు కానివారు ప్రవచన తరగతులలో పవిత్రులు కాగలరనిపించినది. ఈ ప్రయోగము సుందర సత్సంగ సభ్యుల మీదనే జరుపాలని నిర్ణయించుకొని, ప్రవేశ

దరఖాస్తులను ప్రవేశపెట్టి ప్రథమ శ్రేణికి ఎనుబదిమంది సభ్యులను రాజమండ్రి, కొవ్వూరు సత్సంగాల నుండి తీసుకొనడము జరిగినది.

ఆగష్టు మాసంలో తరగతులు ప్రారంభమయ్యాయి. ఆది శంకరులవారు రచించిన ఈ తత్త్వబోధ ప్రకరణ గ్రంథముపై ప్రవచనము సాగించుటకు నిర్ణయించుట జరిగినది.

ఉదయం ఆరుగంటలకు తరగతులు ప్రారంభమయ్యేవి. అప్పటికే భక్తులందరూ ఆశ్రమంచేరి ఆర్తిలో తత్త్వబోధను గ్రహించుటకు తయారయ్యేవారు. పుస్తకము కలమును చేబూని కూర్చునేవారు.

తరగతిలో ఉపాధ్యాయుని రీతిన నల్లబల్లముందు నిలబడి నేను ప్రవచనమును ప్రారంభించేవాడిని. సంస్కృత వాక్యాలను నల్లబల్లపై వ్రాసేవాడిని. వాటి భావాన్ని కూడా చెప్పేవాడిని. వారు వ్రాసుకొన్న తరువాత దానిపై ప్రబోధము సాగించేవాడిని. వారికి అర్థమయిందని గ్రహించగానే, ముక్తసరిగా, సంక్షిప్తముగా నోట్సు చెప్పేవాడిని.

ప్రవచన తరగతులకు హాజరయ్యే ముముక్షువు లెల్లరు ఏరోజు పాఠాలను ఆరోజే చదివేవారు. ఇలా పండ్రెండు రోజులు తత్త్వబోధ తరగతులు కొనసాగాయి. సంప్రదాయ పరిధిలో శాస్త్రమును గ్రహించి ముముక్షువులు తృప్తి చెందారు. వారిలో అంకురించిన అవగాహన నన్ను విస్మయ మొందించినది. రెండు సంవత్సరాల నుండి సాగించిన నిర్విరామ కృషి వలన లభించని ఫలితము ఈ పండ్రెండు రోజుల కాలములో లభించినట్లయినది.

నేనూ తృప్తి చెందాను. భక్తులూ సంతృప్తి చెందినారు. ఈ ఆనందాన్ని తిలకించిన మరికొందరు భక్తులు తామూ ఈ తత్త్వ బోధను వినాలని పట్టుపట్టినారు. రెండవశ్రేణిని నవంబరు మాసములో చేర్చుకొనడము జరిగినది. పండ్రెండురోజులు తరగతులను నడపి వంద మందికి శిక్షణ ఇవ్వడము జరిగినది.

మొదటి బాచ్‌కన్నా రెండవ బాచ్‌లో శిక్షణ బహుముఖంగా నడిచింది.

ఈ అవకాశమును సుందర సత్సంగా లన్నింటికి కల్పించాలని నా అభిలాష. ఇంతలో నవంబరు 22 నుండి కరీంనగర్ జిల్లా కోరుట్లలో గీతా యజ్ఞము ప్రారంభమైనది. అచ్చటికి 20 కిలోమీటర్ల దూరమున ఉన్న జగిత్యాల పట్టణములోని సుందర సత్సంగ సభ్యులకు ఉదయం సమయాలలో తత్త్వబోధ ప్రవచన తరగతులను ఏర్పాటు చేయడం జరిగినది. 150 మంది సభ్యులతో తరగతులు అత్యంత ఆకర్షణీయంగా జరుగుచున్నాయి.

"స్వామీజీ! 'తత్త్వబోధ' పై మీ వ్యాఖ్యానము వెలువడితే మాకెంతో ఉపకరిస్తుంది" అని భక్తులు అడుగుతున్నారు. కోరుట్లలో ఉపన్యసించాలి. అక్కడ నుండి బయలుదేరి వచ్చి జగిత్యాలలో ప్రవచన తరగతులు నిర్వహించాలి. మధ్యమధ్యలో మా గృహాలకు విచ్చేయండి అని భక్తులు. కలం కదిలిద్దామనుకొంటే కాలం కలిసిరావడం లేదు. ఎలాగైనా ఈ రోజు ప్రారంభించాలనుకొని మొదలెడుతున్నాను. డిసెంబరు 25వ తేది ఈ గ్రంథాన్ని నా జన్మదిన సందర్భముగా జగిత్యాలలో విడుదల చేయాలని సంకల్పముతో ప్రారంభిస్తున్నాను.

విషయం ఆచార్యులవారి అనుగ్రహము. వ్యాఖ్యానము వాసుదేవుని ప్రసాదము. కలమొకరిది. కాగితములు మరొకరివి. సిరి ఒకరిది. సిరా ఇంకొకరిది. నాదంటూ ఏదీలేని ఈ రచనా వ్యాసంగములో అహంకారమును దూరం చేసుకొని, ఆరాధనా భావంతో ఆనందించడము కన్నా నేను అభిలషించే దేముంటుంది ?

నమస్తే

జగిత్యాల
27-11-86

ప్రణవ ప్రేమలతో
మీ
స్వామి సుందర చైతన్యానంద

తత్త్వబోధ

వేదాంత శాస్త్రము మానవునకు ప్రధాన ప్రయోజనకారియై యున్నది. ప్రమాణమునందించి జీవికి ప్రమోదమును కలిగించి ఆత్మవిదునిగా మార్చెడి వేదాంతశాస్త్రము సులభగ్రాహ్యమగునది కాదు. అట్టి ప్రామాణిక గ్రంథరాజమగు వేదాంతశాస్త్రమును ప్రారంభ విద్యార్థులకొరకు అనుభవమునకు తెచ్చుకొనుట బహుకష్టము. శాస్త్ర సంబంధమైన పరిభాషాపదములు తెలియనిదే శాస్త్రమును గ్రహించుట దుర్లభము. శాస్త్రపదజాలమును, పరిభాషను ప్రవేశపెట్టి సదవగాహనను కల్పించెడి ఉత్తమ గ్రంథమే ఈ తత్త్వబోధ.

ప్రారంభ విద్యార్థులకొరకు శ్రీ శంకరాచార్యులవారు రచించిన ఈ తత్త్వబోధ గ్రంథము వేదాంతశాస్త్రమునందు ప్రథమ గ్రంథమై, ప్రారంభ గ్రంథమై యున్నది. వేదాంత జ్ఞాన సముపార్జనకు ఆరంభ గ్రంథమైన ఈ తత్త్వబోధ యనెడి గ్రంథము ప్రారంభకులైన ముముక్షువుల పాలిటి పీయూషమై ఉన్నది. ఆదిశంకరుల వారి అమృతలేఖిని నుండి జాలువారిన ఈ తత్త్వజ్ఞాన మణులు మానవుని జీవనయాత్రలోని అంధకారమును తొలగించు నిత్యకాంతి పుంజములై ఉన్నవి.

అపర శివావతారమూర్తియైన శ్రీ శంకరులు మహిమాన్వితమైన ఎన్నియో అద్భుత గ్రంథములను విశేషముగా రచించినారు. జటిలమైన ప్రస్థానత్రయ వ్యాఖ్యలను అందించిన ఆ మహాజ్ఞాని ప్రారంభకులకు ఉపయుక్తమగు ఈ తత్త్వబోధ గ్రంథమును రచించుట ఆలోచనా పరులకు ఆశ్చర్యమును కలిగిస్తుంది. సర్వమానవాళిని తరింప జేయవలెననెడి వారి శుభసంకల్పమే ఈ గ్రంథరచనకు నాంది పల్కినదని నా అభిప్రాయము. అవగాహనలేకుండా శాస్త్రారణ్యములో పరిభ్రమించుచు, దారితప్పి దురవగాహనా కంటకముల మధ్య కుమిలిపోతున్న అయోమయజీవులను బాటవైపుకు మరలించి,

తరింపజేయవలె ననెడి పవిత్రాశయమే ఈ గ్రంథ రచనకు శ్రీవారిని పురికొల్పినది. ఆచార్య హృదయము అమృతమయమని, ప్రేమరసార్ణవమని ఇచ్చట మరియొకసారి ఋజువు చేయబడినది.

అయితే ఈ తత్త్వబోధ గ్రంథము కేవలము ప్రారంభకుల కొరకేనని నేను అభిప్రాయపడుటలేదు. ఈ గ్రంథము సర్వవేదాంత సిద్ధాంత సార సంగ్రహమును తెలుపుటచేత జ్ఞానాజ్ఞానములతో సంబంధములేక ప్రతి ఒక్కరు చదువదగిన పవిత్ర గ్రంథము.

అద్దము రూపవంతులకు, రూపహీనులకు ఇరువురికి ఉపయోగ పడుతుంది. రూపహీనులగువారు తమను తాము అలంకరించుకొని రూప వంతులయ్యేందుకు ఉపకరిస్తుంది. రూపవంతులగువారు తమ రూప లావణ్యమును దర్శించుకొని సంతృప్తి చెందేందుకు ఉపయుక్తమవుతుంది.

అలాగుననే ఈ తత్త్వబోధ గ్రంథము అవగాహన లేనివారికి అవగాహనను అందిస్తుంది. అవగాహన కుదిరినవారికి ఆత్మానందమును ముందుంచుతుంది.

గుహ్యమైన వేదాంత రహస్యములను జీర్ణించుకొనుటకు ఉపయోగపడే ఈ తత్త్వబోధ గ్రంథము సర్వులును పఠించదగిన పవిత్ర గ్రంథము. నిత్యపారాయణవలె అనుసంధానము చేయవలసిన ప్రకరణ గ్రంథము. ప్రామాణిక గ్రంథము. ఉపనిషత్తులకు ఈ గ్రంథము సముచిత ఉపోద్ఘాతము అని భావించాలి. సంప్రదాయమును చక్కగా దర్శింపజేసే ఈ తత్త్వబోధ గ్రంథము మంగళాచరణ శ్లోకము ద్వారా సంప్రదాయమును ఆవిష్కరిస్తూ ఆరంభమగుచున్నది.

మంగళ శ్లోకము

వాసుదేవేన్ద్ర యోగీన్ద్రమ్
నత్వా జ్ఞానప్రదం గురుమ్
ముముక్షూణాం హితార్థాయ
తత్త్వ బోధోభి ధీ యతే

భావము :– యోగులకు ప్రభువును, జ్ఞాన ప్రదాత యగు గురువును అగు శ్రీ వాసుదేవునకు నమస్కరించి, ముముక్షువులకు హితమును గూర్చెడి తత్త్వబోధ చెప్పబడుచున్నది.

వ్యాఖ్య

ఇది మంగళశ్లోకము. ఈ శ్లోకమునందు మంగళాచరణము చేయబడు చున్నది. ఒక గ్రంథమును ప్రారంభించేముందు మంగళాచరణము చేయుట శిష్టాచార సంప్రదాయము. ఈ మంగళాచరణము ద్వారా భగవంతుని ప్రార్థించుటయు, లేక గురువును ప్రార్థించుటయు జరుగును. ఇట్టి ప్రార్థన వలన చేపట్టిన కార్యము నిర్విఘ్నముగా కొనసాగును.

"నిర్విఘ్న పరిసమాప్తి కామః మంగళ మాచరేత్"

ఆశించిన విషయము విఘ్నములకు లోనుగాకుండా పరిసమాప్తి నొందవలెననెడి భావనయే మంగళాచరణములోని ప్రధానాశయమై ఉన్నట్లు వేదముకూడా చెబుతున్నది.

భగవదనుగ్రహం లేనిదే ఏపనియును నెరవేరదు. భగవదనుగ్రహాన్ని హృదయంలో ఆవిష్కరించుకొని పనిని నిరాటంకముగా పూర్తి చేయుటకే ప్రార్థన ఏర్పడియున్నది.

శ్రీ శంకరాచార్యులవారు ఈ తత్త్వబోధ ప్రకరణమును ప్రారంభించే ముందు యోగులకు ప్రభువునైన యోగీశ్వరుడగు శ్రీకృష్ణ పరమాత్మకు నమస్కరించుచున్నారు. శ్రీకృష్ణుని జ్ఞాన ప్రదాతయగు సద్గురువు యని కీర్తించుచున్నారు. శ్రీకృష్ణుని వాసుదేవుడని కీర్తించడము జరిగినది.

"వాసవత్సర్వ భూతానాం"

సర్వభూతములలో వసించువాడు లేదా రమించువాడు వాసుదేవుడని మహాభారతము నిర్వచించినది. కనుక వాసుదేవ పదప్రయోగము ద్వారా సర్వభూతాంతరాత్మయగు పరమాత్మను స్తుతించుట జరుగుచున్నది యని మనకు అవగత మగుచున్నది.

'ఛాదయామి జగత్సర్వం, భూత్వా సూర్య ఇవాంశుభిః'

"భానుడు తనకిరణములచే సమస్తమును కప్పివేయునట్లు, నేను నా విభూతిచే జగత్తునంతటిని కప్పివేయుచున్నాను" అని మహాభారతము శాంతిపర్వమునందు భగవానుడు తెలిపియుండుటచేత, శ్రీకృష్ణుడుగా జన్మించగనే ద్వాదశ వ్యూహావతారములను అదుపులో నుంచుకొని జన్మించి, జగత్తును తన మాయతో నింపి వాసుదేవుడాయెను.

వాసుదేవుడగు శ్రీకృష్ణపరమాత్మ యోగీంద్రుడై యున్నాడు. అనగా యోగులకు యోగియై యున్నాడు. యోగులగువారు జ్ఞానమును ప్రయత్న పూర్వకముగా సాధిస్తారు. కానీ భగవానుని జ్ఞానము అలా గ్రహించబడినది కాదు. తాను జ్ఞానస్వరూపుడై నందున ప్రత్యేకించి తాను జ్ఞానమును పొంద నవసరము లేదు. అదియునుగాక యోగులైన వారు జన్మించి, జీవించుటలో జ్ఞానార్జన చేసి తరిస్తారు. శ్రీకృష్ణుడు ఆద్యపురుషుడైనందున తాను పుట్టే వాడు కాదు. కనుక జ్ఞానమును కాలములో వంటపట్టించుకొనే వాడూ కాదు. సృష్టికర్తయైన తాను సృష్టికి పూర్వమే ఉండినవాడు గనుక జ్ఞానము కూడా తన నుండియే కదలవలసి ఉన్నది. అట్టి ఆదినారాయణుడు తానే ప్రథమ గురువుయై గురు పరంపర అనెడి విశిష్టాచారమునకు ఆశీర్వచనము నందించి యున్నాడు. అందుచేత వాసుదేవుడు యోగులకు యోగియైనాడు. ప్రథమ గురువైనాడు. జ్ఞాన ప్రదాత అయినాడు. అట్టి ఆద్యపురుషుడగు వాసుదేవునకు నమస్కరించుచూ ఈ గ్రంథమును శ్రీ శంకరాచార్యులవారు ప్రారంభించు చున్నారు.

ప్రారంభ శ్లోకము, ప్రథమ శ్లోకమునైన ఈ మంగళాచరణ శ్లోకము ద్వారా భగవానునికి నమస్కరించి, తన గురుదేవుడైన గోవింద భగవత్పాదుల వారికి కూడా నమస్కరించుచున్నారు. వాసుదేవ నామము గోవింద యనెడి

పదమునకు పర్యాయపదమై ఉండుట చేత ఈ శ్లోకమునందు తన గురుదేవులను కూడా శంకరులు ప్రార్థించినట్లు తెలియుచున్నది.

" గో" అనగా భూమి అనికూడా అర్థము. సమస్తమైన జగత్తును వ్యాప్తి చెందియుండుటచేత శ్రీకృష్ణుడు వాసుదేవుడు కాగా, జగత్తును ఉద్ధరించు వాడగుటచేత తానే గోవిందు డాయెను.

"వసన్తి భూతాని తత్ర, తేష్వయమపి వసతీతి వసుః "

సమస్త భూతములు తనయందును, తాను భూతముల యందును ఉండుటచేత తాను వాసుదేవుడు కాగా, ఈ తత్త్వార్థమును గ్రహించుట ద్వారా తెలియబడెడివాడు గోవిందుడై ఉండుటచేత వాసుదేవ గోవింద నామములు పర్యాయపదములై యున్నవి.

" గోభిర్వేదాన్త వాక్యైరేవ విన్ద్యతే లభ్యత ఇతి గోవిన్దః "

"వేదాంత గ్రంథముల ద్వారా వ్యక్తమగువాడు గోవిందుడు " అని భావము. కనుక ఈ మంగళాచరణ శ్లోకమునందు వాసుదేవుడని సంబోధించుట వలన ప్రథమ గురువుయైన నారాయణుని, ప్రధాన గురువుయైన గోవింద భగవత్పాదులను ఇరువురిని స్మరించి, ధ్యానించి శ్రీ శంకరులు గ్రంథారంభమును చేయుచున్నారు.

ఈ గ్రంథముయొక్క ఉపయోగమేమి ? లాభము లేనిదే ఏ బండియును నడవదు. గ్రంథము యొక్క ప్రయోజనము అవగతము కానిదే ఎవ్వరును గ్రంథమును అధ్యయనము చేయరు. ఈ విషయమును విశదపరచుచు "ముముక్షూణాం హితార్థాయ " అని శ్రీ శంకరులు తెలుపుచున్నారు. మోక్షాపేక్ష గలిగి చరించు తీవ్ర వైరాగ్యవంతులగు సాధకులకు ఉపకరించు ననెడి భావముతో శ్రీ శంకరులు ఈ తత్త్వబోధ యనెడి గ్రంథమును రచించు చున్నట్లు తెలుపుచున్నారు.

ప్రారంభ శ్లోకమైన ఈ ప్రార్థనా శ్లోకము మంగళ శ్లోకమని తెలును కున్నాము. గ్రంథారంభము మంగళాచరణము ద్వారా జరుగవలెననుట సంప్రదాయమని గూడా గ్రహించాము. సంప్రదాయమును వదలి నడక సాగించువాని ప్రయాణము కంట కారణ్యములకే నని గ్రహించాలి. సంప్రదా

"వాసవత్సర్వ భూతానాం"

సర్వభూతములలో వసించువాడు లేదా రమించువాడు వాసుదేవుడని మహాభారతము నిర్వచించినది. కనుక వాసుదేవ పదప్రయోగము ద్వారా సర్వభూతాంతరాత్మయగు పరమాత్మను స్తుతించుట జరుగుచున్నది యని మనకు అవగత మగుచున్నది.

'ఛాదయామి జగత్సర్వం, భూత్వా సూర్య ఇవాంశుభిః'

"భానుడు తనకిరణములచే సమస్తమును కప్పివేయునట్లు , నేను నా విభూతిచే జగత్తు నంతటిని కప్పివేయుచున్నాను" అని మహాభారతము శాంతిపర్వమునందు భగవానుడు తెలిపియుండుటచేత, శ్రీ కృష్ణుడుగా జన్మించగనే ద్వాదశ వ్యూహావతారములను అదుపులో నుంచుకొని జన్మించి, జగత్తును తన మాయతో నింపి వాసుదేవుడాయెను.

వాసుదేవుడగు శ్రీ కృష్ణపరమాత్మ యోగీంద్రుడై యున్నాడు. అనగా యోగులకు యోగియై యున్నాడు. యోగులగువారు జ్ఞానమును ప్రయత్న పూర్వకముగా సాధిస్తారు. కానీ భగవానుని జ్ఞానము అలా గ్రహించబడినది కాదు. తాను జ్ఞానస్వరూపుడై నందున ప్రత్యేకించి తాను జ్ఞానమును పొంద నవసరము లేదు. అదియునుగాక యోగులైన వారు జన్మించి, జీవించుటలో జ్ఞానార్జన చేసి తరిస్తారు. శ్రీ కృష్ణుడు ఆద్యపురుషుడైనందున తాను పుట్టే వాడు కాదు. కనుక జ్ఞానమును కాలములో వంటపట్టించుకొనే వాడూ కాదు. సృష్టికర్తయైన తాను సృష్టికి పూర్వమే ఉండినవాడు గనుక జ్ఞానము కూడా తన నుండియే కదలవలసి ఉన్నది. అట్టి ఆదినారాయణుడు తానే ప్రథమ గురువుయై గురు పరంపర అనెడి విశిష్టాచారమునకు ఆశీర్వచనము నందించి యున్నాడు. అందుచేత వాసుదేవుడు యోగులకు యోగియైనాడు. ప్రథమ గురువైనాడు. జ్ఞాన ప్రదాత అయినాడు. అట్టి ఆద్యపురుషుడగు వాసుదేవునకు నమస్కరించుచూ ఈ గ్రంథమును శ్రీ శంకరాచార్యులవారు ప్రారంభించు చున్నారు.

ప్రారంభ శ్లోకము, ప్రథమ శ్లోకమునైన ఈ మంగళాచరణ శ్లోకము ద్వారా భగవానునికి నమస్కరించి, తన గురుదేవుడైన గోవింద భగవత్పాదుల వారికి కూడా నమస్కరించుచున్నారు. వాసుదేవ నామము గోవింద యనెడి

పదమునకు పర్యాయపదమై ఉండుట చేత ఈ శ్లోకమునందు తన గురుదేవులను కూడా శంకరులు ప్రార్థించినట్లు తెలియుచున్నది.

" గో" అనగా భూమి అనికూడా అర్థము. సమస్తమైన జగత్తును వ్యాప్తి చెందియుండుటచేత శ్రీ కృష్ణుడు వాసుదేవుడు కాగా, జగత్తును ఉద్ధరించు వాడగుటచేత తానే గోవిందు డాయెను.

"వసన్తి భూతాని తత్ర, తేష్వయమపి వసతీతి వసుః "

సమస్త భూతములు తనయందును, తాను భూతముల యందును ఉండుటచేత తాను వాసుదేవుడు కాగా, ఈ తత్త్వార్థమును గ్రహించుట ద్వారా తెలియబడెడివాడు గోవిందుడై ఉండుటచేత వాసుదేవ గోవింద నామములు పర్యాయపదములై యున్నవి.

" గోభిర్వేదాన్త వాక్యైరేవ విన్ద్యతే లభ్యత ఇతి గోవిన్దః "

"వేదాంత గ్రంథముల ద్వారా వ్యక్తమగువాడు గోవిందుడు " అని భావము. కనుక ఈ మంగళాచరణ శ్లోకమునందు వాసుదేవుడని సంబోధించుట వలన ప్రథమ గురువుయైన నారాయణుని, ప్రధాన గురువుయైన గోవింద భగవత్పాదులను ఇరువురిని స్మరించి, ధ్యానించి శ్రీ శంకరులు గ్రంథారంభమును చేయుచున్నారు.

ఈ గ్రంథముయొక్క ఉపయోగమేమి ? లాభము లేనిదే ఏ బండియును నడవదు. గ్రంథము యొక్క ప్రయోజనము అవగతము కానిదే ఎవ్వరును గ్రంథమును అధ్యయనము చేయరు. ఈ విషయమును విశదపరచుచు "ముముక్షూణాం హితార్థాయ " అని శ్రీ శంకరులు తెలుపుచున్నారు. మోక్షాపేక్ష గలిగి చరించు తీవ్ర వైరాగ్యవంతులగు సాధకులకు ఉపకరించు ననెడి భావముతో శ్రీ శంకరులు ఈ తత్త్వబోధ యనెడి గ్రంథమును రచించు చున్నట్లు తెలుపుచున్నారు.

ప్రారంభ శ్లోకమైన ఈ ప్రార్థనా శ్లోకము మంగళ శ్లోకమని తెలుసు కున్నాము. గ్రంథారంభము మంగళాచరణము ద్వారా జరుగవలెననుట సంప్రదాయమని గూడా గ్రహించాము. సంప్రదాయమును వదలి నడక సాగించువాని ప్రయాణము కంట కారణ్యములకే నని గ్రహించాలి. సంప్రదా

యమును తెలిసిన గురువే శాస్త్రమును శాస్త్రీయముగా బోధించగలడు. సంప్రదాయమును తెలియని శాస్త్రజ్ఞుడు శాస్త్రమును బోధించవచ్చు. కానీ అది శాస్త్రీయముగా ఉంటుందని చెప్పలేము. ఉండదు కూడా.

"అసంప్రదాయవిత్ సర్వశాస్త్రవిదపి మూర్ఖవదేవ ఉపేక్షణీయః"

" సంప్రదాయము నెరుగనివాడు ఎంతటి పండితుడైనను మూర్ఖుడేనని భావించి ఉపేక్షించవలెనని శ్రీ శంకరులవారు తమ గీతాభాష్యములో తెలిపియున్నారు.

కనుకనే ఈ తత్త్వబోధ గ్రంథమును శ్రీ ఆచార్యులవారు సంప్రదాయము ననుసరించి మంగళాచరణము ద్వారా ప్రారంభించుచున్నారు. ప్రార్థనా రూపమైన ఈ మంగళ శ్లోకములో ఈ తత్త్వబోధ గ్రంథము తెలియజేయు విషయమును, దీనిని గ్రహించుటకు అధికారిని, దీనిని బోధించు పద్ధతిని, ఈ గ్రంథము యొక్క సంబంధ ప్రయోజనములను తెలియజేయుచున్నారు. మంగళాచరణము నందు ఈ విషయములన్నియు తెలుపబడి యుండాలి. ఇది సంప్రదాయము.

అనుబంధ చతుష్టయము

మంగళాచరణమునందు తెలియబడు నాలుగు విషయములను అనుబంధ చతుష్టయము అందురు. అవి (1) విషయము (2) ప్రయోజనము (3) అధికారి (4) సంబంధము.

(1) విషయము :-

విషయము అనగా ఈ గ్రంథమునందు వివరించబడిన విషయము అని భావము. అయితే మంగళ శ్లోకమునందు "తత్త్వబోధ " యనెడి పదము నుపయోగించుట చేత ఈ గ్రంథము పరమాత్మకు సంబంధించిన జ్ఞానమును బోధించునదియై యున్నది. అంతియేగాక "జ్ఞానప్రదం" అనెడి పదమును కూడా ప్రవేశపెట్టుటచేత ఇది కేవలం శాస్త్రీయ అవగాహననేగాక, అనుభవ జ్ఞానమును బడయుటకు కూడా ఉపకరించునదియై యున్నదని తెలియుచున్నది.

(2) ప్రయోజనము :-

శాస్త్రాధ్యయనము ద్వారా కలిగెడి ఉపకారమును ప్రయోజనము అందురు. ఈ గ్రంథములోని మంగళశ్లోకమునందు "ముముక్షూణాం హితార్థాయ " అనుట వలన మోక్షాపేక్ష గల సాధకులకు ఉపకరించు గ్రంథమని తెలియుచున్నది. దీని ప్రయోజనము ముక్తికి సంబంధించినదియే గాని భుక్తికిగాని, విషయానురక్తికి గాని సంబంధించినది కాదు అని తెలియుచున్నది. ఇది ముక్తి ప్రదాయక విషయమని అవగతమగుచున్నది.

(3) అధికారి :-

గ్రంథమునందలి విషయమును గ్రహించుటకు గల అర్హతను కలిగియున్నవాడు 'అధికారి' యనబడును. అర్హత లేనివాడు అధికారి కాలేడు. అధికారి కానివాడు అధ్యయనమునకు పనికిరాడు. అయితే ప్రస్తుత శ్లోకము నందు "ముముక్షూణాం " అనెడి పదము ప్రయోగించబడుటచేత దీనిని గ్రహించుటకు అధికారులు ఇంద్రియ పిపాస గల విషయాసక్తులు గాక, జ్ఞానాపేక్ష గల ముముక్షువులని తెలియుచున్నది.

(4) సంబంధము :-

ఇచ్చట సంబంధమనగా బోధ్య బోధక సంబంధమని భావము. ప్రయోజనమైన మోక్షమును గ్రహించుటకు ఇందు తెలియజేయబడిన తత్త్వబోధ ఎలా తగియున్నదో ఆ రెండింటియొక్క సమన్వయమును అవగతమొనర్చు నదియే సంబంధము అగును. అయితే ఈ మంగళ శ్లోకమునందు "జ్ఞానప్రదం" అనెడి పదప్రయోగమువలన ప్రవచించబడెడి విషయము బ్రహ్మమని తెలియుచున్నది. "తత్త్వబోధ" అనెడి పదప్రయోగము వలన గ్రహింపజేయునది వేదాంత ప్రమాణమని తెలియుచున్నది.

అధికారి

మన శిష్టాచార సంప్రదాయమునందు తత్త్వవిచారము గురుశిష్య సంవాద రూపమున నడచును. తత్త్వమనునది బాహ్యమున లభించే వస్తువు కాదు. అంతర్య లోతులలో అనుభవరూపముగా అందెడి ఈ తత్త్వజ్ఞానమును అందించెడి గురువు శ్రోత్రియ బ్రహ్మనిష్ఠుడై ఉండాలి. అట్టివాడే సత్యమును

ప్రవచించి శిష్యుని యోగ్యునిగా తీర్చిదిద్దగలడు. గురువు శ్రోత్రియుడైనంత మాత్రాన, బ్రహ్మనిష్ఠత్వం కలిగియున్నంత మాత్రాన తాను బోధించు విష యము శిష్యునికి వంటబడుతుందని చెప్పజాలము. శిష్యుడు కూడ అర్హత కలి గినవాడై యుండాలి. శిక్షణ యోగ్యుడై ఉండాలి. అప్పుడే గురుబోధను గ్రహించి తరించగలడు. ఈ "తత్త్వబోధ" గ్రంథములోని విషయము, ప్రయో జనము, సంబంధములు మనకు అవగతమయినవి. అనుబంధ చతుష్టయములో అతి ముఖ్యమగు అధికారిని గూర్చి మనము తెలుసుకొనవలసియున్నది. ముముక్షువైనవాడు అధికారి యని గ్రహించాము. అట్టి ముముక్షువునకు ఉండ వలసిన అర్హత ఏమిటి ? ఈ విషయమే సాధన చతుష్టయము నందు చర్చించబడును.

సాధనచతుష్టయ సంపన్నాధికారిణాం మోక్ష
సాధనభూతం తత్త్వవివేక ప్రకారం వక్ష్యామః

భావము :- సాధన చతుష్టయ సంపద కలిగిన అధికారులగు ముముక్షువులకు మోక్షసాధన మార్గమగు తత్త్వవివేకము అనెడి విషయమును చెప్పుచున్నాము.

వ్యాఖ్య

సద్గురువు అందించుట వలననే తత్త్వజ్ఞానము లభించదు. గురువు అందించు విషయమును గ్రహించుటకు శిష్యుడు తగినవాడై యుండాలి. ఇదియే శిష్యుని అర్హతయై ఉన్నది. మందును సేవించుటకు రోగియే అధికారి. ఆహారమును భుజించుటకు ఆకలి యున్నవాడే అధికారి. జలపానము చేయుటకు దప్పిక యున్నవాడే అధికారి. అలాగే తత్త్వజ్ఞానమును బడయుటకు సాధన చతుష్టయ సంపద కలిగినవాడే అధికారి. అధికారియగు ముముక్షువునకు అందించబడు విషయము తత్త్వవివేకము. ఇది మోక్షము నొందుటకు ఉపకరించునదియైయున్నది.

'యదస్తి తత్ సత్యం యద్ నాస్తి తదల్పం'

ఉన్నదేదియో అదియే సత్యము. లేనిదేదియో అది అసత్యము. ఉండుటయనగా త్రికాలములయందు ఉండి, కాలాతీతముగా మనుగడను కలిగి యుండుట అని అర్థము. లేకపోవుట యనగా ఒక కాలము నందే గోచరించుచు, భ్రాంతి తొలగిన దశలో కనుమరుగగునది అని భావము. రజ్జు

సర్పభ్రాంతిలో త్రాడు సత్యము గనుక అది ఎప్పుడూ ఉన్నది . త్రాటిలో తెలిసిన పాము అసత్యము గనుక ఎప్పుడునూ లేనిదే యగుచున్నది. అసత్య మైన సర్పము సత్యముగా తెలియుటయే అజ్ఞానము. అజ్ఞానము తొలగి నపుడే సత్యము అనుభవమునకు అందును. అజ్ఞానము ఎలా నివృత్తి యగును ? సూర్యుని వెలుగు అంధకారమును అదృశ్యము చేయునట్లు, జ్ఞాన వెలుగులోనే అజ్ఞానాంధకారము పటాపంచలగును. అర్హత కలిగిన ముముక్షువు లభ్యమైనపుడే ఇది సాధ్యపడును. ముముక్షువునకు ఉండ వలసిన ఆ అర్హత ఏమిటి? సాధన చతుష్టయ సంపదయే ముముక్షువునకు ఉండవలసిన ముఖ్యార్హత. అట్టి సాధన చతుష్టయ సంపద కలిగిన ముముక్షువులకు బోధించదగినదియగు "తత్త్వబోధ" ను చెప్పుచున్నాము అంటున్నారు శ్రీ శంకరులు. అయితే ఈ గ్రంథమునకు గ్రంథకర్త శ్రీ శంకరులై యుండ, "చెప్పుచున్నాము" అని బహువచన ప్రయోగమును చేయుటలోని అంత రార్థమేమి ?.

ఇదికూడా సంప్రదాయమే. జ్ఞానము కలిగిన మహాత్ములు అహం కారమును కలిగియుండరు. "నేను చెప్పుచున్నాను" అని పలుకరు. అదియును గాక తాను ఈనాడు బోధించుచున్న విషయము ఒకనాడు తన గురువు తనకు బోధించినదియే. నాడు తాను శిష్యుడైయుండి గురువు ద్వారా గ్రహిం చిన విషయమును నేడు తాను గురువై తన శిష్యులకు బోధ చేయు చున్నాడు. ఈ సనాతన జ్ఞాన ప్రదాన స్రవంతిలో ఎందరో గురువులు కదులుతారు. శిష్యుల యెదలను అమృతముతో నింపుతారు. శాశ్వత జ్ఞానాన్ని అందించిన తాము అశాశ్వత శరీరములను వదలి ఆప్తకాములై అంతర్ధాన మవుతారు. ఏ గురువు ఏ కాలములో ఏ శిష్యునికి బోధించినను విషయము మాత్రము ఒక్కటియే అయి వుంటుంది. సర్వగురువుల బోధలన్నియు సమస్తమును సర్వేశ్వర రూపముగా శిష్యులకు దర్శింప జేయుటయే. అందు చేత సత్యద్రష్టలైన గురువుల అభిప్రాయము లన్నియు ఒక్కటియే అయి యున్నందున బోధలో భేద దర్శనము వాంఛనీయము గాదని తెలుపు నుద్దేశ్యముతో శ్రీ శంకరులు ఇచ్చట బహువచన ప్రయోగము జేసినారు.

ముముక్షువునకు ఉండవలసిన సాధన చతుష్టయ సంపదను కలిగియున్న వాడు మాత్రమే సత్యమును సాక్షాత్కరించు కొనగలడని తెలియజేయుచు శ్రీ శంకరులవారు సాధన చతుష్టయ సంపదను గూర్చి వివరించబోవుచున్నారు.

సాధన చతుష్టయము

సాధన చతుష్టయమ్ కిమ్ ?

భావము :– సాధన చతుష్టయ మనగా నేమి ?

నిత్యానిత్యవస్తు వివేకః
ఇహాముత్రార్థ ఫలభోగ విరాగః
శమాది షట్క సంపత్తి :
ముముక్షుత్వం చేతి

భావము :– నిత్యానిత్య వస్తు వివేక జ్ఞానము, ఇహలోక, పరలోక భోగముం యందు, కర్మఫలములయందు నైరాశ్యము కలిగి యుండుట, శమాది షట్కసంపత్తిని కలిగి యుండుట, మోక్షాపేక్ష కలిగియుండుట అనెడి ఈ నాలుగు విషయములను సాధన చతుష్టయము అందురు.

నిత్యా నిత్య వస్తు వివేకః కః ?

భావము :– నిత్యానిత్య వస్తు వివేక మనగా నేమి ?

నిత్యవస్త్వేకం బ్రహ్మ తద్వ్యతిరిక్తం సర్వమనిత్యం !
అయమేవ నిత్యానిత్య వస్తు వివేకః

భావము :– బ్రహ్మమొక్కటియే నిత్యవస్తువు .దానికి అన్యమైనది, వ్యతిరిక్తమైనది అంతయూ అనిత్యము. ఇదియే నిత్యానిత్య వస్తు వివేకము.

వ్యాఖ్య

మారుతున్న వస్తువుల మధ్య మారని సత్య వస్తువు బ్రహ్మము. సత్యమైన వస్తువు నిత్యమై యుండుటచేత అది మారేందుకు వీలులేదు. నిత్యవస్తువు అనంతమై యుండవలెను గాన అది తనలో తాను మారలేదు; మరియొక వస్తువులో దూరలేదు. దూరము తెలియని తాను ఎలా దూరుతుంది ? కాలము తెలియని తాను ఎలా కదులుతుంది ?

సత్యవస్తువునకు రూపంలేదు. కనుక దానికి నామము ఉండదు. నామరూపాలు తెలియని సత్యవస్తువు నశించేదుండదు. దానికి సమమైనది

ఉండదు. విషమమైనది కూడా ఉండదు. అద్వయమైన తనలో ఈ భేదాలు దర్శించను వీలు పడదు. ఉన్నది అదియే. అదియే బ్రహ్మము.

మారుతున్న దంతయు అనిత్యమైనదియే. సత్య వస్తువు మారనిదై యున్నందున మారుతున్నట్లు తెలిసెడి సమస్తమునకు వ్యతిరిక్తమై యున్నది. మారే సర్వమునకు తాను అతీతముగా ఉండి, ఆ సర్వమును తనలోనే కలుపుకొని ఏదయితే ఉన్నదో అదియే సత్యము. మారే వస్తువు బ్రహ్మము అయినచో అది దేశకాలాదులనెడి వలలో తగులుకొని పరిమితమగును. పరిమితమైన వస్తువు అనంతము కానేరదు. సత్యము కానేరదు.

ఏది మనకు గోచరించినను, పరిశీలించి చూచినచో అందులో సత్య వస్తువు గోచరించును. గోచరించెడి వస్తువులు అదృశ్యమగుచున్నవి. అగుపించినవి గనుక వస్తువులు అదృశ్య మగుచున్నవి. వస్తువులు అగుపించుటకు ఆధారమైన సత్యవస్తువు వలననే వస్తువులు అదృశ్యమైనవి అనెడి సత్యము కూడా బుద్ధికి అందుచున్నది. బాహ్య ప్రపంచములో తెలియ వచ్చెడి వస్తువుల యొక్క రూపములు మార్పు చెందుచున్నవి. ఈ మార్పులే జనన మరణములని తెలియుచున్నవి. రూపములు మార్పు చెందుచున్నవి. పరిస్థితులు మార్పు చెందుచున్నవి. భావములు మార్పుచెందుచున్నవి. భావ శూన్యతకూడా మారుచున్నది. అయితే ఇలా మార్పు చెందెడి సమస్తమును గ్రహించెడి సత్యవస్తువు మార్పు చెందునది కాదు గనుక జనన మరణాలు ఎరుగదు. కాలముచే కట్టుబడదు.

కాలమనేది మానసిక భావనయే. మానసిక భావనయే కాలమై యున్నందున కాలమును గూర్చి చర్చించిన ప్రయోజనముండదు. దేశ కాలాదులు ఒకదానిపై మరియొకటి ఆధారపడి యుండుట చేత సత్యము కానేరవు. సత్యము కాని దేశకాలాదులయందు తెలియబడే వస్తు ప్రపంచము ఎలా సత్యమనబడుతుంది? సత్యము కాదు గనుక ఇది అనిత్యము. అనిత్యమైన వస్తువును గుర్తించవలెనన్నచో నిత్యవస్తువు ఒకటి ఉండవలెను. అదియే సత్యము. అట్టి సత్యవస్తువు బ్రహ్మమొక్కటియే. దానికి అన్యమైన దంతయును మిథ్యయే.

మనము ఉన్నట్లు మనకు తెలుసు. ఈ విషయములో ఎవ్వరికి సందేహము లేదు. అయితే మన స్వరూపమేమిటో తెలియదు. అయితే అట్టి

మన స్వరూపము సంపూర్ణముగా తెలిసినచో ఇక సమస్య ఉండదు. ఒకవేళ సంపూర్ణముగా తెలియకున్నను సమస్య మిగలదు. ఉన్నట్లు తెలుసు. కానీ ఎలా ఉన్నది తెలియదు. ఇక్కడే రజ్జు సర్పము పగిది ఆత్మ అనాత్మగా గోచరించుచున్నది. ఇప్పుడు మనకు కావలసినది తెలియనిదానికి సంబంధించిన జ్ఞానముకాదు. తెలిసిన రెండు విషయాలకు సంబంధించిన విచక్షణా జ్ఞానము. ఇదియే నిత్యానిత్య వస్తువివేకము.

విచక్షణాజ్ఞానము అలవడినచో అసత్యమైనది ఏదియో తెలియును. తెలియుట జరుగగానే అసత్యమైన వస్తువును త్యజింతుము. తన దేహము మొదలు గోచరించు సమస్త ప్రపంచము అనిత్యమని తెలియును. అనిత్యమైన జగత్తుపై, జీవితముపై ఆశను వీడి నిత్యవస్తు ప్రాప్తికి ఈ స్థితిలో సాధకుడు ప్రయత్నించును. కానీ ఇక్కడ ఒక విషయమును మరువరాదు. ఈ స్థాయిలో శ్రుతి, యుక్తి, అనుభవము ద్వారా సాధకునకు ప్రపంచము అనిత్యమని తేలును. అంతేగాని నిత్యవస్తువును గూర్చిన జ్ఞానము ఉండదు.

సాధారణముగా ఈ నిత్యా నిత్య వస్తువివేకము పూర్వ పుణ్యవశమున కలుగును. బ్రతుకులోని బాధలు, శ్మశానంలోని చితిమంటలు దానిని వృద్ధిచేయును. ఈ వివేకాగ్నిని సత్సంగము ఆరిపోకుండా కాపాడును.

విరాగః కః ?

భావము :- వైరాగ్య మనగా నేమి ?

ఇహస్వర్గ భోగేషు ఇచ్ఛారాహిత్యం

భావము :- ఇహలోక, పరలోక భోగ్య విషయములపట్ల జనించెడి ఉపేక్షను వైరాగ్యమందురు.

వ్యాఖ్య

సాధన చతుష్టయ సంపత్తిలో వైరాగ్యము రెండవ లక్షణము. విరాగమును కలిగియుండుటయే వైరాగ్యము. విషయ సుఖములయెడ రాగము లేకుండుటయే విరాగమనబడును. వివేకముద్వారా అనిత్యమైన వస్తువును గూర్చి పూర్ణంగా తెలిసిపోవును. అట్టి వివేకమువలన కలిగిన ఉదాసీన వైఖరియే వైరాగ్య మనబడుతుంది. భయపడి వస్తు ప్రపంచమునకు దూరమగుట

వైరా గ్యము కాదు. బాధల మధ్య చెదిరి పోయి జనజీవనమునకు దూరమగుట వైరాగ్యము కాలేదు. నిరాశా వాది ఎన్నడూ విరాగి కాడు; కాలేడు. వస్తుప్రపంచమును గూర్చి వివేకముతో సాగించిన పరిశీలనలో సమస్తము అనిత్యమని తెలియుటవలన కలిగెడి తటస్థ మానసిక స్థితియే నిజమైన వైరాగ్యము. ఈ పరిశీలన ఇహలోకములోనే ఆగక స్వర్గాది పరలోకములకు కూడా వ్యాపించి అవి కూడా అనిత్యమని నిర్ణయించి, వాటిని కూడా మానసికముగా త్యజించునట్లు చేయును. సత్యాసత్యముల విచక్షణ కలిగినచో అసత్యవస్తువులపై అరుచి గోచరించును. ఇదియే వైరాగ్యము. అనిత్యమైన దానిని త్యజించనంత వరకు నిత్య వస్తు జ్ఞానము కదలదు. కలగదు. ఇట్టి అనిత్య వస్తుత్యాగము వైరాగ్యమునందు కలుగును. సర్వ వాంఛారాహిత్యమే వైరాగ్యము. కర్మఫలాసక్తి లేని జీవనము వైరాగ్యము వలన ఏర్పడును. వివేకము గలవానికే వైరాగ్యము ఉదయించును.

"బ్రహ్మాది స్థావరాన్తేషు వైరాగ్యం విషయేష్వను
యథైవ కాకవిష్ఠాయాం వైరాగ్యం తద్ధి నిర్మలం"

"బ్రహ్మలోకమువరకు గల సమస్త విషయములను, విషయ సుఖములను కాకిరెట్టవలె భావించి త్యజించెడి నిశ్చలస్థితియే వైరాగ్యమని" శ్రీ శంకరాచార్యుల వారు అపరోక్షానుభూతి అనెడి గ్రంథములో తెలిపియున్నారు.

తన దేహముతో కూడి సమస్త జగత్తు దోషపూరితమని తెలిసి జీవించుటయే నిజవైరాగ్యము. దేహాత్మభావము దూరముకానిదే వైరాగ్యము చేరువకురాదు. వైరాగ్య ముదయించగనే దేహభావన సమూలముగా నశించి, తిరిగి మనస్సులో కదలక పలాయనము చిత్తగించును.

ఇహలోక సుఖములన్నియు అనిత్యమని తేలినది. మనస్సుతో అనుభవించెడి ఇహలోకసుఖాలు అనిత్యమైనపుడు, అదే మనస్సునకు తెలిసెడి పరలోక సుఖాలు మాత్రము అనిత్యము గాకుండునా ? ఇహలోక సుఖాలు శ్మశాన సదృశములే. పరలోక సుఖాలు కూడా అంతే. ఒకవేళ రెండూ కలిపితే నిత్యసుఖము ఆవిర్భవించునేమో అని భ్రమపడవచ్చు. రెండు గదులలోని చీకటి ఒక దీపమును వెలిగించునా ? ఇహలోక సుఖముగానీ, పరలోక సుఖముగానీ, రెండూకలిపినను గానీ నిత్యానందము లభ్యముకాదని తెలుపుటకే నొసటన మూడు విభూతిరేఖలను ధరింతురు. ఈ మూడు రీతుల లభించెడి

సుఖము నీకు అందించునది బూడిదియే నని తెలుపుటకే విభూతిధారణ ఏర్పడియున్నది. అనిత్యమైన శరీరాల ద్వారా అనుభవించెడి ఆనందము శాశ్వతానందము అవుతుందా? ఎంత అనుభవించినా, ఎవరి దేహమైనా ఒక నాటికి శ్మశానానికి కదిలేదే కదా!

ఆయేహైతే జాయ్ గే
రాజారం క ఫకీర్
ఏక్ సింహాసన్ ఛడి చలే
బాంధె జాత్ జంజీర్ ......

"చక్రవర్తి అయినా, సేవకుడైనా, ఫకీరైనా ఎవరైనను కనుపించిన వారంతా కనుమరుగై పోయేవారే ! సింహాసనముపై ఊరేగినా, పాడెపై నడిచినా చావు మాత్రము ఒకటే గదా ! " అంటాడు సంత్ కబీర్‌దాస్. కనుక భోగ్య విషయాలయెడ నైరాశ్య జీవనము విరాగికి అలవడును. ఇట్టి వైరాగ్యము వివేకము ద్వారా కలుగును.

శమాది సాధన సంపత్తిః కా?

భావము :- శమాది సాధన సంపత్తి అనగా నేమి ?

శమోదమ ఉపరమ స్తితిక్షా శ్రద్ధా సమాధానంచ ఇతి

భావము :- శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము అనెడి ఈ ఆరింటిని శమాది సాధన సంపత్తి అందురు.

శమః కః ?

భావము :- శమమనగా నేమి ?

మనోనిగ్రహః

భావము :- మనో నిగ్రహమే శమము .

వ్యాఖ్య

శమదమాదులనునవి వైరాగ్యము యొక్క లక్షణములు. వీనిలో ఏది లోపించినను వైరాగ్యము కుంటుపడును. శమదమాదుల యందు మొదటిది శమము. శమమనగా మనో నిగ్రహము.

శరీరమును శుద్ధి పరచుటయందు, ఆరోగ్యముగా ఉంచుట యందు మానవుడు అధిక శ్రద్ధను చూపును. స్నానము ద్వారా శరీరమును శుభ్ర పరచుకొనును. ఆహారము ద్వారా అవయవములను వృద్ధి పరచుకొనును. రోగములు సంభవించినచో చికిత్స ద్వారా నయము చేసుకొనును. అయితే దేహము కన్నా అత్యంత ముఖ్యమైన మనస్సును గూర్చి ఎన్నడూ మానవుడు ఆలోచించడు. శరీరము కేవలము బాహ్య తొడుగు మాత్రమే. మనస్సే అత్యంత ప్రధానమైనది. మనస్సు అనారోగ్యమునకు గురియైనపుడే శరీరము కూడా రోగగ్రస్థ మగును.

ఆలోచనల, కోరికల, ఊహ్పతముల సముదాయమే మనస్సు. సంకల్పాలు స్థిరముగా నిలిచేవికావు. కోరికలు కరిగి పోతుంటాయి. మళ్ళీ నూతనమైనవి కనిపిస్తుంటాయి. నదిలోని కెరటాలవలె సంకల్పాలు సదా కదులు తుంటాయి. భావాలు మారుతుంటాయి. గనుక అభీష్టాలు చెదరిపోతుంటాయి. రాగద్వేషాలు అస్తవ్యస్తంగా నడుస్తుంటాయి. ఈ కారణముగా మనస్సు నిగ్రహమును కోల్పోయి చంచలమై తిరుగుతూ ఉంటుంది. ఇట్టి చపల మనస్సును అచలముగా నిలుపుటయే శమము.

ఇంద్రియములతో కలిసి విషయ సుఖాలవెంట పరిభ్రమించే మనస్సునకు ఇంద్రియ విషయాల యందలి దోషములను తెలియజేసి, మనస్సును దారి మళ్ళించి ఆంతరంగిక ప్రశాంతతలో నిలుపుటయే శమమన బడుతుంది.

మనసెప్పుడూ ఇంద్రియ విషయాలవైపే పరుగెడుతూ వుంటుంది. విషయానుభవము ద్వారా స్మృతి గట్టిపడి పునః విషయానురక్తితో మనసు చలిస్తుంది. క్షణికమైన ఇంద్రియ విషయభోగాలు ఎలా శక్తిహీనమైనవో, శోక భూయిష్టమైనవో మనస్సునకు తెలియజేయగనే అది విషయప్రపంచము నుండి వెనుదిరిగి తనలో తాను నిలిచి ఉంటుంది. ఇట్టి స్థితిలో గోచరించెడి ప్రశాంతతయే శమము యొక్క ఫలమై ఉన్నది.

మనస్సు నీకు పరికరము. పనిముట్టు. నీవు నడిపినట్లు పనిముట్టు నడిచి నపుడే నీకు శాంతి. నీవు చెప్పినట్లు మనస్సు చరించాలేగాని మనస్సు చెప్పినట్లు నీవు చరించకూడదు. నీమాటకు అనుగుణ్యముగా మనస్సు చరించినచో నీవు శమము కలిగియున్నావని భావము.

మనస్సును బలవంతముగా లొంగదీయరాదు. బలాత్కారముచే లొంగిన మనస్సు నిన్ను ఏ క్షణమైనను బలహీనునిగ చేయగలదు. మనస్సునకు సరియైన అవగాహనను కల్పించాలి. జ్ఞానమును అందించాలి. తద్వారా దానిని నిగ్రహించాలి. ఇదియే శమము. సునాయాసంగా స్టీరింగ్‌ను త్రిప్పినపుడే డ్రైవరు వాహనాన్ని చక్కగా నడుపగలుగును. భయంతో ఊయలలూగే పిల్లలు గొలుసును గట్టిగా పట్టుకొనునట్లు డ్రైవరు స్టీరింగ్‌ను తిప్పినచో ప్రమాదములు పిలిచినట్లు అరుదెంచును. మనస్సు విషయము కూడా అంతే. సున్నితమైనది మనస్సు. దానిపై బలప్రయోగము పనికిరాదు.

దమః కః ?

భావము :- దమ మనగా నేమి ?

చక్షురాది బాహ్యేన్ద్రియ నిగ్రహః

భావము :- నేత్రాది జ్ఞానేంద్రియములను, కర్మేంద్రియములను నిగ్రహించుట దమమనబడును.

వ్యాఖ్య

మనోనిగ్రహమే శమమని గ్రహించినాము. ఆధ్యాత్మిక సాధనలలో మనో నిగ్రహమనునది అత్యంత ఆవశ్యకమైన సాధనయై ఉన్నది. సాధకుడు ఎంతగా ప్రయత్నించుచున్నను టక్కరియగు మనస్సు నక్కజిత్తుల నభినయిస్తూ సాధకుని మోసము చేయుచునే యుండును. మనస్సు నిగ్రహించబడని దశలో సాధకుడు జాగరూకుడై ఇంద్రియాలను నిగ్రహించ గలిగినచో తద్వారా మనస్సు నిగ్రహింపబడును. మనస్సు చేయు ఊహలన్నియు ఇంద్రియముల ద్వారానే అమలు జరుగవలెను గనుక ఇంద్రియములను నిగ్రహించినచో మనస్సు నిగ్రహించబడి స్వాధీనమగును. ఇదియే దమము.

దమమనగా ఇంద్రియ నిగ్రహము. మనస్సును లొంగదీయలేని దశలో ఇంద్రియాలను నిగ్రహించి తద్వారా మనోనాశమునకు సాధకుడు యత్నించవలెను.

ఇంద్రియ విషయముల యందలి దోషములను గుర్తించి గ్రహించుట ద్వారా సాధకుడు దమమును పొందగలడు. దమము కలుగనిచో వ్యక్తి

బలహీనుడగును. వైరాగ్యము క్షీణించును. అసత్యభాషణము అనర్థదాయకమని భావించి సత్యమును భాషించు చుండవలెను. మితిమీరి భుజించక హితమును గూర్చెడి మితాహారమును భుజించవలెను. ఇలా రసనేంద్రియమును నిగ్రహించవలెను.

అశ్లీల బొమ్మలను, చలనచిత్రములను చూడరాదు. కామదృష్టితో స్త్రీలు పురుషులను, పురుషులు స్త్రీలను వీక్షించరాదు. మహాత్ముల సందర్శనము, దైవ దర్శనము, సద్గ్రంథ పఠనము ఇత్యాదుల ద్వారా దృగేంద్రియమును నిగ్రహించవలెను.

ప్రాపంచిక విషయములను ముచ్చటించరాదు. వినరాదు కూడాను. అసభ్య గీతములను వినకూడదు. మహాత్ముల ప్రవచనము లను, సద్గ్రంథములను శ్రవణము చేయుటకు అలవాటు పడవలెను. సంకీర్తనయందు మనస్సు లగ్నమగునట్లు చూడవలెను. ఈవిధముగా శ్రోత్రేంద్రియమును నిగ్రహించవలెను.

సుగంధ లేపనములను, అత్తరు సువాసనలను విసర్జించవలెను. ఈ విధముగా ఘ్రాణేంద్రియమును నిగ్రహించవలెను. మెత్తని సున్నితమైన వస్తువులను స్పృశించవలెననెడి కుతూహలమును విడనాడవలెను. మెత్తని పడకపై పవళించడము, సున్నితమైన దుస్తులను ధరించడము మంచిదికాదు. మెత్తని పడకలు మన కొరకు ఎదురు చూచుచున్నను, చాపమీదనో, నేలమీదనో పడుకొనే అలవాటును కలిగి యుండవలెను. తద్వారా త్వగింద్రియము నిగ్రహించబడును.

ఇంద్రియ విషయములు ఇంద్రియాలను మోసముచేసి ఆకర్షించు చుండును. ఇంద్రియ నిగ్రహములేక ఇంద్రియ విషయాలకు బానిసయై చరించు జీవుడు శాంతిని పొందలేడు. విషయాలనునవి యదార్థానికి విషము లే యని గ్రహించాలి.

దోషేణ తీవ్రో విషయః కృష్ణ సర్ప విషాదపి
విషం నిహన్తి భోక్తారం ద్రష్టారం చక్షుషాప్యయమ్

"విషయముల వలన కలిగెడి దోషము నల్లత్రాచు విషము కన్నను తీవ్రమైనదిగా యున్నది. విషము మ్రింగిన వానినే చంపును. కానీ కన్నులతో గాంచినను ఇంద్రియ విషయాలు చంపును" అని ఆచార్యులవారు తమ వివేకచూడమణి గ్రంథమునందు తెలిపి యున్నారు.

ఉపరమః కః ?

భావము :– ఉపరమ మనగానేమి ?

స్వధర్మానుష్ఠానమేవ

భావము:– స్వధర్మమును చక్కగా ఆచరించుటయే ఉపరమము.

వ్యాఖ్య

స్వధర్మమును విడువకుండా శాస్త్ర విహిత కర్మలను ఆచరించుచుండుటయే స్వధర్మానుష్ఠానమనెడి ఉపరమము.

"నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్య కర్మకృత్"

కర్మ చేయకుండా ఏ వ్యక్తికూడా క్షణకాలము కూడా మనలేడు. మరి మానవుడాచరించు కర్మలు వాసనా ప్రేరితములై యున్నట్లు తెలియుచున్నవి. సాధకుడైనవాడు శమము ద్వారా మనస్సును నిగ్రహించి, దమము ద్వారా ఇంద్రియములను నిగ్రహించి మనస్సును అంతర్ముఖము చేయుటకు ప్రయత్నించుచున్నను, సాధకుని అంతఃకరణలో చెలరేగుచున్న పూర్వ వాసనలు అతనిని బహిర్ముఖ మగునట్లు చేయును. అనివార్యమైన ఈ స్థితిలో సాధకుడు ఉపరమమును కలిగియున్నచో ఏ విధమైన ప్రమాదములకు లోను గాకుండా ప్రశాంతముగా జీవించగలుగును.

ధర్మమను పదమును విశాల దృక్పథముతో అవగత మొనర్చుకొనవలెను. దేహ ధర్మము ఒక విధముగా యుండును. మనోధర్మము మరియొక విధముగా నుండును. కుటుంబ ధర్మము ఇంకొక విధముగా నుండ, వృత్తి ధర్మము వేరొక విధముగా నుండును. అయితే అంతఃకరణములోని సూక్ష్మవాసనలు మనస్సును, ఇంద్రియములను బహిర్ముఖ మొనరించునపుడు అవగాహనతో శాస్త్రవిహిత కర్మలను ఆచరించుట వలన వ్యక్తి కర్మలచే బంధించబడడు. పైగా వాసనలు క్షాళన మొనరించుకొనిన వాడగును. ధర్మాచరణము నందు త్యాగము నిండి ఉంటుంది. కర్మ స్వార్థరూపమై ఉంటుంది. ధర్మప్రేరితమైన కర్మ కర్మయోగమవుతుంది.

ఇంద్రియ మనోబుద్ధులను నిర్వ్యాపార మొనర్చి అంతర్యములో శాంతిని సుస్థిర పరచుటకు శమదమాదులు సహకరించుచుండ, వాసనా

ప్రేరితమైన కర్మాచరణ జీవునికి అవశ్యమై నిలిచినపుడు, అట్టి ఆవేశమును అవగాహన ద్వారా శుద్ధి పరచి, వ్యాకులము తెలియని వ్యవస్థను హృదిలో నింపుటకు ఉపరతి ఉపకరించును.

తితిక్షా కా ?

భావము :– తితిక్ష అనగా నేమి ?

శీతోష్ణ సుఖదుఃఖాది సహిష్ణుత్వం.

భావము :– శీతోష్ణ సుఖదుఃఖములను సహించుటయే తితీక్ష.

వ్యాఖ్య

భగవానుని చట్టాలకు లోబడి ఈ జగత్తు వర్తించుచున్నది. ఈ విశ్వములోని చట్టములన్నియు విశ్వనాథుని ఆధీనము నందే ఉన్నవి. ఎప్పుడు ఏది జరుగవలెనో అది అలా జరుగుటయే పరమాత్మ చట్టముల యందలి ప్రత్యేక విశిష్టత. ఇందులో తగిలింపులుండవు ; తొలగింపులు కుదరవు. అవి తెగింపులు తెలియని దివ్య సూత్రములు. సవరణలు, సంప్రదింపులు అచ్చట పనికిరావు. ఇది తెలిసిన ముముక్షువు వైరుధ్య పరిస్థితులమధ్య చెదరడు. కదలడు. ప్రసాద మనస్తత్వముతో ప్రశాంతముగా జీవించును. ఇదియే తితీక్ష. సాధకుడు తప్పక పొందదగిన సుగుణము.

"సహనం సర్వదుఃఖానాం"

"సమస్తమైన దుఃఖములను సహించుటయే తితీక్ష" అని శంకరాచార్యుల వారు అభిప్రాయపడి యున్నారు. శీతోష్ణములయందు, సుఖ దుఃఖములయందు, మానావ మానములయందు, జయాపజయముల యందు సహనశీలురై యుండుటయే తితీక్ష అనబడును.

తితీక్ష అలవడిన సాధకుడు ప్రశాంత చిత్తుడై ఉండును.కొందరు ఈ తితీక్షను సాధించుటకు అప్రయోజకపు మార్గములన్నీ అనుసరించు చుందురు. దుస్తులను విస్మరించి చలిలో వణుకుచుందురు. ఎండలో చెప్పులు లేకుండా నడుచు చుందురు. ఉపవాసాల పేరిట నీరసవంతులై, క్షుద్బాధను భరించుట ద్వారా తితీక్షను సాధించితిమని భ్రమించుచుందురు. శాస్త్రావగాహన లేకపోవుటయే ఈ అనర్థము లన్నిటికీ కారణము.

తితీక్ష అనునది చక్కని విధాయక సాధన సూత్రము. అవగాహనా బీజము అందించిన అమృతాంకురము. తితీక్ష యనగా కఠోరబాధలను కొనితెచ్చుకొని, విలపిస్తూ భరించుట కాదు.ఎదురయ్యే సమస్త దుఃఖములను ప్రశాంతముగా ఆహ్వానించి, ఆనందముగా అనుభవించుచు జీవించుటయే నిజమైన తితీక్ష అనబడును.

"మాత్రా స్పర్శాస్తు కౌన్తేయ శీతోష్ణ సుఖదుఃఖదాః
ఆగమా పాయినోఽనిత్యాస్తాం తితిక్షస్వ భారత"

"అర్జునా! ఇంద్రియములు ఇంద్రియ విషయములతో సంయోగము చెందునపుడు శీతోష్ణ సుఖ దుఃఖములు కలుగు చుండును. అవి క్షణభంగురములై, అస్థిరములై యున్నవి. కనుక అట్టి ద్వంద్వములను సహించుము" అని శ్రీ కృష్ణభగవానుడు భగవద్గీతయందు తెలిపియున్నాడు.

నిందాస్తుతులు కలిగినపుడు మనిషి కృంగుటయు, పొంగుటయు జరుగుచుండును. ఇవి రెండును శబ్దరూపములే గదా ! ఒకదానిని చెవి వినుట వలన దుఃఖము సంభవించుచుండ, రెండవ దానిని చెవివినుట వలన సుఖము ప్రాప్తించుచున్నది. ఈ వైరుధ్య అనుభూతులను కలిగించునది మనస్సే గాని మరియొకటి కాదు. పైగా ఈ సుఖదుఃఖాలువచ్చి పోవునవియే గాని శాశ్వతముగా నిలిచేవికావు. కనుక ఈ విషయమున సాధకుడు చలించకుండా జీవించవలెను. దీనినే తితీక్ష అందురు.

శ్రద్ధాకీదృశీ ?

భావము :– శ్రద్ధ అనగానేమి ?

గురువేదాంత వ్యాక్యాదిషు విశ్వాసః శ్రద్ధా !

భావము :– గురువాక్యమునందును, శాస్త్ర విషయమునందును సంపూర్ణ విశ్వాసమును కలిగియుండుటయే శ్రద్ధ అనబడును.

వ్యాఖ్య

వేదాంతశాస్త్రమును అభ్యసించుటయందు శ్రద్ధ అతి ముఖ్యమై యున్నది . శ్రద్ధ లేనివానికి శాస్త్రము అవగాహనకు అందదు.

"శ్రద్ధావాన్ లభతే జ్ఞానం"

"శ్రద్ధగలవానికే జ్ఞానము లభించును" అని గీత కూడా ప్రబోధించినది.

"శ్రద్ధా భక్తి ధ్యాన యోగాదవైహి"

"శ్రద్ధ, భక్తి, ధ్యాన యోగాలద్వారా పొందుమ"ని కైవల్యోపనిషత్తు తెలిపి యున్నది.

వేదాంత శాస్త్రము ఆత్మసంబంధమైనది. శాస్త్రమును గ్రహించ వలసిన అంతఃకరణ సదా బహిర్ముఖమై ఉండును. బహిర్ముఖమయ్యే అంతఃకరణ ద్వారా ఆత్మతత్వమును గ్రహించలేము. అంతఃకరణను అంతర్ముఖము చేసినపుడే అది సాధ్యమగును. ఇది శ్రద్ధ వలననే లభించును. అదియునుగాక వేదాంత శాస్త్రము గుహ్యమైనది. కేవలం వాచ్యార్థమును గ్రహించినంత మాత్రాన సత్యము అవగతము కాదు. లక్ష్యార్థమును గ్రహించుట వలననే అది లభ్యమగును. లక్ష్యార్థమును స్వతంత్రముగా అధ్యయనము చేసి గ్రహించలేము.

"శాస్త్రజ్ఞోపి స్వతంత్రేణ బ్రహ్మాన్వేషణం నకుర్యాత్"

"శాస్త్రము తెలిసిన వాడైనను స్వయముగా బ్రహ్మాన్వేషణ చేయరాద"ని ఆచార్యులవారి ఆదేశము.

శాస్త్ర లోతులను గురువు చెంతనే తెలుసుకోవాలి. అట్టి గురువు పై సంపూర్ణ విశ్వాస ముండాలి. కాలానికి చెదరని, కష్టాలకు కదలని ప్రగాఢ అచంచల విశ్వాసము గురుదేవునిపై నుంచాలి.

జైసీ ప్రీతి కుటుంబకీ
తైసీ గురుసో హెూయ్

"నీ కుటుంబము పై ఎంత గాఢమైన ప్రేమ నీకుండునో, అట్టి ప్రేమ గురుదేవునిపై ఉండాలి" అంటారు భక్త కబీర్ దాస్.

స్వార్థపూరిత జీవనముతో తనువును, మనస్సును, పుణ్యమును హరించే కుటుంబ సభ్యులమీదనే నీకు అంత ప్రేమ యున్నది గదా! ప్రేమను పంచి, ప్రేమలో నిన్ను ముంచి, ప్రేమ తీరమునకు నిన్ను జేర్చి తరింపచేయు సద్గురునిపై ఇక నీకు ఎంత ప్రేమ ఉండాలి ? గురు ఋణము తీరేదిలేదు.

తీర్చేదికాదు. గురు పాదాల చెంత ఆశాజీవివై బ్రతుకు. గురుదేవునిలో నిరాశను దింపకు.

అపౌరుషేయమైన వేదము సంప్రదాయమును అందించింది. సంప్రదాయము సద్గురువును ప్రసాదించింది. సత్యరూపమైన శాస్త్రమునందును, నిత్యరూపుడైన గురుదేవుని వాక్యమునందును విశ్వాసమును కలిగి యుండుటయే శ్రద్ధ. శ్రద్ధగలవాడు గురువుచెంత వినికిడిగాక శ్రవణము చేసి ఉత్తమ శ్రోత యగును. పరిపక్వస్థితి రాగానే ప్రియతమ వక్త యగును.

సమాధానం కిం ?

భావము :– సమాధాన మనగా నేమి ?

చిత్తైకాగ్రతా

భావము :– చిత్తమును ఏకాగ్రతలో నుంచుటయే సమాధానము.

వ్యాఖ్య

చిత్తములో ఏకాగ్రత నిండియుండుటయే సమాధానము. అవధానముతో కూడిన మనస్సు సమాధానమును కలిగియున్నది. ఏకాగ్రత అనగా ఏకవృత్తి మనస్సులో చలించకుండా నిలిచియుండుట అని భావము. అయితే ప్రాపంచిక విషయముల వెంట పరుగులిడకుండా మనస్సును తదేకముగా బ్రహ్మమునందు నిలుపుటను సమాధాన మందురు. యోగమార్గమునందు చెప్పబడే ధారణ ఇదియేనని భావించవచ్చు.

సమాధానమును పొందిన చిత్తము ధ్యానానికి సరిపడును. చంచలత్వమును అరికట్టుటయే సమాధానము యొక్క కర్తవ్యము. సమాధానము అలవడిన వ్యక్తి సంతృప్తి నొందియుండును. చిత్తైకాగ్రత కుంటుపడుతున్నదని తెలియగనే సాధకుడు జాగరూకుడై వుండవలెను. దమమును కలిగి యుండవలెను. భగవన్నామము నుచ్చరించుచునో, జపధ్యానాదులు కొనసాగించుచునో కొంతకాలము గడుపవలెను. ఇంద్రియాలు నిగ్రహించబడి మనస్సు కుదుటపడును. మనస్సు కుదుట పడగానే చిత్తవృత్తులను ఏకవృత్తిగా తీర్చి లక్ష్యమువైపు నడుపవలెను. అప్పుడు చిత్తమునకు సమాధానము లభించును.

సమాధానము యొక్క ప్రారంభము ధ్యానముకాగా అంతము జ్ఞాన నిష్ఠ యనబడును.

ముముక్షుత్వం కిమ్ ?

భావము :– ముముక్షుత్వము అనగానేమి ?

"మోక్షో మే భూయాద్" ఇతి ఇచ్ఛా

భావము:– "నాకు మోక్షము కలుగుగాక" అనెడి నిత్యకోరికను కల్గి యుండుటయే ముముక్షుత్వము .

వ్యాఖ్య

పరిమిత జీవనమునకు స్వస్తి చెప్పి, సర్వోపద్రవములనుండి విడిపడి మోక్షరూపమై తరించవలె ననెడి తీవ్రవాంఛయే ముముక్షుత్వ మనబడును. ముముక్షువు మోక్షముకన్నా అన్యమైన ఫలమునందు ఆసక్తి చూపడు.

ఈ ప్రపంచములోని తన మనుగడ కేవలం మజిలీయేనని నిజమైన స్వస్థానము ఆత్మయేనని గ్రహించినవాడు ముముక్షువు. ఇంద్రియవిషయాలన్నీ విషతుల్యమేనని భావించి, శ్రోత్రాది ఇంద్రియముల ద్వారా శబ్దాది విషయములను అనుభవించుటకు ఇష్టపడక ఆత్మానందము కొరకు తీవ్ర అన్వేషణ సాగించువాడే ముముక్షువు. ముముక్షుత్వము అలవడినచో సాధకుని యాత్ర సుగమమైనది అని భావము. మృత్యువు తనను కబళించేందుకు ఎలా పొంచియున్నదో తెలిసి జాగరూకతతో మెలుగువాడే ముముక్షువు.

పావ్ పల్‌కకీ సుధి నహీం
కరై కాలకా సాజ్
కాల్ అచానక్ మార్‌సీ
జ్యోం తీతర్ కో బాజ్

"మరుక్షణమేమి జరుగునో ఊహించలేము. రూపులేని రేపు వస్తుందో రాదో? పావురము కొరకు డేగ పొంచియున్నట్లు మానవుని కొరకు మృత్యువు పొంచియున్నది. ఎప్పుడు పైకి దుమికి మ్రింగివేయునో గదా !" అంటాడు భక్త కబీర్ దాస్.

ప్రపంచము అనిత్యమని తెలిసినపుడే ముముక్షుత్వము అలవడును. ఈ దృశ్యమాన జగత్తునందు అణువంత సుఖము ఆకాశమంత దుఃఖముతో కలిసి యున్నదనెడి సత్యము ముముక్షువునకు అవగతమై ఉండాలి. ఇంద్రియ సుఖములన్నియు అశాశ్వతమని, అసద్రూపమని, మాయాసదృశమని గ్రహించాలి.

రక్త మాంసాదులతో నింపబడి చర్మముచే కప్పబడియున్న ఈ దుర్గంధపూరిత మలిన దేహముపై ముముక్షువునకు రోత జనించాలి. దేహభావన సాధకునిలో కదలకూడదు. శరీరము నీదికాదు. నీకు మిగలదు. ప్రాణమున్నంత వరకు దేహముపై నీకు హక్కు ఉంటుంది. ప్రాణం పోగానే నీ హక్కు కుక్కలకు, నక్కలకు సంక్రమిస్తుంది. దేహముతో తనకు గల సంబంధము అనిత్యమని ఎఱిగినవాడే ముముక్షువు. అజ్ఞానముచేత ఆత్మయందు ఆరోపింప బడిన జీవభావనను తొలగించుకొని, సచ్చిదానందరూపమైన స్వస్వరూప స్థితిలో నిలిచేందుకు నిరంతరము తీవ్రకృషి సల్పువాడే ముముక్షువు అనబడును.

ఏతత్ సాధన చతుష్టయమ్

భావము :- ఇవియే సాధన చతుష్టయ మనబడును.

వ్యాఖ్య

ఇంతవరకు తెలిపిన వివేకము, వైరాగ్యము, శమాది షట్క సంపత్తి, ముముక్షుత్వం అనెడి ఈ నాలుగు లక్షణములను సాధన చతుష్టయము అందురు. తత్త్వబోధను గ్రహించుటకు సాధనచతుష్టయ సంపదయే ప్రధానముగాని కులము, మతము, వయస్సు, లింగాది భేదములు కావు.

భూమిని మెత్తబరచిన పిదపనే విత్తనములను వేయునట్లు, సాధన చతుష్టయ సంపద కలిగిన తరువాతనే తత్త్వవివేకము సాధకునకు అలవడును. సాధనచతుష్టయ సంపద లేనివ్యక్తి ఎన్ని గ్రంథములను చదివినను, ఎందరి గురువులచెంత శ్రవణము చేసినను సత్యమును గ్రహించ లేడు. కారు నాలుగు చక్రములపై ఆధారపడి నడచునట్లు, ముముక్షువు యగువాని సాధన శకటము సాధనచతుష్టయమనెడి నాలుగు చక్రములపై ఆధారపడి కదులును. నాలుగు చక్రములలో ఏ చక్రము చెడినను కారు ముందుకు కదలదు. సాధన చతుష్టయమునందు ఏ ఒక్క లక్షణము కుంటుపడినను సాధన ముందుకు నడవదు.

ఈ నాలుగు సాధనలను సాధకుడు ఉత్సాహవంతుడై ఆచరించవలెను. సరియైన అవగాహనతో ఆచరించాలే గాని ఆవేశముతో గాని, నిరాశతోగాని అమలుపరచ కూడదు. ఎంతచక్కగా అవగాహన కుదురునో అంతచక్కగా లక్షణములు లభించును. మది తేలును. హృదయము ఆనందములో మునుగును.

ప్రమిద, నూనె, వత్తి, అగ్ని అనెడి నాలుగు వస్తువులతో తయారైన దీపము అంధకారమును అదృశ్య మొనర్చి, కాంతిని ఎలా విస్తరింప జేసినదో, వివేకము, వైరాగ్యము, శమదమాదులు, ముముక్షుత్వము అనెడి నాలుగు లక్షణములతో కూడిన సాధకుని చిత్తము దురవగాహన యనెడి చీకటిని పోగొట్టి, సదవగాహన అనెడి కాంతిద్వారా బ్రతుకునే ప్రకాశవంతము చేయును.

ఈ సాధన చతుష్టయ సంపత్తి ద్వారా సాధకుడు దేహేంద్రియ మనోబుద్ధుల స్థాయిలో శుద్ధి పడినవాడై జటిలమైన ఆధ్యాత్మిక విషయములను గ్రహించుటకు, తత్త్వవివేకమును విచారణ ద్వారా పొందుటకు అర్హుడగును.కనుక ప్రతి సాధకుడు సాధన చతుష్టయ సంపత్తిని తప్పక పొంది యుండవలెను.

తత స్తత్త్వ వివేక స్యాధికారిణో భవన్తి

భావముః – ఆ తరువాత వారు తత్త్వ వివేకమునకు అధికారులగు చున్నారు.

తత్త్వ వివేకము

తత్త్వవివేకః కః ?

భావము :- తత్త్వ వివేకమనగా నేమి ?

ఆత్మా సత్యం తదన్యత్ సర్వం మిథ్యేతి

భావము :- ఆత్మయే సత్యము. దానికి అన్యమైన దంతయు మిథ్య అని తెలుసుకొనుటయే తత్త్వ వివేకము.

వ్యాఖ్య

ఆత్మ ఒక్కటియే సత్యము. ఇది అనంతము. అనంతములు రెండు ఉండేందుకు వీలులేనందున ఆత్మ అద్వయమై యున్నది. అద్వయమై,

అనంతమైన ఆత్మకన్నా వేరుగా తెలిసెడి జగత్తు మాయారూపమై వున్నది. పరిపూర్ణమైన ఆత్మకన్నా వేరుగా పరిమితమైన జగత్తు ఉండేందుకు వీలు లేదు. అన్యముగా ఉండేందుకు వీలులేనపుడు అది ఆత్మయందే ఉన్నదని అంగీకరించాలి. అది ఎలా సాధ్యము ? అనంత వస్తువులో పరిమిత వస్తువు ఎలా ప్రత్యేకముగా ఉండగలదు ? అందుచేత జగత్తు మిథ్య లేదా మాయయై గోచరించినది. స్వప్న జగత్తు వలెనే ఈ ప్రపంచము కూడా మాయారూపమై ఉన్నది.

ఆత్మయే సత్యము. అదియే నీవు. ఇదియే ప్రతివ్యక్తిలోను కదిలే "అహం వృత్తి" ఆత్మ ఉన్నదనుమాట నిజమేనా ? అని ఎవరైనా సందేహ పడినచో అట్టి సందేహము కలిగినదని గ్రహించునది ఆత్మయే అయిఉన్నది. దీనికి మరోవిధమైన ఋజువులు అవసరములేదు. ఒకవేళ దీనికి ఋజువే అవసరమైనచో అట్టి ఋజువును ఖాయ పరచవలసినది కూడా ఆత్మయే అయివున్నది. కనుక ఆత్మను ఏదియును పరిమిత మొనర్చలేదు.

ఆత్మ దేనిచేతను పరిమిత మొనర్చబడదు. దేశకాలాదులను గ్రహించునది కూడా ఆత్మయే గనుక ఆత్మ దేశకాలాదులలో చిక్కదు . దేశకాలాదులు ఆత్మ వలననే తెలియుచున్నందున, ఆత్మకన్నా వేరుగా దేశకాలాదులు కూడా కొనసాగలేవు. జగత్తు దేశకాలాదుల యందే తెలియబడుట చేత జగత్తు వ్యవహారిక మనుగడనే కలిగియున్నది అని చెప్పాలి. ఏ జ్ఞానముచేత ఈ జగత్తు ఉన్నట్లు తెలియబడుచున్నదో, అట్టి జ్ఞానము కన్నా వేరుగా ఈ జగత్తు కొనసాగే వీలులేదు. ద్వైత భూమికను కదిలించు మనస్సు పనిచేయు చున్నందున ఈ జగత్తు ఉన్నట్లు తెలియుచున్నది. మనస్సు లేనిచోట జగత్తు తెలిసే అవకాశము లేదు.

వస్తుప్రపంచము మనకు తెలియుచున్నది. జగత్తులోని వస్తువు మనలోని సంకల్పానికి దృశ్యమై ఉన్నది. సంకల్పము ఆంతర్యానికి సంబంధించింది. అవ్యక్తమైన చైతన్యము నుండి ఆవిర్భవించిన సంకల్పము చైతన్యము యొక్క వ్యక్తరూపమై ఉన్నది. ప్రతి వస్తువు మరి యొక వస్తువును పరిమిత మొనర్చు చున్నది. అయితే సంకల్పానికి దృశ్యమగుట వలననే వస్తురూపము తెలియు చున్నది. వస్తువులను తెలుసుకొనునది సంకల్పమే గనుక వస్తు రూపముగా మారిన సంకల్పము వస్తువులచే పరిమిత మొనర్చ బడుచున్నది. సంకల్పము

నుండి విడిపడినపుడే వస్తువు తనయొక్క అస్తిత్వమును ఋజువు పరచుకొన గలదు. అలాగే వస్తురూపముగా మారిన సంకల్పము వస్తువు నుండి విడిపడినపుడు మాత్రమే సంకల్పము యొక్క సత్యరూపము తెలియగలదు. మరి సంకల్పము కదలనిచో వస్తువులు అర్థముగావు. వస్తువులుగా తెలియునది కూడా సంకల్పము యొక్క రూపాంతరమే అయిఉన్నది. వస్తువు సంకల్పము మీదను, సంకల్పము వస్తువు మీదను ఆధారపడి మనుగడను సాగించునపుడు, రెండునూ పరిమితమైనవియే అగుట వలన, పరిమితమైన రెండు వస్తువులలో ఏ ఒక్కటి పరిపూర్ణమయ్యేందుకు వీలులేదని గ్రహించవచ్చును. ఇలా విచారించి చూచినచో మనకు గోచరించెడి ఈ ప్రపంచము కేవలం దృశ్య మాత్రమై, పరిశీలనలో మిథ్యగా తెలియును. ఈ పరిశీలనలు కూడా వ్యవహారిక మనుగడకు సంబంధించినవియే గనుక దృగ్దృశ్యములు రెండునూ సత్యము కానేరవు. సత్యవస్తువు ఏకమై, అఖండమై అలరారుచున్నను, మనస్సు దృగ్దృశ్యము అనెడి మాయా జగత్తును ప్రవేశపెట్టి మోసము చేయుచున్నది. సత్యమైన ఆత్మ ఏ మార్పులను ఎరుగదు. తనలో ఏ మార్పులను జరుగనివ్వదు. కనుక దేశకాలాదులనునవి కూడా మాయా రూపములే అయి ఉన్నవి. కనుక సత్యమును దర్శించవలెనన్నచో గోచరించు సమస్తమును మిథ్యగా నిరాకరించక తప్పదు. బాహ్యములో గోచరించు వానిని త్రోసిపుచ్చవలెనని నీవు ఆంతర్యములో ప్రవేశించక తప్పదు. ఆంతర్యములో ప్రవేశించిన క్షణాన వ్యక్తీకరించబడిన చైతన్యము తిరిగి లయించి పోవుచున్నందున బయట లోపల అనెడి దేశము, నాడు నేడు అనెడి కాలము రెండునూ లయించి, కేవలం చైతన్యము మాత్రమే అనుభూతిగా మిగిలిపోవుచున్నది. చైతన్యము ఒక్కటే గాని రెండు కానందున ఆ స్థితిలో సత్యమైన బ్రహ్మపదార్థము స్వస్వరూపముగా తెలియుట జరుగుచున్నది.

"బాహ్యాకార నివృత్తి బుద్దీనాం తు లబ్ధ గుర్వాత్మ
ప్రసాదానాం న అన్తః పరం సుఖం సుప్రసిద్ధం
సువిజ్ఞేయం స్వాసన్తరం అస్తి"

"గురుదేవుని అనుగ్రహము, ఆత్మానుగ్రహము లభ్యమై, బాహ్య వస్తువుల నుండి నివృత్తి బొంది అంతర్ముఖమైన వానికి బ్రహ్మజ్ఞానముకన్నా తేలికైనది, సువిదితమైనదీ, శీఘ్రముగా లభించునది, అతి సన్నిహితమైనది మరియొకటి

ఉండదు," అని శ్రీ శంకరాచార్యులవారు తమ గీతాభాష్యములో తెలిపియున్నారు.

కాలపరిచ్ఛేదమునకు లోనుగాక కాలాతీతమై యున్నందున ఆత్మ సత్యము. దానికి వ్యతిరిక్తముగా తెలిసెడి ఈ దృశ్యమాన జగత్తు పరిమితమై, పరిణామ శీలమై ఉన్నందున ఇది సత్యము కానేరదు. సత్యము కాని వస్తువు గోచరించినచో అది మాయ యని గ్రహించాలి. ఇలా గ్రహించెడి వివేకమే తత్త్వవివేకము.

ద్వైత ప్రపంచమును అంగీకరించుటయే తత్త్వవివేకమని కొందరు అభిప్రాయపడుతుంటారు. ద్వైతము మన ఇంద్రియ మనస్సులకే గోచరించు చున్నందున, ద్వైత నిర్ణయానికి శాస్త్రము అవసరములేదు. అయితే గోచరించు ద్వైత ప్రపంచము ఎలా అద్వయ సత్తారూపమై ఉన్నదో గ్రహించేందుకు శాస్త్రములు, గురుదేవులు ఉపకరించాలి.

ఆత్మా కః?

భావము :—ఆత్మ అనగానేమి ?

స్థూల సూక్ష్మ కారణశరీరాద్ వ్యతిరిక్తః
పంచకోశాతీతః సన్ అవస్థాత్రయ సాక్షీ
సచ్చిదానన్ద స్వరూపః సన్ యస్తిష్ఠతి స ఆత్మా

భావము:— ఏది స్థూల సూక్ష్మ కారణ శరీరములకన్నా భిన్న మైనదియో, పంచకోశములకు అతీతమైనదియో, అవస్థాత్రయమునకు సాక్షి యైనదియో, సచ్చిదానంద స్వరూపమైనదియో అదియే ఆత్మ.

వ్యాఖ్య

ఆత్మ సత్యము. ఆత్మకన్నా అన్యమైనదంతయు మిథ్యయని గ్రహించుట తత్త్వవివేకము. మిథ్యారూపములను తెలుసుకొనునది కూడా ఆత్మయే. తెలుసుకొనెడి ఆత్మ తెలియబడునది కాదు. తెలియబడునది ఏదైనను అది ఆత్మ కానేరదు. కనుక తెలిసిన దానిని బాగా తెలుసుకొని, అది తెలియబడని ఆత్మకన్నా భిన్నమని గ్రహించవలెను. ఇలా గ్రహించుట ద్వారా తెలిసిన స్వరూప మేదియో అదియే సత్యవస్తువుయని తెలియవలెను.

శరీరత్రయము

స్థూల సూక్ష్మ కారణ శరీరములు మనకు తెలియుచున్నవి. తెలియబడే ఈ శరీరములు శాశ్వతము కానేరవు. హస్తపాదములతో కూడియున్న స్థూల శరీరము ఆత్మ కానేరదు. శరీరము నిత్యము మారుచున్నందున అది అవ్యయమైన ఆత్మఎలా అవుతుంది ? శరీరములోని కొన్ని అవయవములు ఖండించబడినను అది కొనసాగుచునే యున్నది. కనుక శరీర మార్పులను వీక్షించునదియే ఆత్మగాని శరీరము ఆత్మ కానేరదు. చూచే వస్తువు చూడబడెడి వస్తువుకన్నా భిన్నమై ఉన్నందున సాక్షియైన ఆత్మ దృశ్యమైన దేహము కానేరదు. కనుక స్థూల దేహమైన అన్నమయ కోశము ఆత్మ కానందున దేహాభిమానము వాంఛించదగినది కాదు.

"మోహ ఏవ మహామృత్యుర్ముముక్షోర్వపురాదిషు
మోహో వినిర్జితో యేన స ముక్తి పదమర్హతి"

"మోక్షము నొందగోరు ముముక్షువునకు దేహముపై మోహము మృత్యురూపములాంటిది. దేహముపై తనకున్న మోహమును ఎవడు జయించునో అట్టివాడు ముక్తిని పొందును". అని శంకరాచార్యులవారు తెలిపియున్నారు.

స్థూలశరీరము ఎలా ఆత్మకాదో సూక్ష్మశరీరము కూడా ఆత్మ కానేరదు. దేని ఆజ్ఞకు లోబడి స్థూలశరీరము చరించుచున్నదో అట్టి అంతఃకరణయే సూక్ష్మశరీరమై తెలియుచున్నది. సూక్ష్మమైన అంతఃకరణ వలన నడుపబడుట చేత స్థూలదేహము ఆత్మకానట్లు, చైతన్య స్ఫూర్తితో నడుపబడు చున్నందున సూక్ష్మదేహముకూడా ఆత్మ కానేరదు.

దర్జీ చేతిలోని కత్తెర దర్జీకన్నా వేరై, ఎలా అతని చేతిలో పని ముట్టుగా వ్యవహరించుచున్నదో, అలాగే స్థూల సూక్ష్మ దేహములు రెండును ఆత్మ చేతనే నడుపబడుచున్నందున ఆత్మకన్నా భిన్నముగా యున్నవి. మనస్సును చూచెడి ఆత్మను మనస్సు గ్రహించే అవకాశము లేనందున ఆత్మ మనస్సనెడి సూక్ష్మ శరీరముకన్నా భిన్నమై ఉన్నది. వస్తువుగా యున్నదానినే మనస్సు గ్రహించగలదు. వ్యక్తమైన విషయమును గూర్చియే మనస్సు ఆలోచించగలదు. అవ్యక్తమైన చైతన్యమును గూర్చి మనస్సు ఆలోచించే అవకాశము లేనందున మనస్సు ఆత్మ కానేరదు.

స్థూల సూక్ష్మములైన దేహ మనోబుద్ధులు ఎలా ఆత్మ కానేరవో, కారణ శరీరమైన ఆనందమయ కోశముకూడా ఆత్మ కానేరదు. సుషుప్తియే ఆనందమయ కోశమైన కారణశరీరమై తెలియుచున్నది. సుషుప్తినందు ఏమియును తెలియుటలేదు. అంతమాత్రాన ఆత్మలేదని చెప్పలేము. ఏదియును లేదు అని ఎవరికి తెలియుచున్నదో అదియే ఆత్మగాయున్నది.ఒక గదిలోని వస్తువులన్నింటిని మనం బయటవేసి గదిలో ఏమియునులేదు అని చెప్పవచ్చును. అయితే ఆ గది నుండి తొలగించుటకు వీలులేని విధముగా గదిలో ఆకాశము ఉన్నది అనెడి విషయమును మనము కాదనలేము. సుషుప్తియందు సర్వము లయించిపోవుచున్నది. కానీ తాను ముక్తాత్మ యనెడి జ్ఞానములేని అజ్ఞానదశయై ఉన్నది. ఆత్మ తెలియబడనంత మాత్రాన ఆత్మను నిరాకరించేందుకు వీలులేదు.అది తెలియకపోయినను, అలా తెలియుటలేదు అనెడి విషయము తెలియుచునే యున్నది. ఎచ్చటా తెలియబడని తాను సర్వమును తెలుసుకొనుచున్నది. కనుక స్థూల సూక్ష్మదేహములలో తెలిసినదానికి, కారణ శరీరమునందు తెలియని దానికి భిన్నమైనదియే ఆత్మ గనుక అది తెలిసిన దానికన్నా వేరుగా, తెలియనిదానికన్నా అతీతముగా మనుగడను సాగించుచున్నది. శరీరత్రయముకన్నా ఏది భిన్నముగా యున్నదో అదియే ఆత్మ .

పంచకోశములు

స్థూల సూక్ష్మ కారణ శరీరములకు భిన్నమైన ఆత్మ పంచకోశాతీతమైనదియని ఆచార్యులు తెలియజేయుచున్నారు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములను పంచకోశములందురు. ఆత్మ ఈ పంచకోశముల కన్నా సూక్ష్మమై పంచకోశములకు అతీతముగా యున్నందున అది పంచకోశములు కానేరదు.

అన్నమయ కోశము స్థూల శరీరము కాగా, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములు సూక్ష్మ శరీరము కాగా, ఆనందమయ్యకోశము కారణ శరీరముగా తెలియుచున్నది.

స్థూలశరీరమే అన్నమయ కోశము అనబడును. శరీరము పరిమితమైనందున అది అపరిమితమైన ఆత్మకానేరదు. శరీరమునకు ఆద్యంతము

లున్నందున అట్టి ఆద్యంతములు గల వస్తువు అనంత మయ్యేందుకు వీలులేనందున దేహము ఆత్మకానేరదు. అదియును గాక దేహము కార్యరూపమున తెలియుచున్నందున దాని వెనుక కారణమొకటి ఉండితీరాలి. ఆ కారణమును ఆధారముగా గాని ఈ శరీరము వచ్చినది. కనుక ఈ శరీరమునకు కారణమైనది ఏదియో అది ఈ శరీరము రావడానికిముందే ఉండితీరాలి. కనుక కారణమైనది ఏదియో అది కార్యమైన ఈ దేహముకన్నా భిన్నమై ఉండుటచేత, దేహము పరిచ్ఛేదములకు లోనై, పరిమిత జీవనమును కలిగి యున్నందున ఇది ఆత్మ కానేరదు.

దేహమును, ఇంద్రియములను నడిపే ప్రాణమయ కోశము కూడా ఆత్మకానేరదు. ఇది ప్రకృతియొక్క కార్యరూపమై యున్నందున జడరూపమైనది. మార్పు చెందెడి స్వభావమును కలిగి యున్నది. వాయు పరిణామమే ప్రాణమయకోశ మగుచున్నందున ఇది ఆత్మఅయ్యేందుకు వీలులేదు. ప్రాణము తానున్నట్లు తనకు తెలియదు. తనను తాను తెలియని ప్రాణమునకు తనకన్నా అన్యమైన ప్రాణులు తెలిసే ప్రసక్తి అసలే లేదు. ప్రాణము జడ స్వరూపము. ఆత్మచైతన్య వంతమైనది. కనుక ప్రాణమయ కోశము ఆత్మకానేరదు.

అన్నమయ ప్రాణమయ కోశములు ఎలా ఆత్మకాలేవో, మనోమయ కోశము కూడాను ఆత్మకానేరదు. 'నేను–నాది ' అనెడి రెండు భావనలు కలిగినదియే మనోమయ కోశము. ద్వైత ప్రపంచమును సృష్టించి జీవుని కలతపెట్టునది ఈ మనోమయ కోశమే. ఇది కూడా ప్రకృతియొక్క రూపాంతరమై యున్నందున మనస్సు కూడా ఆత్మ కానేరదు. జీవికి బంధములు కల్పించునది మనస్సే. అవగాహన చెడిన మనస్సు బంధమును కల్పిస్తుంది. అవగాహన కుదిరిన మనస్సు బంధమును ఛేదిస్తుంది. మనస్సు దుఃఖములను అనుభవించుచున్నందున సుఖరూపమైన ఆత్మ కానేరదు. మనస్సు జడమై ,పరిణామశీలమై ఉన్నందున చైతన్య రూపమై, పరిపూర్ణయుతమైన ఆత్మ కానేరదు. దృశ్యమైన మనస్సు దృక్కైన ఆత్మకన్నా వేరైనందున మనోమయ కోశము కూడా ఆత్మ కానేరదు. విషయసుఖాల మీద, ఇంద్రియ విషయముల మీద ఆధారపడి జీవించే మనస్సు ఆధేయమైనందున అట్టి ఆధేయమైన మనస్సు ఆధారమైన ఆత్మ అయ్యేందుకు వీలులేదు. సుషుప్తిలో మనస్సు లయించుట జరిగినది. అలా మనస్సు లయించినది అని గ్రహించు ఆత్మ లయించుట

జరుగలేదు. మనస్సులేని దశలో కూడా ఆత్మయున్నందున అట్టి ఆత్మ ఎలా మనోమయ కోశము కాగలదు?

బుద్ధియే నాలుగవదియైన విజ్ఞానమయ కోశము. ఇది ప్రాణ మనస్సుల కన్నా సూక్ష్మమైనది. సుషుప్తియందు బుద్ధికూడా లయించి పోవుటచేత ఇది కూడా ఆత్మ కానేరదు. దీనికి కూడా ఆద్యంతము లున్నవి. ఆత్మ ప్రకాశము బుద్ధిలో ప్రతిబింబించనచో ఈ కోశము తెలియబడే అవకాశములేదు. అందుచేత బుద్ధికూడా కార్యరూపముగా తెలియుచున్నది. కర్మాచరణమునందు ఈ బుద్ధియే కర్తయైయుండ, ఇది పనిచేయుటకు పరికరమువలె మనస్సు పని చేయుటచేత మనస్సు కరణమనిపించుకొనినది. మనోబుద్ధులు ఒకే అంతః కరణకు సంబంధించినవి అయినను కర్త కరణము అనెడి రెండు కోణములనుండి పని చేయుట వలన ఆ రెండును వేరుగా తెలియబడుచూ, మనోమయ విజ్ఞానమయ కోశములని ప్రత్యేక నామములతో పిలువబడుచున్నవి. విజ్ఞాన మయ కోశము ఆత్మ జ్ఞానమును మరుగుపరచు కోశమైయున్నది. ఆత్మచైతన్యము బుద్ధిలో ప్రకాశించుటచేత విజ్ఞానము కదిలి "నేను "అనెడి అహంభావన ప్రారంభమగుచున్నది. బల్బునందు విద్యుచ్ఛక్తి ప్రతిబింబించునట్లు బుద్ధియందు ఆత్మ చైతన్యము ప్రతిబింబించు చున్నది. ఆత్మవలన ప్రకాశింపబడెడి బుద్ధి ఆత్మ అయ్యేందుకు వీలు లేనందున విజ్ఞానమయకోశము ఆత్మ కానేరదు. కానీ ఆత్మకు అతి సన్నిహితమైన కోశమైనందున అత్యంత ప్రకాశవంతముగా ఉండును.

గాఢ నిద్రయందు ఏదయితే తెలియుచున్నదో అదియే ఆనందమయ కోశము. సుషుప్తియే ఆనందమయ కోశము అనబడును. ఇది దుఃఖరహిత స్థితి. దుఃఖములేని దశ గనుక ఇది సాపేక్షికముగా ఆనందమై గన్పట్టును. ఈ మాత్రము సుఖము జీవునకు ఆనందమయ కోశము నందే గన్పట్టును. మనోమయ, విజ్ఞానమయ కోశములందు ఇష్టమైన వస్తువులను అనుభవించి నపుడు లేశమాత్రముగా తెలియును. ఆనందమయ కోశముకూడా సోపాధికమై యున్నందున ఇదికూడా పరిమితమై ఆత్మకన్నా భిన్నమై తెలియుచున్నది. పదార్థ సూక్ష్మ కరణము విజ్ఞానమయ కోశముగా తెలియుచున్నందున ఇది కూడా వికారత్వమునకు లోనై ఆత్మకు దూరమగుచున్నది. సుషుప్తి నందు

వాసనలు అణగియుండుటచేత వాసనలకు నిలయమైన ఆనందమయ కోశము ఆత్మ అయ్యేందుకు వీలులేదు. గత జన్మల సుకృత రూపమున కలిగెడి ఈ సుషుప్తి కార్యరూపమై ఉన్నందునను, జ్ఞాన స్థితిలో ఈ కోశము అదృశ్యమగుచున్నందునను, ఆద్యంతములు కలిగిన ఈ ఆనందమయ కోశము ఆత్మ అయ్యేందుకు వీలులేదు.

ఈ పంచకోశములకన్నా వేరుగా మానవునికి ఏమియు తెలియుటలేదు. కోశములు తనకు తెలియుచున్నందున, అవి తెలుసుకొనే తనకన్నా భిన్నమైనందున, పంచకోశములు ఆత్మ కానేరవు.

అవస్థాత్రయము

శరీరత్రయముగా విభజింపబడిన పంచకోశముల ద్వారా జీవించు వ్యక్తి అవస్థాత్రయ మనెడి మూడు భూమికలలో అనుభవములను గడించుచుండును. అవియే జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు. జాగ్రదవస్థలో దేహము, ఇంద్రియ ములు, మనస్సు పనిచేయును. స్వప్నావస్థయందు మనస్సు మాత్రమే పనిచేయును. సుషుప్త్యవస్థ యందు దేహేంద్రియ మనోబుద్ధులన్నియు చేష్టలుడిగి లయించును.

జాగ్రదవస్థలో తెలిసెడి విశ్వుడు స్వప్నావస్థలో తెలియబడుట లేదు గనుక ఒక అవస్థకు పరిమితమైన విశ్వుడు అనంతాత్మ కాడు. అలాగే స్వప్నము నందు తెలియబడిన తైజసుడు జాగ్రత్సుషుప్తుల యందు తెలియ బడ నందున తైజసుడు కూడా ఆత్మకాలేడు. మరి సుషుప్తియందు తెలిసిన ప్రాజ్ఞుడు జాగ్రత్స్వప్నములయందు గోచరించ నందున అతడు కూడా ఆత్మకాబోడు. ఈ మూడు అవస్థలకు సాక్షియై ఉన్నందున ఆత్మ ద్రష్టయై యున్నది. ద్రష్టయైన ఆత్మకు అవస్థాత్రయము దృశ్యములై యున్నందున దృశ్యములు ద్రష్టకన్ననూ భిన్నములు గనుక ఆత్మ అవస్థాత్రయము కన్నా వేరై అవస్థాత్రయ సాక్షి అని పిలువబడుచున్నది.

సచ్చిదానంద స్వరూపము

స్థూల సూక్ష్మ కారణ శరీరములు, పంచకోశములు, అవస్థాత్రయము అనున వన్నియు నిషిద్ధ లక్షణాలుగ గ్రహించి వాటిని విస్మరించిన తరువాత

ఆత్మయొక్క విధేయ లక్షణాలను స్మరించి తరించ వలసిన ఆవశ్యకత ముముక్షువునకు ఎంతైనా కలదు. ఆత్మయొక్క ఈ విధేయ లక్షణాలనే సచ్చిదానందము అందురు. ఈ లక్షణములు అనుభవమునకు అందుటయే ఆత్మ సాక్షాత్కార మనబడును.

అవస్థాత్రయము మారుచున్నను దానిని తెలుసుకొను తాను మార్పు చెందనివాడై యున్నందున ఆత్మ కాలాతీత మనుగడను కలిగి "సత్" అని పిలవబడుతున్నాడు. మారుతున్న సమస్తమును గ్రహించెడి తాను జ్ఞానరూపమై "చిత్" అని పిలువబడు చున్నాడు. సత్, చిత్ స్వరూపమైన ఆత్మ పూర్ణమై ఉన్నందున "ఆనంద" రూపుడుగా పిలువబడుచున్నాడు. కనుక ఆత్మ సచ్చిదానంద స్వరూపమై ఉన్నది.

దేశకాలాదుల యందు చిక్కనిది ఆత్మయైనందున అది "సత్తు"గా యున్నది. సత్తు అనునది ఉన్నచో జ్ఞానము అను దానిని సత్పదార్థమునుండి వేరుచేసే అవకాశము లేనందున అది 'చిత్తు' యై యున్నది. తెలియబడే సమస్తమును నిరాకరించ వచ్చునేమో గాని తెలిసికొనే చైతన్యమును నిషేధించలేము.ఒకవేళ అలా నిషేధించవలెనని ఆలోచించినను, అట్టి ఆలోచన కదులుటకు ఆధారమైనది కూడా చైతన్యమే అయి యున్నది. కనుక ఏ విధమైన వికారములకు లోను గాని ఆత్మ అసంపూర్ణతను తెలియనిదియై ఆనంద స్వరూపముగా అవగత మగుచున్నది.

శరీరత్రయము

స్థూలశరీరము

స్థూలశరీరం కిం ?

భావము :– స్థూల శరీరమనగా నేమి ?

పంచీకృత పంచ మహాభూతైః కృతం సత్కర్మ జన్యం
సుఖ దుఃఖాది భోగాయతనం శరీరం, అస్తి
జాయతే వర్ధతే విపరిణమతే అపక్షీయతే
వినశ్యతీతి షడ్వికారవత్ ఏతత్ స్థూలశరీరమ్

భావము :– పంచీకరణము నొందిన పంచమహాభూతముల వలన పుట్టినదియై, సుఖదుఃఖముల ననుభవించుటకు ద్వారమువలె నుపయోగ బడుచు, ఉండుట, పుట్టుట, పెరుగుట, మార్పు చెందుట, క్షీణించుట, నశించుట అను ఆరు వికారములను కలిగియున్న శరీరమును స్థూల శరీరము అందురు.

వ్యాఖ్య

పృధివ్యప్తేజో వాయు రాకాశములనెడి పంచభూతములు పంచీకరణము చెందుటద్వారా స్థూలశరీరము ఏర్పడినది. అందుచేత శరీరము పాంచ భౌతికమని చెప్పబడుచున్నది. భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశము అనెడి ఈ ఐదు భూతములను పంచభూతములు అందురు.

కర్మ చేయుటయందు మనోబుద్ధులు కర్తగా వ్యవహరించు చున్నను త్రాగేది పాలైనా ఆధారముగా పాత్ర అవసరమైనట్లు, ఈ స్థూల శరీరము పాత్రవలె ఉపయోగపడుచున్నది. తీరము చేరుటకు పడవ ఉపకరించునట్లు కర్మలో చరించుటకు దేహము ఉపకరించును. ఈ స్థూల దేహము ఏ అవస్థయందు చరించునో దానిని జాగ్రదవస్థ అందురు.

స్థూల శరీరము నీటితో, మట్టితో రూపు దాల్చినది. శరీరములోని ఉష్ణోగ్రత నిప్పుయొక్క లక్షణము. ప్రాణ స్పందన వాయు పరిణామమై ఉన్నది. ఆకాశమును ఆక్రమించుకొని శరీరము చరించుచున్నది. ఈ విధముగా శరీరము పాంచ భౌతికమై ఉన్నది.

శరీరము పాంచభౌతికమని తేలినది. మరి అందరి శరీరాలు ఒకే విధముగా ఉండవు. ఎందుకని ? నిజమే. అవయవ నిర్మాణమునందుగాని, అంతఃకరణ ప్రభావమునందుగాని మనిషికి మనిషికి తారతమ్యము గోచరించు చుండును. గతజన్మలలో ఆచరించిన కర్మలయొక్క ఫలితముగా స్థూల శరీరము లభించుట వలన వ్యక్తులయొక్క కర్మల యందు మార్పులు గోచరించుటచేత, వారు పొందు శరీరముల యందును వాని ద్వారా ఆచరించబడు కర్మల యందును భేదము గోచరించుచునే ఉండును.

ఈ శరీరము స్థూలమని గ్రహించితిమి. స్థూలమైన వస్తువు వచ్చుటకు కారణమొకటి ఉండవలెను. స్థూలమునకు కారణమైనది సూక్ష్మమై ఉండును. అవియే తన్మాత్రలు అనబడును. సూక్ష్మమైన తన్మాత్రలు స్థూలముగా

మార్పుచెందు ప్రక్రియనే పంచీకరణము అందురు. ఈ పంచీకరణము ద్వారా ఏర్పడిన స్థూల పంచభూతముల వలన మనకు స్థూల శరీరము వచ్చినది. ఈ విషయమును ఆచార్యుల వారు మున్ముందు చక్కగా తెలియజేస్తారు.

ఇలా తయారైన స్థూలశరీరము సుఖదుఃఖానుభవములను పొందుటకు నిలయమై తెలియుచున్నది. గృహస్థుడు నివసించుటకు గృహమెలా ఉపకరించుచున్నదో, అలాగే ఈ స్థూలదేహము జీవునకు నివాసస్థానమై ఉన్నది. పూర్వపుణ్య విశేషమువలన సుఖ దుఃఖములను అనుభవించుటకు జనించిన ఈ స్థూల శరీరము షడ్వికారములను బొందుచున్నది.

పరిమిత వస్తువు ఏదైనను అది పరిణామ శీలమయ్యే ఉండును. శరీరముకూడా పరిమితమై, ఆద్యంతములు కలిగియున్నందున అది కూడ మార్పు చెందునదియై షడ్వికారములను కలిగియున్నది. ఈ మార్పులే జనన మరణాదుల రూపమున గోచరించుచున్నవి. దేహమునకు కలిగెడి ఆరు వికారములు ఏవనగా (1) అస్తి :- అనగా తల్లి గర్భమున తొమ్మిది మాసములు పడియుండుట (2) జాయతే :- అనగా తల్లి గర్భము నుండి బహిర్గతమగుట. (3) వర్ధతే :- అలా పుట్టిన శరీరము క్రమేపి వృద్ధి చెందుట (4) విపరిణమతే :- (మార్పు చెందుట) శరీరములోని అవయవములు మార్పు చెందుచుండుట వలన వృద్ధి క్షయాలు గోచరించుచుండుట (5) అపక్షీయతే :- అనగా క్షీణించుచుండుట. ఇది క్షయదోషము. కాలములో శరీరము కరిగి పోవుచుండుట (6) వినశ్యతి :- అనగా నశించుట. శ్మశానములో పిడికెడు బూడిదగా మారిపోవుట. స్థూల దేహమునకు సంప్రాప్తమయ్యెడి ఈ ఆరు వికారములను షడ్వికారములు అందురు. ఈ షడ్వికారములకు లోనై పాంచభౌతికమైనదియే స్థూలదేహము.

సూక్ష్మ శరీరము

సూక్ష్మ శరీరం కిం ?

భావము :- సూక్ష్మ శరీరమనగా నేమి ?

అపంచీకృత పంచమహాభూతైః కృతం సత్కర్మ జన్యం
సుఖదుఃఖాది భోగసాధనమ్ పంచ జ్ఞానేంద్రియాణి

పంచకర్మేంద్రియాణి పంచ ప్రాణాదయః మనశ్చైకం
బుద్ధిశ్చ ఏవం సప్తదశా కలాభిః సహ యత్తిష్ఠతి తత్ సూక్ష్మ శరీరమ్

భావము :- పంచీకరణము నొందని సూక్ష్మములైన పంచమహాభూతములచేత కల్గినదియై, పూర్వ పుణ్యావశమున లభించి, సుఖాదుఃఖాది భోగములకు సాధనమగుచు, ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, ఐదు ప్రాణములు, మనస్సు, బుద్ధి అనెడి పదునేడు భాగములతోకూడినది సూక్ష్మశరీర మనబడును.

వ్యాఖ్య

అపంచీకృత పంచమహా భూతములకు సంబంధించిన పదునేడు తత్త్వములతో తయారైన శరీరమును సూక్ష్మ శరీరము అందురు. సూక్ష్మ శరీరము యొక్క నిర్మాణమును శ్రీ శంకరులవారు ఇచ్చట తెలియ జేయుచున్నారు. ఈ సూక్ష్మ శరీరమునే లింగ శరీరమని కూడా అందురు. స్వస్వరూప జ్ఞానము లేకపోవుటవలన ప్రాప్తించిన ఈ లింగ శరీరము వాసనలచే నిండినదియై, అనాదిగా తెలియబడు చున్నది. వడ్రంగికి పనిముట్లు ఎలా సాధనములో, సుఖదుఃఖములను అనుభవించుటకు జీవునకు సూక్ష్మశరీరము సాధనమై ఉన్నది. స్థూల శరీరము కార్యరంగమున చరించుటకు సూక్ష్మ శరీరము కారణమై ఉన్నది. ఈ సూక్ష్మశరీరము పదునేడు తత్త్వములతో కూడియున్నది. అవియే ఐదు జ్ఞానేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, ఐదు ప్రాణములు, ఒక మనస్సు మరియు ఒక బుద్ధి అనునవి.

జ్ఞానేంద్రియములు :- చెవి, చర్మము, కన్ను, నాలుక, ముక్కు అను ఈ ఐదు ఇంద్రియములను జ్ఞానేంద్రియములు అందురు.

కర్మేంద్రియములు :- నోరు, చేయి, కాలు, జననేంద్రియము, పురీషనాళము అను ఈ ఐదింటిని కర్మేంద్రియములు అందురు.

పంచప్రాణములు :- ప్రాణము, అపానము , సమానము, ఉదానము, వ్యానము అను ఐదింటిని పంచ ప్రాణములు అందురు. ఇచ్చటికి పదునెదు కాగా ఆలోచించు మనస్సు, నిశ్చయించు బుద్ధి కలిసి మొత్తము పదునేడు తత్త్వములైనవి. వీటితో నిర్మించబడినదియే సూక్ష్మశరీరము. సుఖదుఃఖాది భోగసాధనము.

జ్ఞానేంద్రియములు

శ్రోత్రం త్వక్ చక్షుః రసనా ఘ్రాణమ్ ఇతి పంచజ్ఞానేంద్రియాణి

భావము :– చెవులు, చర్మము, నేత్రములు, నాలుక, ముక్కు అను ఈ ఐదింటిని పంచ జ్ఞానేంద్రియములు అందురు.

వ్యాఖ్య

ప్రపంచము నుండి వచ్చెడి విషయజ్ఞానము ఏ ఇంద్రియముల ద్వారా మనకు అందుచున్నదో వానిని జ్ఞానేంద్రియములు అందురు. జ్ఞానము వీని ద్వారా కలుగుచున్నందున ఈ ఇంద్రియములకు ఆ పేరు వచ్చినది. ఈ జ్ఞానేంద్రియములు చరించుటకు ఉపకరించు తత్త్వములను అధిష్ఠాన దేవతలు అందురు. ఇచ్చట పంచభూతములే అధిష్ఠాన దేవతలై ఉన్నారు.

జ్ఞానేంద్రియ అధిష్ఠాన దేవతలు

శ్రోత్రస్య దిగ్దేవతా

భావము :– చెవులకు అధిష్ఠాన దేవత ఆకాశము .

త్వచో వాయుః

భావము :– చర్మమునకు అధిష్ఠాన దేవత వాయువు.

చక్షుషః సూర్యః

భావము :– నేత్రములకు అధిష్ఠాన దేవత సూర్యుడు.

రసనాయా వరుణః

భావము :– నాలుకకు అధిష్ఠాన దేవత వరుణుడు.

ఘ్రాణస్య అశ్వినౌ

భావము :– ముక్కుకు అధిష్ఠాన దేవతలు అశ్వనీ కుమారులు.

ఇతి జ్ఞానేంద్రియ దేవతాః

భావము:– ఈ విధముగా జ్ఞానేంద్రియ అధిష్ఠాన దేవతలున్నారు.

వ్యాఖ్య

ఇచ్చట దేవతలనగా మనకు కనపడక ఏవో లోకాలలో చరించే వింత వ్యక్తులని భావించరాదు. మన దేహము పంచభూతముల నుండి ఆవిర్భవించినది. అందుచేత ఇచ్చట అవియే అధిష్ఠాన దేవతలుగా తెలియుచున్నవి. వీనికి స్థూల సూక్ష్మములు అను రెండు రూపములున్నవి. స్థూలరూపము ఇంద్రియములు కాగా సూక్ష్మరూపము అధిష్ఠాన దేవతలై ఉన్నారు. ఉదాహరణకు కన్ను స్థూల రూపము. అధిష్ఠాన దేవతయగు సూర్యుడు సూక్ష్మ రూపము.

చెవులకు ఆకాశము అధిష్ఠానదేవతగా యున్నది. వినుట చెవి యొక్క పని. చెవి వినెడి శబ్దము ఆకాశము నుండి పుడుతుంది. ఖాళీ ప్రదేశము లేనిచో శబ్దము కలిగేందుకు వీలులేదు. శబ్దము కదిలినను చెవిలో ఖాళీలేనిచో కర్ణభేరికి వినిపించే అవకాశమే లేదు కనుక చెవులకు ఆకాశము అధిష్ఠానదేవతయై యున్నది.

చర్మమునకు వాయువు అధిష్ఠాన దేవతగా యున్నది. స్పృశించుట చర్మము యొక్కపని. వాయు చలనము లేనిచో స్పర్శ తెలిసే అవకాశము లేనందున చర్మమునకు వాయువు అధిష్ఠాన దేవతయై ఉన్నది.

కన్నులకు అధిష్ఠాన దేవత సూర్యుడు. చూచుట నేత్రముల యొక్క పని. నేత్రములు రూపములను దర్శించును. అట్టి రూపములను సూర్యుడు ప్రకాశింపచేయును. సూర్యుని కాంతిలో వెలిగెడి వస్తువులను నేత్రములలోని ప్రకాశము గాంచుచున్నది. అందువలన కంటికి అధిష్ఠాన దేవత సూర్యుడై ఉన్నాడు.

నాలుకకు అధిష్ఠానదేవత వరుణుడు. రసమును ఆస్వాదించునది రసనేంద్రియము గనుక రసోత్పత్తికి ఉపకరించు వరుణుడు నాలుకకు అధిష్ఠానదేవతయై ఉన్నాడు.

ముక్కుకు అధిష్ఠాన దేవతలు అశ్వినీకుమారులు. వాసన జూచుట ముక్కు యొక్క పని. పృథ్వి గంధము నందించును. అలాంటప్పుడు ముక్కుకు అధిష్ఠాన దేవత భూమి అనకుండా అశ్వినీ కుమారులు అని చెబుతున్నారెందుకని ? నాలుగు జ్ఞానేంద్రియములకు నాలుగు పంచభూతములు అధిష్ఠాన దేవతలుగా తెలియుచుండ ఐదవ ఇంద్రియమునకు వేరొక అధిష్ఠాన

దేవతల పేరు నుదహరించుటలోని భావమేమి? అనెడి సందేహము రావచ్చును. అశ్వినీ కుమారులు భూమినుండి పుట్టినవారు. కనుక శ్రీ శంకరులు గొప్ప కవిశేఖరులు కూడా అయినందున తమ సహజ కవితా ధోరణిలో భూమికి బదులుగా అశ్వినీ కుమారులు అని తెలియ జేయుట జరిగినది.

జ్ఞానేంద్రియ కార్యములు

శ్రోత్రస్య విషయః శబ్దగ్రహణమ్

భావము:- చెవులకు శబ్దము నాలకించుటయే పని.

త్వచో విషయః స్పర్శ గ్రహణమ్

భావము:- స్పర్శను తెలుసుకొనుట చర్మము యొక్క పని.

చక్షుషో విషయః రూపగ్రహణమ్

భావము:- రూపములను గాంచుట నేత్రముల యొక్క కార్యము.

రసనాయా విషయః రసగ్రహణమ్

భావము:- రుచి చూచుట నాలుక యొక్క కార్యము.

ఘ్రాణస్య విషయః గంధగ్రహణం ఇతి

భావము:- వాసనచూచుట ముక్కు యొక్క కార్యము.

కర్మేంద్రియములు

వాక్పాణి పాద పాయూపస్థానీతి పంచ కర్మేంద్రియాణి

భావము :- వాక్కు, చేతులు, కాళ్ళు, మలేంద్రియము, జననేంద్రియము అను ఈ అయిదింటిని కర్మేంద్రియములు అందురు.

కర్మేంద్రియ అధిష్ఠాన దేవతలు

వాచోదేవతా వహ్నిః

భావము :- వాక్కుకు అధిష్ఠాన దేవత అగ్నిదేవుడు.

హస్తయో రిన్ద్రః

భావము :- చేతులకు అధిష్ఠాన దేవత ఇంద్రుడు.

పాదయో ర్విష్ణుః

భావము :- పాదములకు అధిష్ఠాన దేవత విష్ణువు.

పాయోర్మృత్యుః

భావము :- మలేంద్రియమునకు అధిష్ఠాన దేవత యముడు.

ఉపస్థస్య ప్రజాపతిః

భావము :- మూత్రనాళమునకు అధిష్ఠాన దేవత బ్రహ్మదేవుడు.

ఇతి కర్మేంద్రియ దేవతాః

భావము :- ఈ విధముగా కర్మేంద్రియ దేవతలున్నారు.

కర్మేంద్రియ కార్యములు

వాచో విషయః భాషణమ్

భావము:- వాగింద్రియమునకు మాటలాడుటయే పని.

పాణ్యో ర్విషయః వస్తు గ్రహణమ్

భావము:- వస్తువులను గ్రహించుట చేతులయొక్కపని.

పాదయో ర్విషయః గమనమ్

భావము :- నడుచుట పాదముల యొక్క కార్యము .

పాయో ర్విషయః మలత్యాగః

భావము :- పురీషనాళమునకు మలవిసర్జనము చేయుటయే పని.

ఉపస్థస్య విషయః ఆనంద ఇతి

భావము :- జననేంద్రియమునకు సుఖము ననుభవించుటయే కార్యము.

వ్యాఖ్య

విషయ ప్రపంచమునకు సంబంధించిన జ్ఞానము జ్ఞానేంద్రియముల ద్వారా మనకు అందును. ఇలా అందిన జ్ఞానముతో స్పందించిన అంతఃకరణ కర్మేంద్రియముల ద్వారా తత్సంబంధిత కర్మరంగమున చరించును. జ్ఞానేంద్రియమగు శ్రోత్రేంద్రియము శబ్దము నాలకిస్తుంది. కర్మేంద్రియమగు వాగింద్రియం శబ్దమును పల్కుతుంది. జ్ఞానేంద్రియ మగు త్వగింద్రియం స్పర్శను గ్రహిస్తుంది. కర్మేంద్రియమగు పాణీంద్రియము స్పర్శను ప్రవేశ పెడుతుంది. జ్ఞానేంద్రియమగు చక్షురింద్రియం దర్శిస్తుంది. కర్మేంద్రియమగు పాదేంద్రియం అచ్చోటికి నడుస్తుంది. జ్ఞానేంద్రియమగు రసనేంద్రియం రసాన్ని గ్రహిస్తుంది. కరేంద్రియమగు గుహ్యేంద్రియం రసాన్ని వదుల్తుంది. జ్ఞానేంద్రియమగు ఘ్రాణేంద్రియముగంధాన్ని గ్రహిస్తుంది. కర్మేంద్రియమగు గుదేంద్రియం మల రూపంలో గంధాన్ని వదులుతుంది.

మనము మాట్లాడుటకు మనలోని అగ్నియే కారణమైనందున వాక్కుకు అగ్నిదేవుడు అధిష్ఠానదేవత అయ్యెను. ఇంద్రుడు ఇంద్రియములకు ప్రభు వైనందున చేతులకు అధిష్ఠానదేవత ఇంద్రుడు ఆయెను. పాదములు విశ్వమున నడక సాగించును. విశ్వమంతయు వ్యాపకమైన వాడు విష్ణువై నందున, విశ్వమున చరించెడి పాదములకు విష్ణువు అధిష్ఠాన దేవత ఆయెను. జీర్ణమైన శరీరములను యముడు తొలగించునట్లు జీర్ణము కాగా మిగిలిన మాలిన్యమును గుదేంద్రియం తొలగించుట వలన గుదేంద్రియమునకు అధిష్ఠానదేవత యముడు ఆయెను.పుట్టించు వాడు బ్రహ్మ గనుక జనాభాను ఉత్పత్తి చేయుటకు కారణమైన జననేంద్రియమునకు బ్రహ్మదేవుడు అధిష్ఠానదేవత ఆయెను.

ఇంతవరకు స్థూల శరీరము, సూక్ష్మశరీరములోని పదునేడు తత్త్వాలలో జ్ఞానేంద్రియ కర్మేంద్రియము లనెడి పది తత్త్వములు తెలిసి వచ్చినవి. మిగత ఏడు తత్త్వములు మున్ముందు చెప్పబోవును. ప్రస్తుతం శరీరత్రయము నందలి మూడవ శరీరమైన కారణ శరీరమును గూర్చి చెప్పబోవు చున్నారు.

కారణ శరీరమ్ కిం ?

భావము :– కారణ శరీరమనగా నేమి ?

అనిర్వాచ్యా నాద్యా విద్యారూపం
శరీరద్వయస్య కారణమాత్రం సత్స్వరూపాఽజ్ఞానం
నిర్వికల్పకరూపం యదస్తి తత్ కారణ శరీరమ్

భావము :– ఏదయితే నిర్వచించుటకు వీలులేనిదియై, అవిద్యా రూపమున ఉంటూ, స్థూల సూక్ష్మములనెడి రెండు శరీరములకు కారణమగుచు, స్వరూపజ్ఞానము లేక , వికల్పము తెలియని రూపమై ఉన్నదో అదియే కారణ శరీరము.

వ్యాఖ్య

కారణ శరీరమునే అవిద్యాశరీరమని కూడా అందురు. సుషుప్తియే దీని స్థానము. ఇందులో దేహేంద్రియ మనోబుద్ధుల చేష్టలన్నియు సంపూర్ణముగా అణగియుండును. ఈ స్థితిలో సత్త్వరజస్తమోగుణములు అవ్యక్త స్థితిలో నుండును. ఇది అవధిలేని, పరిధి తెలియని దుఃఖరహిత అజ్ఞానదశ. ఒక్కమాటలో చెప్పాలంటే స్వరూప జ్ఞానములేని అయోమయ దశ.

ఈ కారణ శరీరము అనిర్వాచ్యము. అనగా నిర్వచించుటకు వీలులేనిది అని భావము. అజ్ఞానమే దీని స్థితియై యున్నందున ఇది నిర్వచించుటకు వీలుకానిదియై ఉన్నది. అజ్ఞానము నిర్వచించలేరు. ఎందుకని ? అజ్ఞానములో నున్నవాడికి ఎలాగూ అజ్ఞానము అర్థమయ్యేందుకు వీలులేనందున అజ్ఞాని అజ్ఞానమును గూర్చి ప్రవచించలేడు. మరి జ్ఞానియైనవాడు సదా జ్ఞానమునందే యున్నందున సూర్యునికి చీకట్లు తెలియని విధముగా జ్ఞానికి అజ్ఞానము అర్థమయ్యే అవకాశము లేదు. అదియునుగాక అజ్ఞానము అనాదిగా తెలియు చున్నందున అనాదియైన అజ్ఞానము అంతఃకరణకు తెలిసే అవకాశము లేదు. స్వస్వరూప జ్ఞానము సుషుప్తియందు గోచరించనందున కారణ శరీరము అవిద్యా రూపమై ఉన్నది.

"సుషుప్తి కాలే సకలే విలీనే
తమోభిభూతః పరితృప్తి మేతి"

సుషుప్తి కాలమున సర్వము లయించిపోవుచున్నందున తమస్సుచేత ఆవరించబడి జీవుడు సుఖమును అనుభవించుచున్నాడు " అని కైవల్య శ్రుతి తెలుపుచున్నది. నిద్రనుండి లేవగనే ప్రతి ఒక్కడు "నాకేమియు తెలియదు " అని అనుభవపూర్వకముగా తెలుపుటచేత సుషుప్తియందు అనగా కారణ శరీరమునందు అజ్ఞానమే ఉన్నదని తెలియుచున్నది. మరి స్థూల సూక్ష్మ దేహములకు కారణమేమిటి ? వానికి కూడా కారణము అజ్ఞానమే గనుక అజ్ఞాన స్వరూపమైన కారణ శరీరము మిగిలిన రెండు దేహములకు కారణముగా

తెలియుచున్నది. మరి అజ్ఞానమంటూ ఒకటున్నదని తెలుసుకొను నీవు ఒకడివి ఉండుటచేత తెలుసుకొనెడి నీవు తెలియబడెడి దానికన్నా అన్యమైనవాడివి గనుక కారణశరీరము సైతము నీవు అయ్యేందుకు వీలులేదు.

అవస్థాత్రయము

అవస్థాత్రయం కిం ?

భావము:- అవస్థాత్రయ మనగా నేమి?

జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థా

భావము :- జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు అవస్థాత్రయ మనబడును..

జాగ్రదవస్థా కా ?

భావము :- జాగ్రదవస్థ అనగా నేమి ?

శ్రోత్రాది జ్ఞానేంద్రియైః శబ్దాది విషయైశ్చ
జ్ఞాయతే ఇతి యత్ సా జాగ్రదవస్థా ।
స్థూల శరీరాభిమాని ఆత్మా విశ్వ ఇత్యుచ్యతే

భావము :- ఏ అవస్థలో శ్రోత్రాది జ్ఞానేంద్రియములతో శబ్దాది విషయములను తెలుసుకొని అనుభవించుట జరుగుచున్నదో అది జాగ్రదవస్థ. స్థూల శరీరములో కూడిన ఆత్మను విశ్వుడు అందురు.

వ్యాఖ్య

స్థూల శరీరాభిమాని యైన ఆత్మ విశ్వుడనబడును. విశ్వుడైన తాను స్థూల శరీరముతో తాదాత్మ్యము చెంది, జ్ఞానేంద్రియముల ద్వారా విషయ ప్రపంచమును గ్రహించుచు అది తనకన్నా అన్యమని భావించుట జరుగుచున్నది. స్థూలశరీర ప్రజ్ఞను కలిగియున్నపుడే ఇంద్రియముల ద్వారా విషయ ప్రపంచమును అనుభవించుటయు, స్థూలజగత్తును దర్శించుటయు జరుగుచున్నది. కనుక జాగ్రదవస్థ స్థూలశరీరము యొక్క పూర్ణ వ్యక్త స్వరూపమై యున్నది. జాగ్రదవస్థ యందలి స్థూల శరీరము బాహ్య జగత్తు నందలి విషయములను అనుభవించుటకు పరికరముగా ఉండుటయే గాక అనుభవించే విశ్వుడు తిరిగి వచ్చి విలుచుటకు స్థావరమై కూడా యున్నది. స్థూల శరీరము మనకు

గోచరించు విశ్వమునందు చరించునది కావున, స్థూలశరీరము ద్వారా విశ్వమున చరించెడి ఆత్మను విశ్వుడు అని తెలిపారు.

జాగ్రదవస్థలో నలభై రెండు తత్త్వాల ప్రమేయం ఉన్నట్లు ఇప్పటికి మనకు అర్థమయింది.పదునాలుగు ఇంద్రియాలు, వాటి అధిష్ఠాన దేవతలు పదునాలుగు, అవి చరించెడి విషయాలు పదునాలుగు వెరశి నలుబది రెండు తత్త్వములతో కూడి తెలియునది జాగ్రదవస్థ అయి ఉన్నది.

ఇంద్రియాలు, అధిష్ఠాన దేవతలు, ఇంద్రియ విషయాలు ఈ మూడూ కలిసినపుడే జాగ్రదవస్థలో విషయానుభవము కలుగుతుంది. ఒక వ్యక్తిని చూడాలను కున్నావు. ఆ వ్యక్తి లేడు. కనుక నీవు చూచుట జరుగలేదు. ఇచ్చట వస్తువు లోపించినది. ఒకవేళ ఆ వ్యక్తి ఉన్నాడనుకొందాము. వ్యక్తి ఉన్నాడు. కానీ అంతా చీకటిగా వుంది. ఇప్పుడు కూడా ఉన్న ఆ వ్యక్తిని చూడలేక పోతున్నాము. అనగా ఇప్పుడు అధిష్ఠాన దేవత లభించక పోవడమే కారణము. సరే ఇది బావుంది. మరి వ్యక్తి ఉన్నాడు. సూర్యుడు వెలుగుతూ వున్నాడు కానీ చూచేవానికి కన్నుపోయింది. కనుక వస్తువు కనుపించడము లేదు. ఇచ్చట లోపించినది. ఇంద్రియము. జీవుడైన విశ్వుడు జాగ్రదవస్థలో ఈ విధముగా కలత చెందుతూ ఉంటాడు.

స్వప్నా వస్థా కా ?

భావము :- స్వప్నావస్థ అనగా నేమి ?

స్వప్నావస్థా కేతి చేత్ జాగ్రదవస్థాయాం యద్ దృష్టం
యద్ శృతం తజ్జనిత వాసనాయా నిద్రా సమయే
యత్ ప్రపంచః ప్రతీయతే స స్వప్నావస్థా! సూక్ష్మ
శరీరాభిమానీ ఆత్మా తైజస ఇత్యుచ్యతే

భావము :- జాగ్రదవస్థయందు ఏది చూడబడినదో, వినబడినదో, తత్సంబంధ వాసనలతో నిద్రానమయమునందు ఏ ప్రపంచము చూడబడుచున్నదో అట్టి అవస్థను స్వప్నావస్థ అందురు. సూక్ష్మశరీరాభిమానియగు ఆత్మను తైజసు డందురు.

వ్యాఖ్య

స్వప్నావస్థయందు మనస్సే కర్తగాను, భోక్తగాను వ్యవహరించు చున్నది. ఈ ఆంతరంగిక నాటకంలో జాగ్రదవస్థ అనుభవములను జ్ఞాపకాలను ఆధారముగా

జేసుకొని మనస్సు తనకొక మాయా ప్రపంచమును తయారు చేసుకొని కల్పిత సుఖ దుఃఖములను అనుభవించును. మనస్సు అలా అనుభవించుచున్నను ఆత్మ మనో చేష్టలను సాక్షివలె వీక్షించుచుండును. మనస్సు చరించుటకు వలయు జీవశక్తిని తానొసంగినను సాక్షివలె వ్యవహారములను దర్శించుటచేత ఆత్మ సూక్ష్మ శరీరముచేత అంటబడదు. జాగ్రదవస్థను ప్రకాశింపజేసెడి సూర్యచంద్ర నక్షత్రాగ్నులు ప్రకాశించలేని స్థానము స్వప్నావస్థయై యున్నది. ఇచ్చట జీవుడు తన తేజముతోనే స్వప్నానుభవములను పొందుచున్నందున అతడు తైజసుడని పిలువబడినాడు.

స్వప్నావస్థ పరిమితమైనది. జాగ్రత్సుషుప్తుల యందు దీని ఉనికి శూన్యము. స్వప్నము అంతర్యమున జరుగుచున్నందునను, నియమిత భూమికలో జరుగుచున్నందునను అది ఆత్మ అయ్యేందుకు వీలులేదు. స్వప్నావస్థ నీకు తెలియుచున్నందున అది నీవు కాదు. మరి స్వప్నావస్థను చూచునది మనస్సుకదా ! అవును. స్వప్నావస్థ మనస్సునకే తెలియుచున్నది. కానీ నీవు స్వప్నావస్థ లేదని కూడా తెలుసుకొనువాడవై యున్నావు. జాగ్రదవస్థ యందు "బహిష్ప్రజ్ఞ" యున్నది. స్వప్నావస్థ యందు "అంతఃప్రజ్ఞ" ఉన్నది. ఇవి ఒకటి మరియొక దానిని పరిమిత మొనర్చుచున్నందున రెండూనూ ఆత్మ కానేరవు . ఈ రెండింటిని గూర్చి నిర్ణయము చేసి తీర్పు చెప్పు వ్యక్తి రెండు భూమికలకు సంబంధించినవాడు కానపుడే తీర్పు నిష్పాక్షికముగా ఉండును. కనుక జాగ్రత్స్వప్నములు రెండింటిని గ్రహించే నీవు ఆ రెండింటికన్ననూ వేరై యున్నందున నీవు ఆ రెండు అవస్థలకు సంబంధించిన వాడవు కావు .

అతః సుషుప్త్యవస్థా కా ?

భావము :- సుషుప్త్యవస్థ అనగా నేమి ?

అహం కిమపి న జానామి సుఖేనమయా నిద్రాఽను భూయతే ఇతి సుషుప్త్యవస్థా, కారణ శరీరాభిమానీ ఆత్మప్రాజ్ఞ ఇచ్యతే

భావము :- "నాకేమి తెలియలేదు. నేను సుఖముగా నిద్రించితిని " అని దేనిని గూర్చి చెప్పుచున్నాడో అదియే సుషుప్త్యవస్థ. కారణ శరీరాభిమానియగు ఆత్మను ప్రాజ్ఞుడు అందురు.

వ్యాఖ్య

జాగ్రత్స్వప్నములనుండి వేరుపడిన వ్యక్తి సుషుప్త్యవస్థయందు ఉండును. జాగ్రత్స్వప్నముల యందు గడించిన అనుభవములన్నియు అవ్యక్తంగా బీజ రూపమున సుషుప్తియందు ఉండును. సుషుప్తిలో మనోబుద్ధులు నిర్వ్యాపారమును సాగించును. ఇచ్చట సత్యము తెలియదు. అలాగని మిథ్యా ప్రపంచమును అర్థము కాదు. "నాకేమి తెలియదు" అనునదియే ఈ అవస్థలో వ్యక్తియొక్క అనుభవము. ఇచ్చట అజ్ఞానమే వ్యక్తమగును. మనోజనిత సంకల్పతరంగాలు ఆగుటవలన జీవుడు సుఖించునట్లు భావించును. విశ్వతైజసులతో పోల్చినపుడు ప్రజ్ఞారూపమైన ఆత్మకు దగ్గరగా నున్న అవస్థ సుషుప్త్యవస్థయేగనుక ఈ అవస్థయందు చరించు ఆత్మకు ప్రాజ్ఞుడు అని పేరు వచ్చినది.

సుషుప్తిలో "నాకేమి తెలియలేదు " అని మేలుకొన్న వ్యక్తి చెబుతాడు. ఇదీ జ్ఞానమే కదా ! అవును. అయితే ఇది అనుభవరూపమైనది కాదు. అనుభవించిన అవిద్యకు సంబంధించిన విద్యారూపము. అవిద్యకు సంబంధించిన సుషుప్తి నేను అయ్యేందుకు వీలులేదు.

జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థ లనెడి మూడు అవస్థలు చక్కగా తెలియ జేయబడినవి. ఈ అవస్థలు మూడూ మారుచూ ఒక దానిని మరొకటి పరిమిత మొనర్చుచున్నవి. ఆత్మ ఈ మూడు అవస్థలను ప్రకాశింపజేయుచు, తత్ప్రకాశముచే ప్రవర్తించెడి అవస్థలను గ్రహించుచున్నది. మారుతున్న అవస్థాత్రయమును సాక్షివలె వీక్షించెడి ఆత్మమారనిదియై ఉన్నది. జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలచే అంటబడక శుద్ధసత్తా స్వరూపమై ఉన్నది.

పంచకోశములు

పంచకోశాః కే ?

భావము :- పంచకోశములనగా నేమి ?

అన్నమయః ప్రాణమయః మనోమయః విజ్ఞానమయః ఆనందమయశ్చేతి!

భావము :- అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయ కోశము, విజ్ఞానమయ కోశము, ఆనందమయ కోశము అను ఈ ఐదు కోశములను పంచకోశములు అందురు.

అన్నమయః కః ?

భావము:- అన్నమయ కోశము అని దేని నందురు ?

అన్నరసేనైవ భూత్వా అన్నరసేనైవ వృద్ధిం
ప్రాప్య అన్నరూప పృథివ్యాం యద్విలీయతే
తదన్నమయః కోశః స్థూలశరీరమ్

భావము :- అన్నము వలన జనించి, అన్నము వలన వృద్ధినొందుతూ, జీర్ణమై అన్నముగా మారిపోవునది ఏదియో అట్టి స్థూలశరీరమే అన్నమయ కోశము.

వ్యాఖ్య

స్థూల శరీరమనెడి అన్నమయకోశము పాంచభౌతికమైనది. చర్మము, మాంసము, రక్తము, శల్యములతో కూడిన పొట్లమే అన్నమయకోశము. అది స్వతంత్ర మనుగడను సాగించలేదు. తనకు తానుగా చరించలేదు. శాశ్వత మైనదియు కాదు. మానవుని సూక్ష్మకోశములచేత ఇది నడిపించ బడుచున్నది. మరొక దానిచేత నడిపించబడుచున్నందున అన్నమయకోశము ఆత్మ కానేరదు.

అన్నమయ కోశము కార్యరూపమున తెలియుచున్నందున దానికి ఉత్పత్తి వినాశము అనునవి ఉన్నవి. మరి ఆత్మ ఉత్పత్తి వినాశాలు, వృద్ధిక్షయాలు ఎరుగనిది గనుక అది అన్నమయ కోశము కానేరదు. అన్నమయ కోశమైన స్థూల శరీరము నీవు కాదు అని గ్రహించుము. దేహమును విడనాడుటవలన నీకి సత్యము తెలియదు. దేహముతో నీకున్న సంబంధమును గుర్తించి గ్రహిస్తే చాలు. నీ ఛాయతో, స్వప్నములోని నీ దేహముతో నీకేమాత్రము సంబంధ మున్నదో, దేహముతో కూడా నీకు అలాంటి సంబంధమే ఉండాలి. స్థూల శరీరము సూక్ష్మ శరీరము కన్నను వేరై యున్నది.

ప్రాణమయః కః ?

భావము :- ప్రాణమయ కోశము అనగా నేమి ?

ప్రాణాద్యాః పంచ వాయవః వాగాదీన్ద్రియ
పంచకం ప్రాణమయః కోశ ః

భావము :- పంచ కర్మేంద్రియములతో కూడిన పంచ ప్రాణములు ప్రాణమయ కోశము అనబడును.

వ్యాఖ్య

కర్మేంద్రియ పంచకము పంచ ప్రాణములతో కలిసి ప్రాణమయకోశము అనబడును. అన్నమయకోశము నాశ్రయించుకొని ప్రాణమయకోశము చరించును. వాయు పరిణామమే ప్రాణమయకోశమై ఉన్నది. శ్వాస ఆగిపోగానే శరీరము నశించును. వాయు పరిణామ రూపమై శరీరమునందు సంచారక్రియలు సాగించుచున్నందున ప్రాణమయకోశము ఆత్మ కానేరదు. ప్రాణము జడము. చైతన్య వంతమైన ఆత్మ ప్రాణమెలా అగును ?

ప్రాణము జడము. మనము సుషుప్తిలో లయించినపుడు కూడా దేహములో ప్రాణ క్రియలు జరుగుచునే యుండును. అంత మాత్రాన అవి తమ చుట్టూ జరిగే విషయాలను తెలుసు కొనుచున్నావా? సుఖదుఃఖాలను అనుభవించు చున్నవా ? కనుక ప్రాణము జడము. జడరూపమైన ప్రాణముకన్నా చైతన్య వంతమైన ఆత్మ విలక్షణముగా యున్నందున అది ఆత్మ కానేరదు.

మనోమయః కోశః కః ?

భావము :- మనోమయ కోశము అనగానేమి ?

మనశ్చ జ్ఞానేంద్రియ పంచకం మిలిత్వాయో
భవతి స మనోమయః కోశః

భావము :- పంచ జ్ఞానేంద్రియములతో కూడిన మనస్సు మనోమయ కోశము అనబడును.

వ్యాఖ్య

జ్ఞానేంద్రియములతో కలిసి మనస్సు విషయ జ్ఞానమును పొందును. ఈ మనోమయకోశము ద్వైత ప్రపంచమును సృష్టించును. గాలి మేఘములను ఆకాశమున సృష్టించి, సూర్యప్రకాశమును మనకు అందకుండా చేయును. అదే గాలి మేఘమును చెదరగొట్టి సూర్యుని తెలుపును. మనస్సు కూడా హృదయాకాశమున అజ్ఞాన మేఘమును సృష్టించి ఆత్మప్రకాశమును మరుగు పరచును. అదే మనస్సు అజ్ఞానమును అంతరింపజేసి ఆత్మను తెలియపరచును.

మనస్సు సర్వవికారములకు నిలయము. అరిషడ్వర్గములకు స్థావరము. కామక్రోధాది వికారములు మనస్సులో మారుచున్నను ఆత్మ నిర్వికారరూపమే అయినందున మనస్సు ఆత్మ కానేరదు. జీవిలో నిరంతరము జరిగే అయోమయ హోమమే మనోమయ కోశముగా తెలియచున్నది. ఈ అజ్ఞాన హోమ గుండములో నిత్యము విషయము లనెడి సమిధలు పడుతూనే ఉంటాయి. వాసనలే ఘృతమై ఉంటుంది. ఇంద్రియములే ఋత్విక్కులై ఉంటారు. మనస్సు జడమైనది. పరిమిత మైనది. పరిమితమైన మనస్సు ఆత్మ కానేరదు. మనోమయకోశము సూక్ష్మ శరీరానికి సంబంధించినది. ఆత్మ శరీరత్రయమునకు భిన్నమైనందున మనోమయకోశము ఆత్మ కానేరదు.

విజ్ఞానమయః కః ?

భావము:- విజ్ఞానమయకోశము అనగానేమి ?

బుద్ధి జ్ఞానేంద్రియ పంచకం మిలిత్వా యో
భవతి స విజ్ఞానమయః కోశః

భావము:- పంచ జ్ఞానేంద్రియములతో కలిసిన బుద్ధి విజ్ఞానమయ కోశము అనబడును.

వ్యాఖ్య

జ్ఞానేంద్రియములతో కలసిన బుద్ధి విజ్ఞానమయ కోశము అనబడును. ఇచ్చటనే కర్తృత్వ భోక్తృత్వ భావనలు కదులును. ఈ కోశము "అహం" వృత్తిని విస్తృతం చేయును. మనోమయ కోశము నకు అందని విషయములను గ్రహించును. ఈ కోశము చిదాభాస చైతన్యముచే ప్రకాశించు చుండును. బుద్ధిలో వ్యక్తమగు చైతన్యమే ప్రజ్ఞగా తెలియబడుచున్నది. కనుక జ్ఞానమే ఈ కోశమునందు ముఖ్య విషయము. ఇది ఆత్మకు అత్యంత సన్నిహితమైన కోశము.

ఈ బుద్ధికూడా సుషుప్తిలో తెలియుటలేదు. కనుక ఇదియును పరిమిత మైనదియే. పరిమితమైన బుద్ధిలోని వికారములను తెలుసుకొనుచున్నందున ఆత్మ విజ్ఞానమయ కోశము కానేరదు. మనస్సు వలెనే బుద్ధి కూడా సూక్ష్మ శరీరమునకే సంబంధించినది గనుక సూక్ష్మ శరీరము కన్నా భిన్నమైన ఆత్మ బుద్ధి కానేరదు.

విజ్ఞానమయ కోశము చిదాభాస చైతన్యముచే ప్రకాశించును. ఈ చిదాభాస చైతన్యము వలననే మనస్సులో కదిలే సంకల్పాలను బుద్ధి దర్శించి నిర్ణయించు చుండును. ఈ విజ్ఞానమయ కోశమే హృదయమున ప్రవేశించి, మానవుని విచక్షణను అపహరించి, అయోమయ జీవనమును ప్రసాదించును.

ఆనందమయ : కః ?

భావము :- ఆనందమయ కోశము అనగానేమి ?

ఏవమేవ కారణశరీరభూత అవిద్యాస్థ మలినసత్త్వం
ప్రియాదివృత్తి సహితం సత్ ఆనందమయః కోశ :

భావము :- అవిద్య యందు స్థిరపడి, ప్రియాది వృత్తులతో కూడి మలిన పడినదియై ఆనందము ననుభవించుటకు సిద్ధముగా యున్న కారణ శరీరమును ఆనందమయ కోశము అందురు.

వ్యాఖ్య

సుషుప్తి యందు జీవునిచే అనుభవించబడు అజ్ఞాన జనిత సుఖము ఆనందమయ కోశమునకు సంబంధించినది.స్థూల సూక్ష్మ శరీరములు ఈ

కోశమున అనుభవమునకు అందవు. కారణ శరీరమే అన్నమయ కోశము. ఈ కోశమునందు దుఃఖరాహిత్యమేగాని సుఖానుభూతి అందదు. ఆత్మయందలి ఆనంద ఘనమే నిత్యానందము.

ఆనందమయ కోశము కూడా ఉపాధి రూపమై ఒక్క స్థితిలోనే తెలియుచున్నందున ఇది కూడా పరిమితమై ఆత్మకన్నా వేరైయున్నది. ప్రకృతి వికారత్వమునకు లోనై యున్నది. కార్యరూపమై యున్నందున ఇది కారణ రూపమైన ఆత్మ కానేరదు. ఈ ఆనందమయ కోశము ప్రియాది వృత్తి సహితమై మలిన పడియున్నది. ఒక వస్తువును చూచుట వలన మనకు కలిగెడి ఆనందమును 'ప్రియ' మందురు. అది మనకు సన్నిహితముగా వచ్చినపుడు కలిగెడి ఆనందమును "మోద" వృత్తి అందురు. ఆ వస్తువును అనుభవించుట వలన కలిగెడి ఆనందమును "ప్రమోదము" అందురు. ఈ ప్రియాదివృత్తులు ఆనందమయ కోశము నందు నిలిచి ఉండును. ఆనందమయ కోశము కూడా ఒక కాలములో, ఒక దశలోనే తెలియుచున్నందున అది ఆత్మ కానేరదు.

ఏతత్ కోశపంచకం

భావముః– ఇవియే పంచకోశములు.

వ్యాఖ్య

మనకు కోశములకన్నా అన్యముగా ఏమియును తెలియుటలేదు. అయితే మనకు తెలిసెడి పంచకోశములు సత్యము కానేరవు. ఈ పంచకోశములు నిరంతరము వికారరూపములై మార్పు చెందుచున్నవి. మార్పు చెందెడి ఈ కోశములను గ్రహించెడి ఆత్మ మార్పును ఎరుగనిదియై, సాక్షియైనదియై ఉండుటచేత ఆత్మ పంచకోశములకు విలక్షణముగా యున్నది. కోశములను ఆత్మ తెలుసుకొనుచున్నందున కోశములచేత తెలియబడదు. ఆత్మయందు దృగ్దృశ్యములు అంతరించి పోవుచున్నందున ఆత్మ పంచకోశాతీతమై యున్నది. పంచకోశాతీతమైన ఆత్మ కోశస్వరూపములైన మనోబుద్ధులకు తెలియనంత మాత్రాన ఆత్మ అసత్తని భావించకూడదు. అసత్తు అనగా లేనిది అని అర్థము. అలా లేదు అనెడి విషయమును గ్రహించేందుకు ఆత్మయే ఆధారమై ఉన్నందున ఆత్మ పంచకోశాలకు విలక్షణమై, పంచ కోశాతీతమై ఉన్నది.

మదీయం శరీరం మదీయాః ప్రాణాః మదీయం
మనశ్చ మదీయా బుద్ధి ర్మదీయం జ్ఞానమితి
స్వేనైవ జ్ఞాయతే తద్యథా మదీయత్వేన జ్ఞాతం
కటక కుణ్డల గృహాదికం స్వస్మాద్భిన్నం తథా
పంచకోశాదికం స్వస్మాద్భిన్నం మదీయత్వేన
జ్ఞాతమాత్మా న భవతి

భావము :– ఏవిధముగా నా గాజులు , నా కుండలములు, నా గృహము అనుచు నావి నావి అని తెలియబడుచున్న వస్తువులన్నియు ఏవిధముగా నాకంటే వేరుగా నున్నవో అలాగే నా దేహము, నాప్రాణములు, నా మనస్సు, నాబుద్ధి, నా జ్ఞానము, నాఅజ్ఞానము అనుచు నావి నావి అని తెలియబడుచున్న పంచకోశములు ఆత్మ కానేరవు. ఇవి అనాత్మ క్రిందికి వచ్చును.

వ్యాఖ్య

మరొక వస్తువుచేత పరిమితము కానిది, మరొక విషయముచేత చెదరగొట్టబడనిది సత్యవస్తువు. అట్టి సత్యవస్తువు నిత్యవస్తువుయై యుండుట వలన కదిలే సర్వమునకు తాను సాక్షియై ఉన్నది. ఏదయితే సాక్షిగా తెలియుచున్నదో, అదిగోచరించు సమస్తమునకు విలక్షణమైనందున భేదరూపమైన దృశ్యములు నిరాకరించబడు సమయానకూడా దృక్కైన తాను చెదరక కదలక సాక్షివలె నిలిచియున్నది. మనకు తెలియబడెడి పంచకోశములు మనకన్నా భిన్నమైనవని తెలియగానే వాటినుండి వేరుపడేందుకు ప్రయత్నించాలి. కోశములనుండి విడిపడిన దశలో మిగిలియున్నది ఏదియో అదియే ఆత్మయై ఉన్నది. ఇదియే ప్రజ్ఞాన ఘనరూపమైన ఆత్మయై ఉన్నది. తురీయమై తెలియుచున్నది.

"తాం అబీజావస్థాం తస్యైవ ప్రజ్ఞ శబ్దవాచ్యస్య తురీయత్వేన
దేహాది సంబంధ రహితాం పారమార్థికాం పృథక్ వక్ష్యతి"

"ఏదయితే (జగత్కారణమని ఊహించు సమయాన) ప్రజ్ఞ అని అనబడినదో, అదియే దేహాది సంబంధ రహితమై, కారణ రహితమై తెలియునపుడు తురీయమనబడుచున్నది" అని శ్రీ శంకరులవారు తమ మాండూక్యోపనిషత్కారికా భాష్యమునందు తెలిపియున్నారు.

పంచకోశములే ఆత్మానందమును అడ్డుపరచుచున్నవి. కోశములనుండి వేరు పడగానే వ్యక్తి ఆత్మవిదుడగును. ఒక విదేశీయుడు మన ప్రాంతమునకు వ్యాపార నిమిత్తము వచ్చెను. అతిథిని సత్కరించు కార్యములో చక్కెరకేళి అరటిపండ్లను అతిథి వసించు గదికి ఇంటియాజమాని పంపించెను. తాను పంపిన ఫలము లెలా ఉన్నాయని అతిథిని ప్రశ్నించగా 'చేదుగా ఉన్నాయి' అనెడి సమాధానము వచ్చెను. యజమాని విస్మయ మొందెను. చక్కెరకేళి ఫలములు చేదుగా ఉండుట ఏమిటి? అని ఆశ్చర్య పడుతూ మరికొన్ని తాజాఫలములను తెప్పించి, 'వీటిని ఆరగించండి. మధురముగా ఉంటాయి' అని చెప్పెను. అతిథి ఆ ఫలములను అందుకొని తొక్కను తొలగించకనే ఫలములను తినుచుండెను. పాశ్చాత్యుడైన తాను ఈ చక్కెరకేళీ ఫలములను ఎప్పుడు చూడకపోవుటచేత ఎలా తినవలయునో తెలియక అలా చేసెను. యాజమాని నవ్వుతూ, తానొకపండును చేతపట్టుకొని, అతిథి చూచుచుండగా పైతొక్కను తొలగించి, ఫలమును భుజించెను. అది పరిశీలించిన అతిథి తానుకూడా అలాగే తిని, రుచి అమోఘముగా యున్నదని ఆనందపడెను. పైనున్న దెప్పుడూ చేదుగానే ఉంటుంది. మధురమైన వస్తువు అంతర్యానికి సంబంధించినదియే అయివుంటుంది. తొక్కను తొలగించి పండును ఆరగించునట్లు, కోశములను తొలగించి ఆత్మను అనుభవించవలెను.

ఒక విషయమును ఇచ్చట చక్కగా అర్థము చేసుకోవాలి. సర్వగతమైన ఆత్మను కోశములు ఎలా పరిమిత మొనర్చగలవు? ఇచ్చట కోశములు ఆత్మను కప్పుట అనునది కూడా అధ్యాసయే. అజ్ఞానము యొక్క వివిధరూపములనే ఇచ్చట కోశములు అని పిలుచుట జరిగినది. కనుక అజ్ఞానము అంతమైన సమయాన కోశములు వాటంతట అవి తొలగిపోవును.

ఇంతవరకు ఆత్మ నిర్దేశమునందు తటస్థలక్షణముద్వారా ఆత్మ స్థూల సూక్ష్మ కారణ శరీరములకు వ్యతిరిక్తమైనదనియు, పంచకోశములకు అతీతమైనది అనియు, అవస్థాత్రయమునకు సాక్షియైనది అనియు తెలియజేసి, ఆత్మయొక్క స్వరూపలక్షణమును ఇక చెప్పబోవుచున్నారు.

ఆత్మ

ఆత్మా తర్హి కః ?

భావము:- ఆత్మ అని దేనినందురు?

సచ్చిదానంద స్వరూపః

భావము :- ఆత్మ సచ్చిదానంద స్వరూపమై ఉన్నది.

సత్ కిం?

భావము :- సత్ అనగా నేమి?

కాలత్రయేపి తిష్టతి ఇత్ సత్

భావము:- మూడు కాలములయందు ఏది ఉండునో దానిని 'సత్' అందురు.

వ్యాఖ్య

ఆత్మ కానిదేదో మొదట తెలిసినచో, ఆ తరువాత ఆత్మను తెలుసుకొను ప్రయత్నము జరుగగలదు. ఇంతవరకు ఆత్మ శరీరత్రయమునకు, అవస్థాత్రయమునకు, పంచకోశములకు అన్యమైనది అని తెలిపి, ఇక ఆత్మయొక్క స్వరూపలక్షణములను వివరించుచున్నారు. సచ్చిదానంద స్వరూపమే ఆత్మయని స్వరూప నిర్ణయము చేసినారు.

సత్తు, చిత్తు, ఆనందములన నేమియో వివరించుచు మొదట 'సత్తు' ను గూర్చి తెలుపుచున్నారు. త్రికాలముల యందు ఏది ఉండునో దానిని 'సత్' అందురు అని తెలిపినారు.

ఈ ప్రపంచమునందలి వస్తువులన్నియు కాలములో ఆవిర్భవించి కాలములో అంతరించుచున్నవి. కాలగతమైన అనుభవములను గ్రహించునది ఎవరు? ఎవరైనను అట్టివారు కాలాతీతులయ్యే వుండాలి. గ్రహించు వ్యక్తి కూడా కాలానికి పరిమితమైనచో అనుభవముకూడా కాలగతమే గనుక అనుభవము కలుగగానే అట్టి అనుభవము, దానికి సంబంధించిన జ్ఞానము రెండును నశించాలి. కాని వాస్తవము దానికి భిన్నముగా నున్నది. మన బ్రతుకులోని అనుభవముల నన్నింటిని మనము గ్రహించుచునేయున్నాము. అలా గ్రహించునదియే ఆత్మ. ఇది కాలముచే చెదరగొట్టబడునది కానందున ఆత్మ త్రికాలముల యందును ఉన్నది.

అయితే కాలాతీతమైన ఆత్మ ఒకటి ఉన్నదా? అనే సందేహము సామాన్యముగా కలుగుచుండును. దానికి కారణమేమనగా కాలాతీతమైన వస్తువు నామరూపములనుండి విడిపడియుండును. మనస్సు ఎప్పుడూ నామరూప

ములతోనే నిండియుండును. నామరూపాలకు అతీతముగా చరించు "సత్తు" ను నామరూపాల మధ్య వ్యవహారిక మనుగడను సాగించు మనస్సు ఎలా దర్శించును? తన అనుభవములో లేని విషయాన్ని మనస్సెలా అంగీకరిస్తుంది? అందుచేత ఆత్మ అస్తిత్వాన్ని మనస్సు నిరాకరిస్తుంది.

ఈ జగత్తంతయు నామరూపాలతో నిండియున్నది. రూపము వచ్చింది గనుక నామము కదిలింది. రూపము కాలములో కదిలింది గనుక కాలములో నశిస్తుంది. ఆదియున్న రూపము ఒకప్పుడు లేనిదే యని అర్థము. అంతమున్న రూపము ఒకనాడు ఉండబోదు. కనుక ఆద్యంతములయందు ఈ రూపములు లేనివియే అగుచున్నవి. ఆద్యంతములందు ఏదయితే లేదో దేనికి ఆద్యంతములున్నవో అదియే మాయ. మాయ మాయకు అర్థమగునా? కాదు. మరి ఎవరికి అర్థమయినది? మాయను దాటినవానికే అర్థమవుతుంది. అది ఎవరు? అదియే 'సత్తు'. త్రికాలములయందు చెదరక, కదలకయుండు అధిష్ఠాన సత్తా స్వరూపము.

కాలత్రయమును అధిగమించి ఏదయితే 'సత్' అని పిలువబడుచున్నదో అది అవస్థాత్రయమును కూడా అధిగమించియున్నది. జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు మారుచున్నను, ఈ మూడు అవస్థలయందు ఏదయితే సాక్షివలె నిలిచి యున్నదో అదియే 'సత్' గా తెలియుచున్నది. ఆధార వస్తువు తానైయున్న సత్పదార్థము మరియొక వస్తువుపై ఆధారపడదు.

రజ్జువు నందు సర్పము గోచరించినపుడు సర్పము సత్యముగానే తెలుస్తుంది. అంతమాత్రాన సర్పము సత్యము అనుట వీలుపడదు. భ్రాంతికి ముందు అచ్చట రజ్జువే యున్నది. భ్రాంతి తొలగిన పిమ్మట కూడా రజ్జువే ఉంటుంది. మధ్యలో అనగా భ్రాంతి కాలములో మాత్రమే సర్పము తెలియుచున్నది. త్రికాలములందు సర్పము లేనందున అది అసత్యము. త్రికాలములందు ఉన్నందున త్రాడు సత్యము. అలాగే త్రికాలములయందు గోచరించుచున్నందున ఆత్మ సత్యమై, 'సత్' అనెడి నామముతో తెలియబడుచున్నది.

సత్పదార్థము తనకు తానుగానే మరొకవస్తువుపై ఆధారపడక నిలిచియున్నది. కాలములు మారుచున్నవి. మారుచున్నకాలములను గ్రహించు తాను మారనిదియై ఉన్నది. నిర్వికార సత్తాస్వరూపమైన ఇట్టి ఆత్మయే

దర్శించ దగియున్నది. దర్శించుట యనగా తనకన్నా అన్యముగా దర్శించుట అని భావముకాదు. తన స్వరూపముగా దర్శించుట అని అర్థము. ఉపాధి రహితమైన సత్తాస్వరూపమే ఆత్మ అయివున్నది. ఎప్పుడూ ఉండునదియే ఆత్మ. ఎప్పుడూ లేకపోవుట అనునది తెలియనదియే ఆత్మ. అదియే సత్తు. ఆత్మను సత్తని తెలుపగానే అసత్తు ఒకటి ఉన్నదేమో అనే సందేహము కలుగవచ్చు. అసత్తు అనేది లేనే లేదు. అసత్తు ఉన్నదా? అని అడిగే ప్రశ్నకు ఆధారమైనది కూడా ఆత్మయే.

"సర్వగ స్సర్వ దైవాత్మా సర్వమేవ చ సర్వదా
అసమాధిర్హి కోసాస్యాత్సమాధిరపి కస్మృతః"

"సర్వదా సర్వకాలములయందు సర్వత్ర సర్వరూపములతో నేనే యున్నాను. ఇక నాకు సమాధి ఏమిటి? సమాధి లేకపోవుట యేమిటి?" అని యోగవాసిష్ఠము ప్రశ్నించినది.

చిత్ కిం ?

భావము :– 'చిత్' అనగానేమి?

జ్ఞాన స్వరూపః

భావము :– జ్ఞాన స్వరూపమైన దానిని 'చిత్' అందురు.

వ్యాఖ్య

"చిత్" అనగా జ్ఞానము లేదా చైతన్యము. చిత్తవృత్తులన్నియు దేనివలన కదులుచున్నవో అవి ఆగినదశలో అలా ఆగిపోయినవని ఏదయితే తెలుసుకొనుచున్నదో అదియే 'చిత్' లేదా 'చైతన్యము'.

ఆత్మయొక్క కాలాతీతస్థితిని 'సత్' అని తెలుసుకున్నాము. 'సత్' అనునది సత్యరూపమైనదని గ్రహించాము. సత్యమనేది జడమయ్యేందుకు వీలులేనందున అది చైతన్యమయ్యే ఉండాలి. అదియే చిత్తు. చిత్తును సత్తు నుండి వేరు చేసేందుకు వీలులేనందున సత్తుయే చిత్తుగా తెలియుచున్నది. స్థూల సూక్ష్మ కారణ శరీరాలను, అవస్థాత్రయమును నిరాకరించ గలిగామే గాని, అలా నిరాకరించే ఆత్మను నిర్మూలించ గలమా? ఏదయితే జ్ఞాన స్వరూపముగా

ఉండి జ్ఞానాజ్ఞానముల రెండింటిని ప్రకాశింప జేయుచున్నదో అదియే 'చిత్తు' అనబడును.

చిత్తు అనేది జ్ఞానమైనందున అది వస్తువుకాదు. మరియొకదాని చేత తెలియబడునదియు కాదు. తనచేత కూడా తాను తెలియబడదు. నీకళ్ళతో నీకళ్ళను నీవు చూడగలవా? జ్ఞానమును గూర్చిన జ్ఞానము జ్ఞానానికి ఎలా కలుగుతుంది? అందుచేత జ్ఞానము జ్ఞానముగా ఉంటుంది. సత్తుయే చిత్, చిత్తుయే సత్తు.

'సత్త యా హి చిత్'

అని శ్రీ రమణ భగవానులు ఉపదేశసారంలో అంటారు.

ద్వైత ప్రపంచము గోచరించినను, అలా గోచరించు దానిని తెలుసుకొనేది ఒకటి ఉండాలి. అదియే చిత్తు. చిత్తులో ప్రపంచము తెలిసే అవకాశములేదు. అందుచేత అది అఖండమై, అవిభాజ్యమై అలరారుచున్నది. అట్టిది అనుభవముగా తెలియ దగినదియే గాని ఇంద్రియ మనోబుద్ధులకు మాత్రము అందునది కాదు. అనుభవములో నున్నది గనుక ఈ క్షణము కూడా అనుభవించదగినదియే. మనోబుద్ధులు అణిగిపోతే, ఇప్పుడే ఇక్కడే తెలియబడి, ఇప్పుడు ఇక్కడ అనే ద్వంద్వములను కూడా అధిగమించి సత్తుయైన చిత్తుగా అనుభవమునకు అందుతుంది.

ఈ దృశ్యమాన జగత్తులో మనకు అనేక వస్తువులు గోచరిస్తున్నాయి. ఇవి అన్నియు ప్రత్యేకరూపములతో, నామములతో, ఉపయోగములతో వాటి ఉనికిని కొనసాగిస్తున్నాయి. అందుచేత ఒక వస్తువు మరియొక వస్తువును పరిమిత మొనర్చుచున్నది. ఇచ్చట మనకు భేదములు తెలియుచున్నవి. అందువలన భేదదృష్టి చేత ద్వైత ప్రపంచము తెలియుచున్నది. గేదెఉన్నది. అలాగే పర్వతము ఉన్నది. పర్వతములోని లక్షణాలు గేదెయందు లేవు. గేదెలోని లక్షణాలు పర్వతమునందు తెలియవు. ఇలా ఒక వస్తువు మరియొక వస్తువుచేత పరిమిత మగుచున్నది.

పంచదార తియ్యగా ఉంటుంది. చింతకాయ పులుపుగా ఉంటుంది. వేపకాయ చేదుగా ఉంటుంది. అయితే ఇవి అలా ఉన్నవని తెలుసుకొనే చైతన్యమునందు పులుపులేదు; తీపిలేదు; చేదులేదు. అయితే ఈ భేద

రూపములతో, రుచులతో సంబంధము ఏర్పరచుకొని చూచునది ఎవరు? చైతన్యమా? మరి సంబంధాలకు అవకాశమున్నచో చైతన్యము మాత్రము పరిమితముకాదా? మనలోవున్న చిదాభాస చైతన్యముచేత భేదములు తెలియుచున్నవి. ఈ విషయమును ఇలా గ్రహించుటకు కూడా చైతన్యమే ఆధారమైయున్నది. అట్టి చైతన్యము అఖండమైనందున అందులో స్వగతభేదము దర్శనీయము కాదు. చైతన్యములో భాగములే ఉన్నచో ఒక భాగమునకు మరియొక భాగమునకు గల వాస్తవ సంబంధమేమిటి? ఒక భాగము మరియొక భాగముకన్నా వేరైనచో, ఆరెండింటిని కలుపుచూ ఆ రెండిటి మధ్య ఉన్నది ఏమి? అలా ఒకటిగా ఉన్నచో అది రెండింటిలోనూ ఉండేదియై ఉండాలి. అదే యదార్థమైనచో దేశకాలాదులయందలి దేశమును చైతన్యము అంగీకరించదు. దేశము అనునది కూడా మానసిక భావనయే అయినందున మనస్సులో అట్టి భావన కదులుటకు చైతన్యమే ఆధారమై, అలా కదిలినది అనెడి విషయమును కూడా గ్రహించునదియై ఉన్నది. కనుక చిత్తు అనునది కేవలము భేదరహిత జ్ఞానమై ఉన్నది. ఈ జ్ఞానమే సుషుప్తి యందు మనకు తెలియుచున్నది. దేహము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి సర్వము పట్టు తప్పి లయించినపుడు కూడా చైతన్యము నిలిచియేయున్నది. ఇచ్చట చైతన్యమునకు దేనితోను సంబంధములేదు అని తెలియుచున్నది. ఈ చైతన్యమే జాగ్రదవస్థ యందు మారే దేహమును, మార్పు చెందే మనస్సును, వికారయుతమైన ఇంద్రియములను తెలుసుకొనుచున్నది. స్వప్న ప్రపంచములో కల్పిత భావాలతో నిర్మించబడిన స్వాప్నిక ప్రపంచమును కూడా ప్రకాశింపజేయు చున్నది. జాగ్రత్స్వప్నములు రెండును రెండు ప్రత్యేక భూమికలై యున్నందున ఒకదానిని మరియొకటి పరిమిత మొనర్చుచున్నది. అయితే ఈ రెండు స్థితులను ప్రకాశింపజేసెడి చైతన్యము మాత్రము ఒక్కటియే. అదియే చిత్తు. రెండింటిని ప్రకాశింప జేసినదే గాని తనలో రెండింటికి చోటు ఇవ్వనిదియై ఉన్నది. సుషుప్తిని గ్రహించునది కూడా చైతన్యమే నని గ్రహించినాము. కనుక జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలు ఒకదానిని మరియొటి పరిమిత మొనర్చుచున్నందున అవస్థాత్రయము అనిత్యమై, కాలగతమై తెలియుచున్నది. ఈ మూడు అవస్థలను ప్రకాశింపజేసెడి చిత్తు మూడు అవస్థల యందు ఉండుటచేత అది ఏ అవస్థకు సంబంధించనిదియై, అవస్థాత్రయమునకు సాక్షిగా తెలియుచున్నది. సాక్షియైన చైతన్యము ఏకము, అఖండము, అద్వైతమునై ఉన్నది. రెండు చైతన్యములు ఉండేందుకు అవకాశము లేనందున చైతన్యము నిత్యమై

ఉన్నది. పరిమిత మనుగడను ప్రకాశింప జేయునది కూడా చైతన్యమే అయినందున తనలో పరిమితత్వము చోటు చేసుకొనే అవకాశములేదు. అఖండమైన ఈ చైతన్యమే చిత్తుగా తెలియుచున్నది. ఇదియే సత్యము.

చైతన్యము సత్యమైనది. సత్యమైన చైతన్యము వస్తువుగా తెలియబడునది కానందున అది వస్తు రహిత చైతన్యమై ఉన్నది. మరి చైతన్యము దృశ్యవస్తువు కానపుడు మనకు గోచరించు ఈ వస్తు ప్రపంచమేమిటి? అనే శంక వస్తుంది. ప్రపంచము అనిత్యము. అభాసమాత్రమే. బ్రహ్మము వస్తువు కానందున వస్తువుగా తెలియబడడు. వస్తువుగా ఒక ప్రదేశమున లభించడు. దేశ కాలాదులు తెలియుటకు ఆధారమైన చైతన్యము దేశకాలాదుయందు తెలిసే అవకాశము లేదు. అదియునుగాక బ్రహ్మమును ప్రత్యేకముగా తెలుసుకొనునది కూడా ఉండదు.

"బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి"

"బ్రహ్మమును తెలుసుకొనువాడు బ్రహ్మమే అగుచున్నాడని" ఉపనిషత్తు తెలియజేయుటచేత బ్రహ్మమును ప్రత్యేకముగా తెలుసుకొనేది కూడా లేదు. చైతన్యమైన ఆత్మను తెలుసుకొనే మరియొక చైతన్యము ఉన్నచో మళ్ళీ చైతన్యము మనునది కూడా పరిమితమై అనంతత్వాన్ని పోగొట్టుకొనే ప్రమాదము కలదు. చిత్స్వరూపమైన జ్ఞానము ధ్యానము ద్వారా కూడా పొందబడదు. ధ్యానము కూడాప్రక్రియే గనుక పరిపూర్ణమైన వస్తువు పరిమితంగా కాలంలో కదిలే ప్రక్రియల వలన తెలియబడదు. ధ్యానము సాగించునది మనస్సు. ఇలా ధ్యానము సాగించెడి మనస్సును చూచునది, ప్రకాశింప జేయునది ఆత్మయై యున్నందున, దృశ్యమైన మనస్సు దృక్చైతన్యమును దర్శించే అవకాశము లేదు గనుక చైతన్యమును గ్రహించి అనుభవించుట యందు ధ్యానము కూడా సూటియైన మార్గము కాదని తెలియుచున్నది.

చీకటి చీకటిని పోగొట్ట లేనట్లు అజ్ఞాన జనితమైన కర్మలు అజ్ఞానమును పోగొట్టనూలేవు. జ్ఞానమును అందించనూలేవు. జ్ఞానమే ఆత్మావలోకమునకు సూటియైన దారియై ఉన్నది. ఇచ్చట మార్గము, గమ్యము ఒకటై వుంటాయి. ఇదియే చిత్తు. దీనిని సాక్షి అనడముకూడా వ్యవహారిక అవగాహన కొరకే. అనుభవము ఒకటి జరుగుచుండి నపుడే దానిని గ్రహించువాడు సాక్షి అగును. వస్తు దర్శనము చేయునపుడే చైతన్యము సాక్షి అని పిలువబడును. వస్తువులై

నున్న భ్రాంతి తొలగి, జ్ఞానము కలిగి, ద్వైతప్రపంచము నుండి విడిపడగానే తానే చైతన్యరూపు డగుచున్నందున, సాక్షిగా తాను వీక్షించుటకు రెండవ వస్తువులేదు కనుక తాను సాక్షికూడా కాదు.

"వృత్తి విస్మరణం సమ్యక్ సమాధి ర్జ్ఞాన సంజ్ఞకః"

'సంపూర్ణవృత్తి రాహిత్యమే సమాధి" యని శ్రీ శంకరులవారు అపరోక్షానుభూతి యందు తెలిపియున్నారు.

"సలిల ఏకో ద్రష్టా అద్వైతో భవతి"

"ద్రష్టయగు చైతన్యము జలమువలె రెండుగాని ఏకమై ఉన్నాడు" అని బృహదారణ్యకోపనిషత్తు తెలుపుచున్నది.

సమాహితో భూత్వా ఆత్మన్యే వాత్మనం పశ్యతి సర్వ మాత్మానం పశ్యతి.

"ఎవడు చిత్స్వరూపమును అనుభవించెనో వాడు ఆత్మను ఆత్మలోనే దర్శించును. ఆతరువాత అతడు సర్వము తనయందే ఉన్నట్లు భావించును" అని వేదము చెప్పుచున్నది.

"పరం ప్రాప్య విలీయన్తే సర్వా మనవ వృత్తయః"

"పరతత్త్వము తెలియగానే మనో సంకల్పము లన్నియు వినాశము నొందును" అని యోగవాసిష్ఠము చెబుతుంది.

ఆనన్దః కః?

భావము :– ఆనంద స్వరూప మనగా నేమి?

సుఖస్వరూపః

భావము:– సుఖ స్వరూపమే ఆనందము.

వ్యాఖ్య

ద్వైత జీవనము ద్వారా వస్తు ప్రపంచములో తెలియవచ్చెడి సుఖము మన అందరికీ విదితమే. మనకన్నా అన్యమైన వస్తువులను అనుభవించుట వలన కలిగెడి ఈ తాత్కాలిక సుఖము మన ఎల్లరకును అనుభవములోనే యున్నది. ఇచ్చట స్వరూపానుభూతిలో తెలియవచ్చెడి ఆనందము వస్తుజన్య తాత్కాలిక సుఖము కాదు. ఇది శుద్ధానంద ఘన స్వరూపము.

సత్య వస్తువు నిత్యమైనది. నిత్యమైన సత్యపదార్థమే సత్తు అనియు అదియే చిత్తు అనియు గ్రహించితిమి. సత్తుగాను, చిత్తుగాను ఏదయితే ఉన్నదో అది కొరత తెలియనిదియై ఉన్నందున అది ఆనంద రూపమై ఉన్నది. ఆనందము ఆత్మయొక్క స్వరూపమై ఉన్నది. ఇది స్వరూపానందమే గనుక వస్తువులపై ఆధారపడి లేదు. దీనినే భూమానందము అందురు.

'యత్ర నాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్య ద్విజానాతిసభూమా'

" ఎచ్చట రెండవదానిని చూచుట జరుగదో, రెండవ విషయాన్ని వినుట జరుగదో, రెండవ దానిని తెలుసు కొనుట జరుగదో అదియే భూమానందము," అని ఛాందోగ్యోపనిషత్తు తెలియ జేసినది.

ఆనంద స్వరూపం బ్రహ్మ! ఆనందమయం! ఆనంద ఘనం! ఆనందమూర్తిం!
ఆనంద విగ్రహం! ఆనందసాగరం! నిరతిశయా నందం!
పరమానందం! ఆనంద సుఖం! నిత్యసుఖం! అఖండ సుఖం!

అని బ్రహ్మమును ఆనంద స్వరూపముగా ఆనందబిందు ఉపనిషత్తు తెలియ జేసినది.

ఆత్మ ఆవేదనలకు అతీతమైనందున దానిలో ఏవిధమైన దుఃఖమును దర్శించేందుకు వీలులేదు. కోరిన దానిని పొందలేనపుడు దుఃఖము కలుగును. అవసరము లేని దానిని పొందునపుడు దుఃఖము కలుగును. ఆత్మ విషయమునందు ఈ రెండును పొసగవు. ఆత్మ అద్వయమైనందున అచ్చట వచ్చేది లేదు. పోయేది లేదు. ద్వంద్వాలు గాని, చావు పుట్టుకలుగాని, అరిషడ్వర్గాలుగాని, దేహేంద్రియ మనోబుద్ధులు గాని ఏవియును ఆత్మ యందు లేనందున దానిలో దుఃఖము దర్శించను వీలుపడదు.

"ఆనందం బ్రహ్మణో విద్వాన్ న బిభేతి కుతశ్చనేతి"

" ఎవడైతే బ్రహ్మానందమును తెలుసుకొనుచున్నాడో వాడు దేనికిని భయపడడు" అని తైత్తిరీయము చెబుతుంది.

అన్యవస్తువులలో ఆనందము ఉందని భావించి ఆ వస్తువుల కొరకై అన్వేషించుచున్నాము. వస్తువులలో ఆనందము ఉన్నట్లయితే ఒకరికి ఆనందము నందించిన వస్తువు రెండవవారికి కూడా ఆనందము నందించగలిగి ఉండాలి. అదియునుగాక ఒకవ్యక్తి జీవితములోనే ఒక దశలో ఆనందము నందించిన

వస్తువులు మరియొకదశలో హాస్యాస్పదంగా గోచరిస్తున్నవి. ఇతరవస్తువులను మనము ప్రేమించుటకు కూడా ఆత్మయందు మనకున్న ప్రేమయే పునాదియై నిలిచియున్నది.

'ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి '

'ఆత్మ వలననే సర్వము ప్రియముగా ఉన్నది" అని బృహదారణ్యకోపనిషత్తు కూడా పల్కినది.

నిత్యవిలువ వస్తుప్రపంచములో ఏవస్తువునకు లేనందున వస్తురహిత చైతన్యమును అనుభవానికి తెచ్చుకొని తరించాలి.

"తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరాః
ఆనంద రూప మమృతం య ద్విభాతి "

" బ్రహ్మము యొక్క పరిపూర్ణ జ్ఞానమును పొందిన ధీర పురుషులు ఆనంద స్వరూపమైన అమృతత్వమును దర్శించెదరు" అని ముండకోపనిషత్తు తెలిపియున్నది.

ఆత్మ పంచకోశములకు అతీతమైనదనియు, అవస్థాత్రయమునకు భిన్నమైనదనియు, శరీరత్రయమునకు అన్యమనియు తటస్థలక్షణము ద్వారా తెలిపి, సత్, చిత్, ఆనందముల స్వరూపమే ఆత్మ యని స్వరూపలక్షణము ద్వారా ఆచార్యులు తెలిపినారు. తరువాత మనము జీవించెడి ఈ జగత్తు యొక్క విషయమును తెలియజేయుచున్నారు.

ఏవం సచ్చిదానంద స్వరూపమ్ స్వాత్మానం విజానీయాత్

భావము :– ఈ విధముగా మన ఆత్మ సచ్చిదానంద స్వరూపముగా యున్నదని తెలుసు కొనవలెను.

విశ్వము

ఆత్మను గురించి తెలుసుకొనిన పిదప మన మదిలో ఈ ప్రపంచమును గూర్చిన ప్రశ్న తలఎత్తును. ఈ ప్రపంచము యొక్క వాస్తవరూప మెయ్యది? ఈ జగత్తు ఎలా ఆవిర్భవించినది? దీనికి కారణమేమిటి? ఎక్కడనుండి విశ్వము ఆవిర్భవించినది? ఈ ప్రపంచమునకు నాకు సంబంధమేమిటి? ఈ

విషయముల నన్నింటిని ఆచార్యులవారు వివరించబోవుచు ముందుగా ప్రపంచోత్పత్తిని గూర్చి తెలియజేయుచున్నారు.

అథ చతుర్వింశతి తత్త్వోత్పత్తి ప్రకారం వక్ష్యామః

భావము :– ఇపుడు ఇరువది నాలుగు తత్త్వములతో కూడిన ప్రపంచోత్పత్తిని తెలువు చున్నాము.

బ్రహ్మాశ్రయా సత్త్వ రజస్తమో గుణాత్మికా మాయా అస్తి

భావము :– సత్త్వరజస్తమో గుణములతో కూడి, బ్రహ్మాశ్రయముతో మనుగడను సాగించు నదియేమాయ.

వ్యాఖ్య

బ్రహ్మము అనంతమైనది. అద్వయమైనది. విభజించుటకు వీలులేనిది. జ్ఞాత, జ్ఞాన, జ్ఞేయములు తెలియని స్థితియే బ్రహ్మము. ఈ త్రిపుటిని అధిగమించి ఉండునది ఏదియో అదియే బ్రహ్మము. అనంతమైన బ్రహ్మమునందు దేశకాలాదులు కూడా తెలిసే అవకాశము లేదు. ఆదిలో బ్రహ్మమొక్కటియే ఉండుటవలన ఏకమైన తనలో భేదములు గోచరించు అవకాశములేదు.

మరి ఈ జగత్తు ఎలా ఆవిర్భవించినది? బ్రహ్మమునుండి ఆవిర్భవించినది అని చెప్పదువా? మరి అదియే నిజమైనచో తన నుండి ప్రత్యేకముగా ఒక వస్తువు కదిలి వచ్చినచో అలా కదిలివచ్చిన పరిమిత వస్తువు బ్రహ్మమును కూడా పరిమిత మొనర్చునుగాన బ్రహ్మము నుండి ఏదియును ఆవిర్భవించుటకు వీలులేదు. మరియొక విధముగా బ్రహ్మమే జగత్తుగా పరిణామము చెందినదని భావింతుమా? ఇది కూడా సంభవముకాదు. పాలు పెరుగుగామారినట్లు బ్రహ్మము జగత్తుగా పరిణామము చెందియున్నచో బ్రహ్మము స్వరూపమును కోల్పోయి శూన్యమగును.

బ్రహ్మము నుండి జగత్తు ఆవిర్భవించుట అసంభవము. బ్రహ్మమే జగత్తుగా పరిణామము చెందుట అనూహ్యము. మరి జగత్తు ఎలా ఆవిర్భవించినది? అసలు జగత్తు ఆవిర్భవించనేలేదు. బ్రహ్మము పరిణామము చెందినదీలేదు. బ్రహ్మమునందు జగత్తు ఆరోపించబడినదేగాని వాస్తవానికి అసలు జగత్తనేది లేనేలేదు.

రజ్జువునందు సర్పము ఆరోపించబడినది. ఇదియే మాయ. లేని వస్తువు ఉన్నట్లుగా తెలియుటయే మాయ. రజ్జువు నుండి పాము ఆవిర్భవించలేదు. రజ్జువు సర్పముగా పరిణామము చెందినదీలేదు. రజ్జువు రజ్జువుగానే యున్నది. రజ్జువు తెలియని దశలో దానిస్థానే లేని సర్పము గోచరించినది. లేని సర్పము గోచరించుటయే మిథ్య లేక మాయ. ఇది అనిర్వచనీయమైన అసద్వస్తువు. మాయకూడా అనిర్వచనీయమే. నిర్వచించవలసి వచ్చినపుడు మనోవాక్కులు పనిచేయాలి. కానీ ఆ రెండుగూడా మాయయొక్క వ్యక్త స్వరూపములే అను విషయమును మరువరాదు. కనుక మాయలో కూర్చుని మాయను ప్రశ్నించలేము. కార్య స్థితినుండి కారణస్థితిని ఊహించలేము. స్థూలము సూక్ష్మమును అవగత మొనర్చుకొనుట బహుకష్టము.

కనుక ఈ ప్రపంచము మాయానిర్మితమై యున్నది. మాయయందు త్రిగుణములు చోటు చేసుకొని ఉన్నవి. ఈ మాయకు ప్రత్యేక మనుగడలేదు గనుక మాయకూడా బ్రహ్మమునే ఆశ్రయించు కొనియున్నది. అనిర్వచనీయమైన మాయకు ఆది తెలియకున్నను అంతమున్నదని మాత్రము చెప్పవచ్చును. బ్రహ్మమువలె మాయ నిత్యముకాదు. అవికార్య సత్తాస్వరూపమైన బ్రహ్మమునందు మార్పును ప్రవేశ పెట్టునది ఈ మాయయే.

తత ఆకాశః సంభూతః

భావము :– దాని నుండి (మాయ) ఆకాశము ఆవిర్భవించెను.

ఆకాశాత్ వాయుః

భావము :– ఆకాశమునుండి వాయువు కలిగెను.

వాయోస్తేజః

భావము :– వాయువునుండి అగ్ని పుట్టెను.

తేజస ఆపః

భావము :– అగ్నినుండి జలము పుట్టెను.

అద్భ్యః పృథివీ

భావము :– జలమునుండి భూమి పుట్టెను.

విషయముల నన్నింటిని ఆచార్యులవారు వివరించబోవుచు ముందుగా ప్రపంచోత్పత్తిని గూర్చి తెలియజేయుచున్నారు.

అధ చతుర్వింశతి తత్త్వోత్పత్తి ప్రకారం వక్ష్యామః

భావము :- ఇపుడు ఇరువది నాలుగు తత్త్వములతో కూడిన ప్రపంచోత్పత్తి తెలుపు చున్నాము.

బ్రహ్మ శ్రయా సత్త్వ రజస్తమో గుణాత్మికా మాయా అస్తి

భావము :- సత్త్వరజస్తమో గుణములతో కూడి, బ్రహ్మశ్రయముతో మనుగడను సాగించు నదియేమాయ.

వ్యాఖ్య

బ్రహ్మము అనంతమైనది. అద్వయమైనది. విభజించుటకు వీలులేనిది. జ్ఞాత, జ్ఞాన, జ్ఞేయములు తెలియని స్థితియే బ్రహ్మము. ఈ త్రిపుటిని అధిగమించి ఉండునది ఏదియో అదియే బ్రహ్మము. అనంతమైన బ్రహ్మము నందు దేశకాలాదులు కూడా తెలిసే అవకాశము లేదు. ఆదిలో బ్రహ్మమొక్కటియే ఉండుటవలన ఏకమైన తనలో భేదములు గోచరించు అవకాశములేదు.

మరి ఈ జగత్తు ఎలా ఆవిర్భవించినది? బ్రహ్మమునుండి ఆవిర్భవించినది అని చెప్పుదువా? మరి అదియే నిజమైనచో తన నుండి ప్రత్యేకముగా ఒక వస్తువు కదిలి వచ్చినచో అలా కదిలివచ్చిన పరిమిత వస్తువు బ్రహ్మము కూడా పరిమిత మెనర్చునుగాన బ్రహ్మము నుండి ఏదియును ఆవిర్భవించుటకు వీలులేదు. మరియొక విధముగా బ్రహ్మమే జగత్తుగా పరిణామము చెందినదని భావింతుమా? ఇది కూడా సంభవముకాదు. పాలు పెరుగుగామారినట్లు బ్రహ్మము జగత్తుగా పరిణామము చెందియున్నచో బ్రహ్మము స్వరూపమును కోల్పోయి శూన్యమగును.

బ్రహ్మము నుండి జగత్తు ఆవిర్భవించుట అసంభవము. బ్రహ్మమే జగత్తుగా పరిణామము చెందుట అనూహ్యము. మరి జగత్తు ఎలా ఆవిర్భవించినది? అసలు జగత్తు ఆవిర్భవించనేలేదు. బ్రహ్మము పరిణామము చెందినదీలేదు. బ్రహ్మమునందు జగత్తు ఆరోపించబడినదేగాని వాస్తవానికి అసలు జగత్తేదీ లేనేలేదు.

రజ్జువునందు సర్పము ఆరోపించబడినది. ఇదియే మాయ. లేని వస్తువు ఉన్నట్లుగా తెలియుటయే మాయ. రజ్జువు నుండి పాము ఆవిర్భవించలేదు. రజ్జువు సర్పముగా పరిణామము చెందినదీలేదు. రజ్జువు రజ్జువుగానే యున్నది. రజ్జువు తెలియని దశలో దానిస్థానే లేని సర్పము గోచరించినది. లేని సర్పము గోచరించుటయే మిథ్య లేక మాయ. ఇది అనిర్వచనీయమైన అసద్వస్తువు. మాయకూడా అనిర్వచనీయమే. నిర్వచించవలసి వచ్చినపుడు మనోవాక్కులు పనిచేయాలి. కానీ ఆ రెండుగూడా మాయయొక్క వ్యక్త స్వరూపములే అను విషయమును మరువరాదు. కనుక మాయలో కూర్చుని మాయను ప్రశ్నించలేము. కార్య స్థితినుండి కారణస్థితిని ఊహించలేము. స్థూలము సూక్ష్మమును అవగత మొనర్చుకొనుట బహుకష్టము.

కనుక ఈ ప్రపంచము మాయానిర్మితమై యున్నది. మాయయందు త్రిగుణములు చోటు చేసుకొని ఉన్నవి. ఈ మాయకు ప్రత్యేక మనుగడలేదు గనుక మాయకూడా బ్రహ్మమునే ఆశ్రయించు కొనియున్నది. అనిర్వచనీయమైన మాయకు ఆది తెలియకున్నను అంతమున్నదని మాత్రము చెప్పవచ్చును. బ్రహ్మమువలె మాయ నిత్యముకాదు. అవికార్య సత్తాస్వరూపమైన బ్రహ్మమునందు మార్పును ప్రవేశ పెట్టునది ఈ మాయయే.

తత ఆకాశః సంభూతః

భావము :- దాని నుండి (మాయ) ఆకాశము ఆవిర్భవించెను.

ఆకాశాత్ వాయుః

భావము :- ఆకాశమునుండి వాయువు కలిగెను.

వాయోస్తేజః

భావము :- వాయువునుండి అగ్ని పుట్టెను.

తేజస ఆపః

భావము :- అగ్నినుండి జలము పుట్టెను.

అద్భ్యః పృథివీ

భావము :- జలమునుండి భూమి పుట్టెను.

వ్యాఖ్య

ఇచ్చటనుండి పంచభూతములు ఎలా ఆవిర్భవించినవో తెలియ జేయుచున్నారు. కుండ కార్యరూపములో గోచరించింది. అది ఏ వస్తు నుండి రాబడినదో దానిని ఉపాదానకారణము అంటారు. కుండకు మట్టి ఉపాదాన కారణము. అయితే ఇక్కడ మనకు గోచరించు ప్రపంచము మాయా నిర్మితమే గనుక ఈ ప్రపంచానికి మాయ ఉపాదానకారణము. మాయద్వారా తయారైన ప్రపంచము కార్యరూపములో తెలియుచున్నది. ఈ జగత్తులో సత్త్వరజస్తమోగుణములు తెలియుచున్నవి. కార్యములో ఏ లక్షణ లయితే ఉంటాయో అవి కారణములో ఉండితీరవలెను గనుక కారణమైన మాయలో త్రిగుణములుండి తీరవలెనని నిర్ణయించుట జరిగినది. త్రిగుణ మిళితమైన మాయనుండి పంచభూతములు పుట్టినవి. వానినే పృథివ్యప్తేజో వాయురాకాశములు అందురు. మనకు గోచరించు వస్తువులలో ఒక్కొక్క భూతము వేరువేరుగా తెలియుచున్నను, వాస్తవానికి ప్రతి ఒక్క భూతములోను మిగిలిన నాలుగు భూతములు కలిసియున్నవి. ఇక్కడ జలము జలముగాదు, నిప్పు నిప్పుకాదు.

ఈ విషయమును ఒక ఉదాహరణము ద్వారా తెలుసుకొన వచ్చును. ఒక ప్లాస్టిక్ ముక్కను తీసుకొని పరిశీలించినపుడు ఆ ముక్క కేవలం పృథివీభాగమే నని అందరూ చెబుతారు. దానిని వేడిచేయగనే అది ద్రవిస్తుంది. ఈ లక్షణము ఎవరిది? ఇది జల లక్షణము. అది బాగా దహించబడినది కదా! దహించబడుచున్నది గనుక అందులో అగ్ని లక్షణమూ ఉన్నది. పూర్ణంగా కాలిన తరువాత ఆ కాలిన రేణువులు ఆకాశములో కదిలిపోవును. ఇది వాయులక్షణము. ఈ రేణువు లన్నియు ఆకాశమును ఆశ్రయించుకొనే కదులును. కనుక బాగా పరిశీలించి చూసినచో ప్రతి స్థూల వస్తువులో కూడ మిగిలిన సూక్ష్మవస్తువులు కలిసియే ఉన్నవని అంగీకరించక తప్పదు.

ఇక్కడ స్థూలమైన పంచభూతములు మనకు గోచరించు చున్నవి. స్థూలమైన భూతములు వ్యక్తమైనవి గనుక వీనికి కారణమైన సూక్ష్మభూతములు ఉండితీరాలి. సూక్ష్మభూతములు స్థూలము కావలెననిన ఏదో ఒక ప్రక్రియద్వారా అవి వ్యక్తమై ఉండాలి. దీనినే పంచీకరణము అందురు.

సూక్ష్మ భూతములు పంచీకరణముద్వారా స్థూలము గాక మునుపే తన్మాత్ర లనెడి ఈ సూక్ష్మ భూతములద్వారా జ్ఞానేంద్రియములు వచ్చినవి. శబ్దాది విషయాలు పంచీకరణము తర్వాత వ్యక్తమైనవి.

ఆకాశము, వాయువు, అగ్ని, జలము,పృథివి అనునవి తన్మాత్రలు. ఆకాశముయొక్క గుణము శబ్దము. వాయువుయొక్క గుణము స్పర్శ. అగ్నియొక్క గుణము రూపము. జలముయొక్క గుణము రుచి. పృథివి యొక్క గుణము గంధము.

ఆకాశము వినే అవకాశమును కల్పిస్తుంది; చూడబడదు. రుచి చూడబడదు, వాసన చూడబడదు. స్పృశించబడదు.

వాయువు వినబడుతుంది; స్పృశించబడుతుంది. వాసన చూడబడదు. కంటికి గోచరించదు. రుచి చూడబడదు.

అగ్ని చూడబడుతుంది; వినబడుతుంది. స్పృశించ బడుతుంది. వాసన, రుచి చూడబడదు.

జలము చూడబడుతుంది. వినబడుతుంది. స్పృశించ బడుతుంది.రుచి చూడబడుతుంది; వాసన చూడబడదు.

పృథివి చూడబడుతుంది. రుచి చూడబడుతుంది. స్పృశించబడు తుంది. వినబడుతుంది. వాసన చూడబడుతుంది. వాసన చూసే భూతము ఇది ఒక్కటియే.

ఏతేషాం పంచ తత్త్వానాం మధ్యే ఆకాశస్య సాత్త్వికాంశాత్ శ్రోత్రేంద్రియం సంభూతమ్

భావము :— ఈ పంచ భూతములలో ఆకాశముయొక్క సాత్త్వికాంశము వలన శ్రోత్రేంద్రియమగు చెవి తయారైనది.

వాయోఃసాత్త్వికాంశాత్ త్వగింద్రియమ్ సంభూతమ్

భావము :— వాయువుయొక్క సాత్త్వికాంశము వలన స్పర్శేంద్రియమగు చర్మము కలిగినది.

అగ్నేః సాత్త్వికాంశాత్ చక్షురింద్రియమ్ సంభూతమ్

భావము :- అగ్నియొక్క సాత్త్వికాంశమువలన చక్షురింద్రియమగు నేత్రము కలిగినది.

జలస్య సాత్త్వికాంశాత్ రసనేంద్రియమ్ సంభూతమ్

భావము :- జలముయొక్క సాత్త్వికాంశము వలన రసనేంద్రియమగు నాలుక కలిగినది.

పృథివ్యాః సాత్త్వికాంశాత్ ఘ్రాణేంద్రియమ్ సంభూతమ్

భావము :- పృథివియొక్క సాత్త్వికాంశము వలన ఘ్రాణేంద్రియమగు ముక్కు కలిగినది.

వ్యాఖ్య

పంచ భూతములయొక్క సాత్త్వికాంశము వలన జ్ఞానేంద్రియములు కలిగినవి. భూతముల గుణములను బట్టి తత్సంబంధమైన ఇంద్రియములు జనించినవి. ఆకాశముయొక్క గుణము శబ్దము గనుక దానియొక్క సాత్త్వికాంశము నుండి శబ్దమును వినెడి చెవి కలిగినది. వాయువుయొక్క గుణము స్పర్శ గనుక దానియొక్క సాత్త్వికాంశము నుండి స్పర్శను గ్రహించు చర్మము వచ్చినది. అగ్నియొక్క గుణము రూపము గనుక దానియొక్క సాత్త్వికాంశము నుండి రూపమును దర్శించెడి నేత్రములు వచ్చినవి.నీటియొక్క గుణము రసమైనందున దాని సాత్త్వికాంశము నుండి రుచిని తెలుసుకొనెడి నాలుక వచ్చినది. భూమియొక్క గుణము గంధమైనందున దాని సాత్త్వికాంశము నుండి వాసనను తెలుసుకొనెడి ముక్కు కలిగినది. ఈ విధముగా ఒక్కొక్క భూతము తన సహజగుణము ననుసరించి ఒక్కొక్క జ్ఞానేంద్రియమును ప్రవేశపెట్టగా, ఈ జ్ఞానేంద్రియములు మనస్సుచే ప్రేరేపింపబడి ఇంద్రియ విషయాలను అనుభవించుట వలన జీవునికి విషయానుభవాలు కలుగుతున్నాయి.

అంతఃకరణ

ఏతేషాం పంచతత్త్వానాం సమిష్టి సాత్త్వికాంశాత్ మనోబుద్ధ్యహంకార చిత్తాన్తః కరణాని సంభూతాని

భావము:- పంచభూతములయొక్క సమిష్టి సాత్త్వికాంశముల నుండి మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనెడి అంతఃకరణము ఏర్పడినది.

సంకల్ప వికల్పాత్మకం మనః

భావము:- సంకల్ప వికల్పాలతో కూడిన దానినే మనస్సు అందురు.

వ్యాఖ్య

జల ప్రవాహమే నది. సంకల్ప ప్రవాహమే మనస్సు. ప్రవాహ వడిని బట్టి నదియొక్క వడిని తెలుపునట్లు, సంకల్ప ప్రవాహ రీతిని బట్టి మనస్సుయొక్క స్థితి నిర్ణయింపబడుతుంది. ఒక్కక్షణమైనను మనస్సు ఆలోచించకుండా వుండలేదు. సంకల్ప వికల్పాదులు దొర్లుతూనే ఉంటాయి. ఒక సంకల్పము వస్తుంది. అదే మనస్సులో మరియొక సంకల్పము కదులుతుంది. రెండవ సంకల్పమువలన మొదటి సంకల్పానికి వికల్పం కలుగుతుంది. గనుక మొదట వున్నది సంకల్పము. తరువాత వచ్చినది వికల్పము. మూడవ సంకల్పము రాగానే రెండవది సంకల్పము అవుతుంది. మూడవది వికల్పము అవుతుంది. ఇలా సంకల్ప వికల్పాదులు మనస్సులో నడుస్తుంటాయి.

మనస్సు తెలిసిన విషయాలను గూర్చి ఆలోచించగలదే గాని తెలియని విషయాలను గూర్చి ఆలోచించలేదు. క్రొత్త విషయము తెలియగానే అది ఒక భావముగా మనస్సులో ప్రవేశించి స్మృతిగా నిలిచిపోతుంది. స్మృతులు కదిలిస్తుంటే మన గతులు మారిపోతుంటాయి. మనస్సులో కదిలే ఈ సంకల్పాల వలన వ్యక్తి చెదరగొట్టబడి తాను పరిమితుడనెడి భ్రాంతికి లోనై బాధ లనుభవిస్తుంటాడు. మనస్సు ఎప్పుడూ ఆలోచనలను చేస్తుందే గాని ఏవిషయాన్ని నిర్ణయించలేదు. సంశయగ్రస్థమై ఊగులాడే దానినే మనస్సు అంటారు. బంధమోక్షాలకు మనస్సే కారణము.

నిశ్చయాత్మికా బుద్ధిః

భావము :- నిశ్చయాభిప్రాయము కలదానిని బుద్ధి అందురు.

వ్యాఖ్య

సంకల్ప వికల్పాలను కొనసాగించిన మనస్సు సందేహాలతో సతమతమవుతూ వుంటుంది. ఏది ఆచరించవలెనో నిర్ణయించునది బుద్ధి అవుతున్నది. కర్తృత్వాభిమానము జీవునికి ఇచ్చుటనే కలుగును. సంసారమును

సమువార్జించు తయారుచేసి ఆత్మను మరుగుపరచినది ఇదియే. ఇది జ్ఞానమును సముపార్జించు స్థానము. "నేను చేయుచున్నాను–నేను అనుభవించుచున్నాను" అనెడి భావనలు ఇచ్చుటనే కలుగుచున్నవి. దేహముతో తాదాత్మ్యము చెంది దేహాత్మ భావనను తయారు చేసుకొనునది కూడా ఈ బుద్ధియే. కానీ ఇది ఆత్మకు అత్యంత సన్నిహితమై యున్నది. అడ్డుతెరవలె నిలిచియున్నది కూడాను. బుద్ధిలో పరిమితమైన చైతన్యమే జీవుడనబడు చున్నాడు.

అహం కర్తా అహంకారః

భావము :– "నేను కర్తను " అనెడి భావన అహంకారమనబడును.

వ్యాఖ్య

"నేను" అనెడి అసత్య భావన కదులుటయే అహంకారము. ఇది చికిత్స లేని వ్యాధి. అజ్ఞానము యొక్క ప్రథమ వ్యక్తదశ అహంకారమే. జనన మరణ చక్రమును విరివిగా విపరీతముగా త్రిప్పె మాయా స్వరూపిణి ఈ అహంకారమే. "నేను" అనెడి భావనచే కర్మలాచరించడము వలన "నేను" అని అనుభవించవలసి వస్తున్నది.టోపీ ఎవడు పెట్టుకున్నాడో తీసేయవలసినవాడు కూడా అతడే. అహంకారమే లేనిచో దుఃఖానుభవము కదిలే అవకాశమే లేదు. అహంకారమును నిర్మూలించకుండా ఎన్ని సాధనలు చేసినా బ్రతుకు చీకటిమయం కావడమేగాని, జీవనము జ్యోతిర్మయము అయ్యేది ఉండదు.

బావిలో ఒక జంతువుపడి చచ్చిపోయింది. నీళ్ళు దుర్గంధ భూయిష్టంగా తయారయ్యాయి. ఇంటియాజమాని పంపులద్వారా నీటిని సంపూర్ణంగా తోడించేశాడు. మరుసటినాడు క్రొత్త నీరు ఊరింది. కానీ ఏంలాభం? దుర్గంధం పోనేలేదు. చచ్చిన జంతువును బావిలోనే ఉంచి నీరు ఎంత తోడితే ఏమి ప్రయోజనం? అలాగే అహంకారాన్ని ఆంతర్యంలో నిలుపుకొని ఎన్ని సాధనలు ఆచరించినా ఏమి ఫలం? అహంకారియైన మానవుడికి ఆత్మానందము లభించే అవకాశమే లేదు.

చింతన కర్తృ చిత్తమ్

భావము :– చింతన చేయు దానిని చిత్తము అందురు.

వ్యాఖ్య

సంకల్ప వికల్పాదులను నడుపుదానిని మనస్సని గ్రహించాము. నిశ్చయించు ప్రజ్ఞగలదానిని బుద్ధియని తెలుసుకున్నాము. "నేను" అనెడి అహంభావనతో చరించుదానిని అహంకారము అని గ్రహించాము. ఇప్పుడు అంతఃకరణ చతుష్టయమునందు నాల్గవదియైన చిత్తమును గూర్చి తెలుసుకొనుచున్నాము.

గతములో మనమెన్నియో అనుభవములను పొందియున్నాము. వాటియొక్క అనుభూతులు అంతఃకరణమునందు స్మృతుల రూపమున నిలిచి పోయివున్నవి. గతములో ఆచరించిన కర్మలు అందించిన జ్ఞాపకాలను దృష్టియందుంచుకొని చింతన చేయుదానిని చిత్తము అందురు. ఈ ఆలోచనలు బుద్ధికి చక్కగా ఉపకరించి, బుద్ధి నిర్ణయాలను చేయుటకు అనుగుణ్యముగా విషయమును సేకరించి సిద్ధపరచును. దీనినే చిత్తము అందురు. మనో బుద్ధ్యహంకార చిత్తాలనెడి అంతఃకరణలో ఒక్కొక్కటి ఒక్కొక్క సమయాన తీవ్రంగా పనిచేయుచుండును. పనిని పాడుచేసే అహంకారము మాత్రము అన్నిచోట్ల పనిచేయుచుండును.

అంతఃకరణ అధిష్ఠాన దేవతలు

మనసో దేవతా చంద్రమాః

భావము :– మనస్సుకు అధిష్ఠాన దేవత చంద్రుడు.

వ్యాఖ్య

సంకల్ప వికల్పాలు చేయుదానిని మనస్సందురు అని తెలిసికొంటిమి. అట్టి మనస్సునకు అధిష్ఠానదేవత చంద్రుడై ఉన్నాడు. మనస్సు జడరూపము. స్వయంప్రకాశము లేనిది. బుద్ధిలో ప్రతిబింబించిన చిదాభాస చైతన్యమువలన మనస్సు ప్రకాశించును. మనస్సులాగే చంద్రుడు కూడా స్వయంప్రకాశము లేనివాడు. సూర్యుని వద్ద నుండి అరువు తెచ్చుకొని ప్రకాశించును. మనస్సు పొంగుతూ కృంగుతూ వుండును. చంద్రుడు కూడా పౌర్ణమి అమావాస్యలను గాంచుచు వృద్ధిక్షయాలు అనుభవించు చుండును. చంద్రుడు శాపగ్రస్థుడు.

మనస్సుకూడా శాపగ్రస్థురాలే. అందుచేత మనస్సునకు అధిష్ఠాన దేవత చంద్రుడైనాడు.

బుద్ధేర్బ్రహ్మా

భావము:- బుద్ధికి అధిష్ఠాన దేవత బ్రహ్మదేవుడు.

వ్యాఖ్య

బ్రహ్మదేవుడు సృష్టికర్త. అనేక విషయాలను, వస్తువులను నూతనముగా చిత్రించగల సమర్థుడు. కార్యములను ఆవిష్కరించువాడు. సృష్టిలో బ్రహ్మదేవుడు కార్యములను ఆవిష్కరించునట్లే మన దేహముద్వారా జరుగు సర్వ కర్మములను నిశ్చయించి, అమలు జరుగుటకు ఆవిష్కరణ జరుపునది బుద్ధియై ఉన్నందున బ్రహ్మదేవుడు బుద్ధికి అధిష్ఠాన దేవత ఆయెను.

అహంకారస్య రుద్రః

భావము :- అహంకారమునకు అధిష్ఠాన దేవత రుద్రుడు.

వ్యాఖ్య

రుద్రుడు లయకర్త. సృష్టిని లయింపచేయువాడు రుద్రుడు. అలాగే బ్రతుకును మండించి, కాల్చి అయోమయంగా మార్చునది అహంకారము. శ్మశానములో సర్వులూ దహించబడుచున్ననూ రుద్రుడు నిలిచియే యుండును. అలాగే ఈ అహంకారము కూడా శ్మశానములో కూడా చావక నిలచి యుండి ఉత్తర జన్మలను తయారు చేయును. అందుచేత అహంకారానికి రుద్రుడు అధిష్ఠాన దేవత అయ్యాడు.

చిత్తస్య వాసుదేవః

భావము :- చిత్తమునకు అధిష్ఠానదేవత వాసుదేవుడు.

వ్యాఖ్య

సర్వభూతముల యందుండి సమస్తముతో క్రీడించువాడు వాసుదేవుడు.

"వాసవత్సర్వభూతానాం"

అని మహాభారత నిర్వచనము. వాసుదేవుడు ఎలా సర్వ భూతముల యందుండి క్రీడించునో అలాగే చిత్తము అంతర్యములో కదులు స్మృతులన్నిటిలో చరించుచు రమించుచుండుటవలన చిత్తమునకు వాసుదేవుడు అధిష్ఠాన దేవత ఆయెను.

రజో అంశము

ఏ తేషాం పంచ తత్త్వానామ్ మధ్యే ఆకాశస్య రాజసాంశాత్ వాగింద్రియమ్ సంభూతమ్

భావము :- పంచభూతములలోని ఆకాశము యొక్క రాజస అంశము నుండి వాగింద్రియము అనగా మాట్లాడు ఇంద్రియము తయారైనది.

వాయోః రాజస అంశాత్ పాణీంద్రియమ్ సంభూతమ్

భావము :- వాయుభూతముయొక్క రాజస అంశము నుండి చేతులు కలిగినవి.

వహ్నేః రాజసాంశాత్ పాదేంద్రియం సంభూతమ్

భావము :- అగ్ని యొక్క రాజస అంశము నుండి పాదములు కలిగినవి.

జలస్య రాజస అంశాత్ గుదేంద్రియమ్ సంభూతమ్

భావము :- జలభూతము యొక్క రాజస అంశము వలన మలవిసర్జనేంద్రియము కలిగినది.

పృథివ్యాః రాజస అంశాత్ ఉపస్థేంద్రియం సంభూతమ్

భావము :- భూమియొక్క రాజస అంశము వలన జననేంద్రియము కలిగినది.

ఏతేషాం సమిష్టి రాజసాంశాత్ పంచప్రాణాః సంభూతాః

భావము :- ఈ పంచభూతముల యొక్క సమిష్టి రాజసాంశముల వలన పంచ ప్రాణములు తయారైనవి.

ఏతేషాం పంచ తత్త్వానాం తామస అంశాత్పంచీకృత పంచతత్త్వాని భవన్తి

భావము :- పంచభూతములయొక్క తామస అంశము వలన స్థూల పంచభూతములు ఏర్పడినవి.

వ్యాఖ్య

పంచ సూక్ష్మ భూతముల యొక్క సాత్త్వికాంశము నుండి పంచ జ్ఞానేంద్రియములు, అంతఃకరణ చతుష్టయము కలిగినవి. పంచసూక్ష్మ భూతములయొక్క రజోఅంశము వలన పంచ కర్మేంద్రియములు, పంచ ప్రాణములు కలిగినవి. ఇప్పుడు ఆ సూక్ష్మ పంచభూతముల యొక్క తామసికాంశము వలన స్థూల భూతములు ఎలా అరుదెంచినవో చెప్పుచున్నారు. సూక్ష్మమైన భూతములు స్థూలముగా మార్పు చెందుటకు ఉపకరించు ప్రక్రియను పంచీకరణము అందురు. పంచీకరణముద్వారా సూక్ష్మ భూతములు స్థూల భూతములు కాగా ఈ దృగ్గోచరమైన జగత్తు తెలియుచున్నది.

పంచీకరణము

పంచీకరణము అనునది దృగ్గోచరమైన విషయముకాదు. ప్రతి వస్తువు మనకు స్థూలముగా తెలియుచున్నది. స్థూలరూపము వెనుక సూక్ష్మరూపము ఉండవలెననుట సంశయ రహితము. ఇది అనుమాన ప్రమాణము ద్వారా తెలియును. కనుక సూక్ష్మరూపము మూలరూపముగా యుండినపుడు అది ఏదో ఒక రూపుము ద్వారా స్థూల వస్తువు అయి ఉండవలెను. అది ఎలా అయినది తెలుపు శాస్త్రీయ అవగాహనయే పంచీకరణము. ఈ పంచీకరణముద్వారానే మనకు స్థూలదేహము ప్రాప్తించినది.

పంచీకరణమ్ కథమ్ ఇతి చేత్! ఏతేషాం పంచ
మహాభూతానాం తామసాంశ స్వరూపమ్
ఏకం ఏకం భూతం ద్విధా విభజ్య ఏకం ఏకం
అర్థమ్ పృథక్ తూష్ణీం వ్యవస్థాప్య అపరమ
పరమర్థం చతుర్ధా విభజ్యస్వార్థం అన్యేషు
అర్థేషు స్వభాగ చతుష్టయ సంయోజనమ్
కార్యమ్! తథా పంచీకరణమ్ భవతి.

భావము :- పంచీకరణము అనగా ప్రతి సూక్ష్మ భూతము తామస అంశములో రెండు సమాన భాగములుగ విడిపోవును. రెండుగ విడిపోయిన ప్రతి సూక్ష్మ భూతములో

ఒక భాగము అట్లే ఉండును. ఇంకొక సగ భాగము నాలుగు సమాన భాగములుగ విభజింపబడును. ఒక సూక్ష్మ భూతమునందు కదలకుండా యున్న సగభాగమునకు మిగత ప్రతిసూక్ష్మ భూతములోని $\frac{1}{8}$ వంతు వచ్చి కలియును. ఇలా పంచీకరణము జరిగినది.

వ్యాఖ్య

సూక్ష్మరూపములో నున్న పంచ మహాభూతములే తన్మాత్రలని గ్రహించితిమి. వీటినే పంచ తన్మాత్రలు అందురు. భూమి, వాయువు, అగ్ని, జలము, ఆకాశము అను పంచభూతములకు ఈ తన్మాత్రలు ప్రాతినిధ్యము వహించుచున్నవి. ఒక్కొక్క తన్మాత్ర రెండుగా విభజింపబడుటకు వీలుగా తయారుకాగానే, తరువాత దశలో రెండు సమభాగములుగా విభజింప బడును. ప్రతి తన్మాత్ర రెండు సమభాగములైనది. తరువాత ప్రతి తన్మాత్రలో సగభాగము అలాగే చెదరకుండా యుండగ, మిగిలిన సగభాగము నాలుగు సమభాగములగును.

ప్రతితన్మాత్ర యొక్క సగభాగము ఒకటిగ యుండ, మిగిలిన సగభాగము నాలుగు సమభాగము లయ్యెను. నాలుగు భాగములైన సగభాగములోని ఒక్కొక్క భాగము మొత్తము తన్మాత్రలో ఎనిమిదవ వంతుగా యున్నదని మనకు అవగతమైనది. తరువాత ఒక తన్మాత్రలో చెదరక యున్న సగభాగముతో మిగిలిన నాలుగు తన్మాత్రలలో ఒక్కొక్క దానిలో నాలుగు సమభాగములై ఉన్నవానిలో ఒక్కొక్కటి చొప్పున కలియును. ఇప్పుడు మళ్ళీ పూర్ణ తన్మాత్ర అంత స్వరూపమగును. అనగా ఒక తన్మాత్రలోని సగభాగము మిగిలిన నాలుగు తన్మాత్రలలో ఒక్కొక్క దానినుండి ఎనిమిదవ వంతును గ్రహించును. ఇదియే పంచీకరణము.

ఆకాశము :- $\frac{1}{2}$ఆకాశము+$\frac{1}{8}$గాలి+$\frac{1}{8}$అగ్ని+$\frac{1}{8}$నీరు+$\frac{1}{8}$భూమి

వాయువు:- $\frac{1}{2}$ వాయువు+$\frac{1}{8}$ఆకాశము+$\frac{1}{8}$అగ్ని+$\frac{1}{8}$నీరు+$\frac{1}{8}$భూమి

అగ్ని :- $\frac{1}{2}$ అగ్ని+$\frac{1}{8}$గాలి+$\frac{1}{8}$ఆకాశము +$\frac{1}{8}$నీరు+$\frac{1}{8}$భూమి

జలము :- $\frac{1}{2}$జలము+$\frac{1}{8}$గాలి+$\frac{1}{8}$ఆకాశము+$\frac{1}{8}$అగ్ని+$\frac{1}{8}$భూమి

పృథివి :-$\frac{1}{2}$పృథివి+$\frac{1}{8}$గాలి+$\frac{1}{8}$ఆకాశము+$\frac{1}{8}$అగ్ని+$\frac{1}{8}$జలము

ఏతేభ్యఃపంచీకృత పంచమహా భూతేభ్యః స్థూలశరీరం భవతి.

భావము :- ఈ విధముగా తయ్యారైన పంచస్థూలభూతముల నుండి స్థూల శరీరములు ఆవిర్భవించినవి.

పిండము - బ్రహ్మాండము

ఏవం పిణ్డ బ్రహ్మాణ్డ యోరైక్యం సంభూతమ్

భావము :- ఈ విధముగా పిండమునకు బ్రహ్మాండమునకు ఐక్యత తెలియుచున్నది.

వ్యాఖ్య

జీవునియొక్క స్థూల శరీరము పిండము అనబడును. సమిష్టి స్థూలశరీరములు కలిసి అండము లేక బ్రహ్మాండ మనబడును. శరీరము లన్నియు పంచభూతముల రూపములే అయినందున వాస్తవానికి జీవ బ్రహ్మల మధ్య ఐక్యమే గాని భేదము దర్శనీయము కాదు.

అపంచీకృత పంచ మహాభూతముల నుండి సూక్ష్మభూతములు రాగా, పంచీకృత పంచ మహాభూతముల నుండి స్థూల భూతములు వచ్చినవి. ఈ పంచ భూతములు మాయనుండి పుట్టినవి. మాయ బ్రహ్మముయొక్క శక్తియై బ్రహ్మముకన్నా అన్యముగాక యున్నందున ఈ దృశ్యమాన జగత్తునందలి చరాచర భూతజాలమంతయు బ్రహ్మము యొక్క రూపమై ఉన్నది. ఈ అవగాహన కుదిరిన పుణ్యాత్ములకు సర్వము బ్రహ్మముగానే గోచరించును.

జీవ బ్రహ్మల మధ్య భేదము లేనపుడు లేని విషయాన్ని, తెలియని విషయాన్ని శాస్త్రము ఎలా ప్రతిపాదించింది ? జీవ బ్రహ్మల మధ్య ఐక్యము అని తెలుపుటలో రెండింటికి ప్రత్యేక అస్తిత్వమును ఆపాదించుట జరుగుట లేదా ?

జీవబ్రహ్మలకు ప్రత్యేక అస్తిత్వము లేదు. అలాగని భేదమూ లేదు. శాస్త్రము ఈ జీవ బ్రహ్మములనెడి విషయమును ప్రస్తావించుట వలన లేనివాటికి మనుగడ ఏర్పడేది ఉండదు. ఈ విషయములను శాస్త్రము ప్రవేశ పెట్టింది భేదాన్ని స్థిరపరచేందుకు కాదు. భేదాన్ని తొలగించేందుకు.

శాస్త్రము భేదాన్ని ప్రవేశ పెట్టి దానిని సమర్థించుటలేదు. నిర్మూలించుచున్నది. అయితే ప్రవేశ పెట్టడ మెందుకు ? నిర్మూలించడమెందుకు ?

ఎందుకో తెలుసా ? నిర్దేశించ బడుటకు వీలుగాని అజ్ఞానము నిర్మూలించ బడుతుంది అనెడి విషయాన్ని నిరూపించుటకే.

తెలిసిన దానినుండి తెలియని దానివైపు నడిపించుటయే వేదాంతావగాహన లోని అతిముఖ్యమైన పరిశీలనాంశమై ఉన్నది. జీవేశ్వర శబ్దాలు, భేదభావాలు శ్రోతయొక్క మనస్సులో నిలిచి యుండుటచేత వాటిని తొలగించేందుకు బోధనా సౌలభ్యమునకై శాస్త్రము ఈ విషయాలను ప్రవేశ పెట్టిందేగాని ఇవి సత్యము అని విశ్వసించి కాదు. భేద భావాలన్నింటినీ ముందు ముందు శాస్త్రము పూర్ణముగా ఖండించుట చేత, భేదభావనలకు శాస్త్రము విలువ నివ్వదు. ఇచ్చింది అంటే మాత్రం అది సులువుగా కొట్టివేసేందుకే.

యథా అయం ప్రపంచో మాయారజ్జుసర్పవత్,

తథా అయం శిష్యాది భేదవికల్పోఽపి ప్రాక్ప్రతి

బోధా దేవోపదేశనిమిత్తః, అతఉపదేశాదయం వాదః

శిష్యః శాస్తా శాస్త్రమితి! ఉపదేశ కార్యే తు జ్ఞానే

నివృత్తే జ్ఞాతే పరమార్థ తత్త్వే ద్వైతం న విద్యతే

రజ్జు -సర్పమువలె నున్నది ఈ ప్రపంచము యొక్క పరిస్థితి కూడా. జ్ఞానము కలుగుటకు ముందుగా శిష్యుడు గురువుకన్నను వేఱు అనెడి భావము ఉపదేశ సౌలభ్యముకొరకు ప్రవేశపెట్టదగియున్నది. శిష్యుడు, గురువు, శాస్త్రము అనెడి మాటలు కూడా కేవలం బోధకొరకు శాస్త్రము నందు గోచరించునవియే. బోధయొక్క లక్ష్యమైన జ్ఞానముకలుగగానే, ద్వైతప్రపంచము మిథ్యగా మిగిలి పోవుచున్నది" అని శ్రీ శంకరులవారు ఉపనిషద్భాష్యంలో తెలిపియున్నారు.

కనుక జీవ బ్రహ్మల మధ్య భేదము మిథ్య. ఉపాధి భేదము చేతనే బ్రహ్మము జీవుడుగా తెలియుచున్నాడు. జీవేశ్వరులనుండి ఈ ఉపాధులను తొలగించి చూచినచో ఏది మిగిలియున్నది అన్నచో చైతన్యమే నని తెలియగలదు. ఈ విషయమును ఇక చర్చించబోవు చున్నారు.

స్థూలశరీరాభిమాని జీవనామకం బ్రహ్మ ప్రతిబింబం
భవతి స ఏవ జీవః ప్రకృత్యా
స్వస్మాత్ ఈశ్వరమ్ భిన్నత్వేన జానాతి

భావము:- (సూక్ష్మ శరీరమునందు) ప్రతిబింబించిన బ్రహ్మము స్థూల శరీరాభిమానియై జీవుడనబడుచున్నాడు. ఈ జీవుడు ప్రకృత్యభిమానములో తాను ఈశ్వరునికన్నా అన్యమని భావించు చున్నాడు.

వ్యాఖ్య

శరీరముతో తాదాత్మ్యము చెందిన ఆత్మ జీవుడన బడుచున్నాడు. జీవునకు స్థూల సూక్ష్మము లున్నవి. సూక్ష్మ శరీరమునందు చైతన్యము ప్రతిబింబించును. సూక్ష్మ శరీరము వలననే జడరూపమైన స్థూల శరీరము చరించును. ఆకాశము వస్తువులకు తనలో ఆశ్రయ మిచ్చునట్లు చైతన్యము సూక్ష్మశరీరమును ప్రభావితం చేయును.

సూక్ష్మశరీరము నందు చైతన్యము ప్రతిబింబించ బడుటవలన జీవత్వము ఏర్పడుచున్నది. విద్యుచ్ఛక్తి బల్బునందలి ఫిలమెంటును ఎలా ప్రకాశింప జేయుచున్నదో చైతన్యము సూక్ష్మశరీరమును అలా ప్రకాశింప జేయుచున్నది. అలా చైతన్యముచేత ప్రభావితమైన సూక్ష్మశరీరమునందు ఏర్పడిన సంకల్పాలు పరిమితములై యున్నందున అవి పరిమిత జీవనమునే వీక్షించుచూ పరిమిత మనుగడనే ఆవిష్కరించును.

ఒక వస్తువును చూచుటలో రెండు విషయములు మనకు ప్రస్ఫుటముగా తెలిసి వచ్చును. ఇచ్చట సూక్ష్మ శరీరమునకు సంబంధించిన మనస్సు రెండు విధములైన ఆలోచనలను కొన సాగించును. 1) వస్తువును అవలోకించుట 2) వస్తువును అవగత మొనర్చుకొనుట. మనస్సు బహిర్ముఖమై వస్తువువైపు నడచుట వలన అవలోకించుట జరుగును. వస్తువు లేకపోయినను తత్సంబంధమైన భావము అంతర్యములో కదులుట అవగత మొనర్చుకొనుట యగును. కనుక మనలోపల నున్న భావములు, బయటనున్న వస్తువులు కలిసి ద్రష్టకు దృశ్యములో నున్న సంబంధమును స్థిరపరచుచున్నవి. ఇదియే జీవభావన. జీవభావన ఉన్నంతవరకు బంధమున్నది. జీవభావన తొలగగానే బంధము నిర్మూలించబడుచున్నది. ఏ విషయముతోను మనకు సంబంధము లేనపుడు మనకు ఆనందము కలుగుచుండును. అలాగాక వస్తు ప్రపంచముతో తాదాత్మ్యము చెందియున్న సమయాలలో మనకు ఆ ఆనందము లభ్యముకాదు.

దైనందిన జీవితములో మనము అనుభవించు సుఖదుఃఖాలన్నీ మనో కల్పితములేనని గ్రహించాలి. వాస్తవానికీ, మన ఊహలకి సంబంధముండదు. ఇదియే జీవ సృష్టి. తాను పరిమితుడైన జీవుడని భావించుటచేత, పరిమితమైన తన మనుగడయే అపరిమితమైన మరియొక పూర్ణత్వము వుండవలెనని నిర్ధారణ చేయుటవలన, తనకు ఉపాధిని తయారు చేసుకొనినట్లే ఈశ్వరునికి కూడా ఉపాధిని తయారుచేసి పెట్టును. రెండు ఉపాధులు ఒక దానిని ఒకటి పరిమితమొనర్చుట వలన జీవుడైన తాను దేవుడైన ఈశ్వరునికన్నా వేరు అనెడికల్పిత భావమును ఏర్పరచుకొనును. ఈ భావన జీవత్వము వలన కలిగినదియే. తనను తాను పరిమిత మొనర్చుకొనిన జీవుడు అనుక్షణము అపరిమిత వస్తువునే పరిమిత మొనర్చేటందుకు ప్రయత్నిస్తున్నాడు. పరిమితమైన వస్తువు అపరిమితమయ్యే సమస్య లేదు. అపరిమితమైన వస్తువు పరిమిత మగుట అను సమస్య ఉండదు. కనుక తాను జీవించెడి పరిమిత జీవనముతో సంతృప్తిని చెందలేడు. అలాగని అపరిమిత ఆనందము తానే యనెడి విషయాన్ని చెప్పినా వినడు. మానవుని దురవస్థకు కారణమై యున్నది ఇదియే.కనుక మనస్సే భేదభావములను తయారుచేసి జీవత్వమును అంటగట్టినది. మనస్సులోని సంకల్పములను నిరోధించుట వలన అపరిమితా నందము లభ్యమగునని చాలామంది పొరపాటు పడుతుంటారు. అది అలా కలిగేందుకు వీలులేదు.

అసలు ఈ జీవత్వానికి కారణమేమిటి? అని ఆలోచించినపుడే ఆ సమస్య పరిష్కారము కాగలదు. ఒక వస్తువునకు సంబంధించిన సంపూర్ణ జ్ఞానము లేనపుడు, ఆ వస్తువునే మరియొక వస్తువని భ్రమించే ప్రమాదము కలుగుచున్నది. త్రాడును చూచినాము. త్రాడు త్రాడుగా తెలియని స్థితిలో అచ్చట మనకు సర్పము గోచరించినది. ఈ సర్పభ్రాంతి మనోకల్పితమే గాని అసలు సర్పమనేది అక్కడ ఎచ్చటనూ లేదు. అదియే గనుక రజ్జువుగా ముందే తెలిసి యుండినచో, తెలియుట జరిగినది గనుక అచ్చట సర్పము గోచరించే అవకాశము లేదు. అలాగే అద్వయ సత్తా స్వరూపముగా ఆత్మ ఎప్పుడయితే తెలియబడుటలేదో, గోచరించు ఈ వస్తు ప్రపంచానికి ఆత్మ భిన్నమనెడి జ్ఞానము ఎప్పుడయితే కలుగుట లేదో, అప్పుడు పరిమితమైన అవగాహన చోటుచేసుకొని బ్రహ్మమునందు జీవత్వమును ఆపాదించు కొనుటయు, భేదభావము కలిగి యుండుటయు జరుగుచున్నది. భేదము తల

ఎత్తుట వలన "నేను" అనెడి అహంకారము 'నాది' అనెడి మమకారము కదులుచున్నవి. ఇదియే జీవత్వము.

"జీవం హేతు ఫలాత్మకం అహంకరోమి, మమసుఖ దుఃఖే"
ఇత్యేవం లక్షణం అనేవం లక్షణ ఏవ శుద్ధ ఆత్మని రజ్జ్వాం
ఇవ సర్పం కల్పయతే పూర్వం "

"కార్య కారణ హేతుత్వమును స్వభావముగా కలిగిన జీవుడు ఈ విధముగా తెలియుచున్నాడు; నేను ఇది చేశాను– ఈ సుఖదుఃఖాలు నావే" అని రజ్జువునందు సర్పమువలె శుద్ధాత్మ యందు జీవ భావాలు కల్పించు కొనుచున్నాడు" అని శ్రీ శంకరులు తమ కారికా భాష్యంలో తెలిపియున్నారు.

అవిద్యోపాధిః సన్ ఆత్మా జీవ ఇత్యుచ్యతే

భావముః– అవిద్యోపాధి కలిగిన ఆత్మయే జీవుడనబడు చున్నాడు.

వ్యాఖ్య

అజ్ఞానమును ఉపాధిగా కలిగి చరించువాడు జీవుడు. ఇతడు ఒక్క శరీరమునకే పరిమితుడు. మాయకు లొంగినవాడు. జీవునికి బంధమున్నదా? ఉన్నట్లయితే అది యదార్ధమా? కల్పితమా? యదార్థమేనని ఒప్పుకొనినచో యదార్థమైన దంటే సత్యమైనది అని భావము గనుక సత్యమైనది నశించే అవకాశములేదు. నశించకుండా వున్నది అంటే నీ స్వరూపమై ఉండాలి. వాస్తవానికి అజ్ఞానమే నీ స్వరూపమైనచో, దుఃఖము నీ స్వభావమై ఉంటుంది. తన స్వభావము ఎప్పుడు తనను కష్ట పెట్టదు గనుక దుఃఖము కలిగినపుడు నీవు హాయిగా ఉండగలగాలి. కానీ మన అనుభవం అందుకు భిన్నంగా యున్నది. దుఃఖాన్ని ఒక్క క్షణం కూడా మనము అనుభవించ లేకపోతున్నాము. అదియునుగాక అజ్ఞానము మన స్వరూపమైనచో అజ్ఞానము అందించే బంధము మనకు సుషుప్తిలో కూడా కలగాలి కదా! సుషుప్తిలో మనకు ఏ బంధాలు ఉన్నట్లుకూడా తెలియడము లేదు. ఏవిధమైన దుఃఖము అర్థం కావడములేదు. మరి సుషుప్తిలోని లేని బంధము జాగ్రత్స్వప్నాలలో ఎలా కదిలాయి? ఒక అవస్థలో తెలిసి ఒక అవస్థలో తెలియని వస్తువు ఎలా సత్యము కాగలదు? "నేను బద్ధుడను–నేను ముక్తుడను" అనెడి రెండు భావాలు కూడా ఆత్మయందు ఆరోపించబడినవే. కనుక నీవు నిజానికి బద్ధుడవు కావు. నీవు ఎప్పుడూ

ముక్తుడవే. "బద్ధుడను" అనెడి జీవ భావన నుండి నీవు విడిపడుటయే ఇప్పుడు కావలసినది.

"సర్వం ద్వైతం అవిద్యా విజృంభితం దుఃఖం ఏవ ఇతి
అనుస్మృత్య కామ భోగాత్ కామనిమిత్తోభోగః
ఇచ్ఛా విషయః తస్మాత్ విప్రశృతం మనో నివర్తయేత్
వైరాగ్య భావన ఏతి అర్థః! అజం బ్రహ్మ సర్వం
ఇత్యే తచ్ఛాస్త్రాచార్యోపదేశతః అనుస్మృత్యః
తద్విపరీతం ద్వైతజాతం నైవతు పశ్యతి అభవాత్!"

"ద్వైతమనునది అజ్ఞాన జనితమనియు, దుఃఖ స్వరూపమనియు స్మృతియందుంచుకొని, వైరాగ్యముచేత ఇచ్ఛా విషయముల నుండి మనస్సును వెనుకకు మరలించవలెను. శాస్త్ర వాక్యమును, గురువాక్యమును మననము చేసుకుంటూ అదంతయు పుట్టుకలేని బ్రహ్మమేననియు, అసత్తయిన ద్వైతము వాస్తవానికి లేనిదే గనుక దానిని చూడనవసరము కూడా లేదనియు" శ్రీ శంకరులవారు తమ ఉపనిషద్భాష్యంలో తెలిపియున్నారు.

మాయోపాధిః సన్ ఈశ్వరః ఇత్యుచ్యతే

భావము :– మాయోపాధి కలిగిన చైతన్యము ఈశ్వరుడు అనబడు చున్నాడు.

వ్యాఖ్య

మాయలను ఉపాధిగా కలిగి చరించువాడు ఈశ్వరుడు. ఇతడు సర్వశరీరములకు సంబంధించి యున్నాడు. ఇతడు మాయను తన అదుపులో ఉంచుకొని యున్నాడు.

మాయోపాధి కలిగి యుండుటచేత బ్రహ్మమే ఈశ్వరుడుగా తెలియుట జరుగుచున్నది. జీవుడు ఒక దేహానికి పరిమితమై ఉండి ఆ ఒక్క దేహానికి సంబంధించిన వాసనలను వ్యక్త మొనర్చినట్లు ఈశ్వరుడు సర్వ క్షేత్రములకు సంబంధించి యుండుటచేత సమస్త వాసనల సముదాయము తన ఆధీనములో ఉండును. జీవుని వాసనలు సమూలంగా నశించగానే అజ్ఞానము ధ్వంసమగుట వలన జీవత్వము తొలగిపోవును. జీవుడే లేనపుడు అతడు సృష్టించిన ఈశ్వరుడు మాత్రము ఎక్కడున్నాడు? ఒకగోడకు పడవవాడు పడవనునడుపు

పటము ఒకటి వ్రేలాడ దీయబడి యున్నది. ఆ పడవను పడవవాడు నడుపు చున్నాడు. అది ప్రకృతి సిద్ధంగా ఉన్నట్లు గోచరించుచున్నది. అయితే పరిశీలన ద్వారా పడవ అనేది అక్కడ లేనేలేదనియు, అంతా రంగులేననియు మన కర్థమగును. పడవ ఎప్పుడు రంగులని తేలిందో పడవవాడు కూడా రంగులేనని తెలిసిపోయింది. ఇదియే జ్ఞానము. జీవుడున్నంతవరకు ఈశ్వరు డుండక తప్పదు. జీవుడు లేడని తెలిసినదా? అయితే జీవుని తయారుచేసిన అవిద్యకూడా లేదని భావము. అవిద్యయే లేనపుడు మాయకూడా లేనిదే యని భావము. మాయ లేనపుడు మాయోపాధి కలిగిన ఈశ్వరుడెలా ఉండగలడు?

ఏవం ఉపాధి భేదాత్ జీవేశ్వర భేదదృష్టిః
యావత్ పర్యంతం తిష్టతి తావత్ పర్యంతం జన్మ
మరణాది రూప సంసారో ననివర్తతే

భావము:– ఎంతవరకు ఉపాధి భేదమువలన జీవుడు వేరు ఈశ్వరుడు వేరు అనెడి భావము నిలిచి యుండునో, అంతవరకు జనన మరణ రూప సంసారము మిగిలియే ఉండును.

వ్యాఖ్య

చైతన్య స్వరూపమైన బ్రహ్మమునందు భేదమును దర్శించను వీలుపడదు. చైతన్యము అనంతమైనందున అది రెండు కానేరదు. భేదము గోచరించి నంత వరకు మాయ తిష్ఠవేసి యున్నదనియే అర్థము. అందుచేత మోక్షము నొంద గోరువారు అభేదదర్శనమును, అద్వైత దృష్టిని కలిగించుకొని అనుభవించక తప్పదు.

జీవేశ్వర భేదము కల్పితమైనదియేగాని వాస్తవముకాదు. ఘటాకాశ మహా కాశాల భేదమువలె ఇది ఆరోపితము. ఒక కుండ తయారైనది. కుండ తయారు కాగానే అందులో ఆకాశము గోచరించినది. ఇప్పుడు దానిని ఘటాకాశము అందుము. అనగా కుండలోవున్న ఆకాశము అనిభావము. ఒకగదిని చూసినపుడు మఠాకాశము అందుము. మరి కుండలోని ఆకాశము, గదిలోని ఆకాశములు వేరువేరుగా ఉన్నవా! కుండ చిన్నది. గది పెద్దది. కుండలో ఉన్నది ఆకాశమే. గదిలో ఉన్నదికూడా ఆకాశమే. కుండస్థాయి నుండి దర్శించినపుడు

ఆకాశము కుండలో ఉన్నది అంటారు. అదే మన దృష్టిని ఒక్కసారి ఆకాశము వైపునకు మరల్చినచో కుండకూడా అకాశమునందే ఉన్నది అని అందుము. చిన్నగది జీవుడు. పెద్దగది ఈశ్వరుడు. రెండు గదులలో ఉన్నది ఆకాశము. ఆకాశము ఒక్కటేగాని రెండుగాదు. గది గోడలు, కుండయొక్క ఆవరణ కలిసి వాటిని వేరుపరచినవి. ఇప్పుడు కుండను బ్రద్దలుకొట్టి గోడలు పగులగొడితే రెండు ఆకాశములు ఒకటిగానే తెలియును. జీవేశ్వరులు కూడా ఉపాధి వినిర్ముక్తులైనపుడు అఖండాత్మగా వెల్గొందుదురు.

ఈశ జీవయో ర్వేషధీ భిదా
సత్స్వభావతో వస్తు కేవలం

'ఉపాధి భేదము వలన జీవేశ్వరులలో భేదము గోచరించి నప్పటికి ఇద్దరును సత్స్వరూపులై ఉండుటచేత ఒకే వస్తువై యున్నారు " అంటారు రమణ మహర్షులవారు.

తస్మాత్ కారణాత్ న జీవేశ్వరయోః భేద బుద్ధిః స్వీకార్యా

భావము :– అందుచేత జీవేశ్వర భేద బుద్ధిని ఉపేక్షించవలెను.

వ్యాఖ్య

జీవేశ్వరభేదము అసత్యము. ఆరోపితము. దీనికి అజ్ఞానమే ముఖ్యకారణముగా తెలియుచున్నది. భేదబుద్ధి దూరము కావలెనన్నచో అజ్ఞానము దూరము కావలెను. వెలుతురుచేత చీకట్లు చెదరి పోవునట్లు జ్ఞానము చేతనే అజ్ఞానము ధ్వంసమగును. జీవేశ్వరులమధ్య ఉపాధిభేదమేగాని స్వరూపతః ఇరువురును చైతన్యరూపులయ్యే యున్నారు. చైతన్యము అద్వయ మైనందున జీవేశ్వరుల మధ్య అద్వైత సత్యమే భాసించుచున్నది.

ఈశ్వరుని యందును, జీవుని యందును సారభూతముగా యున్న సత్తా స్వరూపమును గ్రహించిన జ్ఞానులు ఆ రెండు వేఱుకాదనియు, ఒకటేననియు తెలియజేసి యున్నారు. ఉపాధులు తొలగితే చాలు. చైతన్యము అద్వైతమై భాసిస్తుంది.

వేషహానత స్స్వాత్మ దర్శనం
ఈశ దర్శనం స్వాత్మ రూపతః

"ఉపాధులను తొలగించినచో జీవుడు ఈశ తత్త్వమును దర్శించును. తద్వారా ఆత్మసాక్షాత్కారము నొందును." అని రమణ భగవానులు తెలిపియున్నారు.

నను సాహంకారస్య కించిజ్ఞస్య జీవస్య
నిరహంకారస్య సర్వజ్ఞస్య ఈశ్వరస్య తత్త్వమసీతి
మహావాక్యాత్ కథం అభేద బుద్ధిః స్యాత్
ఉభయోఃవిరుద్ధ ధర్మ ఆక్రాన్తత్వాత్!

భావము:— అహంకారరూపుడు, పరిమిత జ్ఞానము కలవాడు జీవుడు. నిరహంకారుడు, అపరిమిత జ్ఞానము కలవాడు ఈశ్వరుడు. "తత్త్వమసి" మహావాక్యము తెలిసినంతమాత్రాన విరుద్ధ ధర్మాలు కలిగిన ఈ రెండింటి మధ్య అభేదము ఎలా దర్శనీయమగును?

వ్యాఖ్య

జీవేశ్వరులకు అభేద సంబంధమని శాస్త్రము తెలియజేయుచున్నది. అయితే జీవేశ్వరులు విరుద్ధధర్మాలతో చరించుచున్నందున "తత్త్వమసి" వాక్యమును నమ్ముట ఎలాగు? అనిన పూర్వపక్షికి ఆచార్యులు ఇచ్చట సమాధాన మొసంగుచున్నారు.

ఛాందోగ్యోపనిషత్తునందు "తత్త్వమసి" అనెడి మహావాక్య మున్నది. ఇది అభేద దర్శనమును చక్కగా అందించును. దీనిని ఉద్దాలక మహర్షి తన కుమారుడైన శ్వేతకేతును ఉద్ధరించేందుకు తెలిపెను.

'తత్త్వమసి' వాక్యమునందు "తత్" పదానికి అర్థము బ్రహ్మము. 'త్వం' పదానికి అర్థము జీవుడు. వీరు ఒక్కటియే అను విషయమును "అసి" అను క్రియాపదము నిర్ణయించును. ఈ "తత్త్వమసి" మహా వాక్యమును తెలుసుకొనేముందు అసలు వాక్య స్వరూపమును తెలుసుకొనుట మంచిది.

వాక్యములు రెండు విధములు: 1) సామాన్యవాక్యము 2) లక్షణ వాక్యము. ఇచ్చట తత్త్వమసి వాక్యము ఈ రెండింటిలో ఏవిధమైన వాక్యము అని తెలుసుకొనే ముందు ఆ వాక్యముల యొక్క అర్థభావములను గ్రహించుట ముఖ్యము.

1)సామాన్య వాక్యమనగా భావమునంతటిని సూటిగాచెప్పుట. ఉదా: రంగడు పండరీపురమునకు వెళ్ళుచున్నాడు. ఈ వాక్యము మనకు చక్కగా అవగతమైనది. ఇది సామాన్య వాక్యము.

2) లక్షణవాక్యము సూటిగా భావమును వ్యక్తము చేయదు. ఉదా:— నలుపు వచ్చినది. నలుపు అనేది రంగు. రంగు ఎలా నడచి వస్తుంది? ఇచ్చట నలుపు అనగా నల్లకుక్క అని భావము. దీనిని లక్షణశాస్త్రము ద్వారా అర్థం చేసుకోవాలి.

మనము ప్రస్తుతము చర్చించే ఈ "తత్త్వమసి" వాక్యము సామాన్య వాక్యమా? కాదు. ఇది లక్షణ వాక్యము. లక్షణ వాక్యమైనందున గురువు ద్వారా వినవలసినదియే గాని మనకు మనముగా గ్రంథాలు చదివి అర్థంచేసుకొనేది ఉండదు.

ఈ "తత్త్వమసి" వాక్యము సత్యమును కంటికి కట్టినట్లు తెలియజేయును. అయితే సామాన్య వాక్యముగా కాకుండా లక్షణ వాక్యముగా గ్రహించి అర్థం చేసుకోవాలి. అదికూడా శ్రోత్రీయ బ్రహ్మనిష్ఠుడైన గురువు చెంత ఆసీనులయ్యే అభ్యసించాలి.

లక్షణ వృత్తిద్వారా విరుద్ధ ధర్మాలను తొలగించిన పిదప 'తత్' 'త్వమ్' పదములు రెండును ఒకటే యనెడి అనుభూతి కలుగును. భగత్యాగ లక్షణ వృత్తిద్వారా ఆత్మజ్ఞానమును గ్రహించవలెను. దేహేంద్రియ మనోబుద్ధులలో తెలియవచ్చెడి విరుద్ధ ధర్మములను తొలగించి, సచ్చిదానంద లక్షణములను అనుభవమునకు తెచ్చుకొని, ఏదయితే "నేను" అనెడి అధిష్ఠాన రూపముగా తెలియునో అదియే ఆత్మయని ఎరుకగలిగి యుండవలెను.

అస్తితావత్ స్వయం నామ వివాదా విషయత్వతః
స్వస్మిన్నపి వివాదశ్చేత్ ప్రతివాద్యత్ర కోభవేత్

'నేను' అనెడి సత్పదార్థము విషయమునందు ఏవిధమైన సందేహము లేదు. ఈ "నేను" అను విషయములోకూడా వివాదమున్నచో అలా వివాదమును సాగించువాడవడు?" అని విద్యారణ్యస్వాములవారు వేదాంత పంచదశి అను గ్రంథములో ప్రశ్నించిరి.

అనగా "నేను" అనేది సత్తుయే గనుక సత్తును నిరాకరించుట అనగా తాను లేడని అంగీకరించుటయే జరుగును. ఇది నిరాధారమైన వాదనయై యున్నది. కనుక ఉన్నది సత్తు ఒక్కటియే. అదియే నీవు. అదియే ఈశ్వరుడు కూడాను. ఉపాధి రహితంగా చూచినపుడు ఇరువురు ఒకటియే అయి ఉన్నారు. ఇదియే తత్త్వమసి వాక్యము ద్వారా మనకు అందెడి సత్యనిర్దేశము.

ఇతి చేత్ న! స్థూల సూక్ష్మ శరీరాభిమానీ "త్వం" పద
వాచ్యార్థః! ఉపాధి నిర్ముక్తం సమాధి దశా సంపన్నం
శుద్ధంచైతన్యం "త్వం" పద లక్ష్యార్థః

భావము:- ఇదినరియైనది కాదు. స్థూల సూక్ష్మ శరీరములలో కూడిన 'నీవు' జీవుడనునది వాచ్యార్థము. ఉపాధిరహితమై, సమాధి దశలో ఏది శుద్ధ చైతన్యముగా గాంచబడుచున్నదో అది లక్ష్యార్థము.

వ్యాఖ్య

"తత్త్వమసి" వాక్యమునందు 'త్వం' అనగా నీవు అని భావము. ఈ 'త్వం' పదమును నిర్ణయించునపుడు వాచ్యార్థము, లక్ష్యార్థము అనెడి రెండు విషయములు ఉండును. స్థూల సూక్ష్మ శరీరముల ద్వారా, అవస్థాత్రయ పరిధిలో కించిజ్జ్ఞుడుగా తెలియబడు నీవు జీవుడవు అనునది వాచ్యార్థము. అయితే సమాధి దశలో అనగా జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థలను సాక్షిగా వీక్షించు దశలో ఏదయితే శుద్ధచైతన్యమైన ఆత్మగా తెలియ బడుచున్నదో అది 'త్వం' పదముయొక్క లక్ష్యార్థము. భేదము వాచ్యార్థము నందేకాని లక్ష్యార్థము నందు లేదు. స్థూలసూక్ష్మ కారణ శరీరములతో కూడి అవస్థాత్రయమును అనుభవించువాడు జీవుడు అనునది వాచ్యార్థము. ఉపాధులులేని సమాధి స్థితిలో తెలియబడు సత్తా చైతన్యము జీవుడనునది లక్ష్యార్థము.

ఏవం సర్వజ్ఞత్వాది విశిష్టః ఈశ్వరః తత్పద
వాచ్యార్థః ఉపాధి శూన్యం శుద్ధచైతన్యంతత్పద లక్ష్యార్థః

భావము:- సర్వజ్ఞత్వము మొదలగు ధర్మములతో కూడినవాడు ఈశ్వరుడు అనునది వాచ్యార్థము. ఉపాధిశూన్యమై, శుద్ధచైతన్య రూపుడు ఈశ్వరుడనునది లక్ష్యార్థము.

వ్యాఖ్య

సర్వజ్ఞత్వాది ధర్మములతో కూడినవాడు ఈశ్వరుడు అని సామాన్యార్థమును గ్రహించుట తత్పదవాచ్యార్థము. ఈశ్వరుని ఉపాధి కూడా కల్పితమే గనుక ఉపాధులనుండి విడిపడిన చైతన్యమే ఈశ్వరుడు అనునది లక్ష్యార్థమై ఉన్నది.

జీవుడు ఒక్క శరీరానికి సంబంధించినవాడు. ఈశ్వరుడు అన్ని శరీరాలకు సంబంధించినవాడు. జీవుడు అజ్ఞానమును ఉపాధిగా కలిగి మాయకు లొంగి ఉన్నాడు. ఈశ్వరుడు మాయను ఉపాధిగా కలిగి మాయను తన ఆధీనములో వుంచుకొని యున్నాడు. ఒక్కదేహానికి పరిమితుడైనందున జీవుడు కించిజ్జ్ఞుడని పిలువ బడినాడు. అన్ని దేహములకుసంబంధించినవాడు గనుక ఈశ్వరుడు సర్వజ్ఞుడని పిలువబడినాడు. ఇరువురి ఉపాధులు ఒకే చైతన్యముచేత నడుపబడుచున్నవి. ఉపాధులు పరిమితమై, దేశకాలాదులలో తెలియుచున్నందున అవి శాశ్వతమైనవికావు. చైతన్యము దేశ కాలాతీతమై యున్నందున అది నిత్యము. ఉపాధులు కల్పితములేగాని సత్యము కానందున జీవుని యొక్క అవిద్యోపాధిని, ఈశ్వరుని యొక్క మాయోపాధిని దూరంచేసి చూసినచో ఇరువురును చైతన్య స్వరూపమే అయి ఉన్నారు. చైతన్యము ఒక్కటేగాని రెండుకానందున ఇరువురిమధ్య భేదము అవాంఛనీయమై తెలియుచున్నది.అభేదము అనుభవ గ్రాహ్యమై మిగులు చున్నది.

ఏవం చ జీవేశ్వరయోః చైతన్య రూపేణ అబాదే బాధకా భావః

భావము :- ఈ విధముగా చైతన్యస్థాయిలో జీవునకు ఈశ్వరునకు భేదములేదు.

వ్యాఖ్య

విశ్వమునుండి నామ రూపములను వేరుజేసి, జీవుని పంచ కోశ వినిర్ముక్తుని గావించి దర్శించినచో అప్పుడు బాహ్యాభ్యంతరాలలో మిగిలియున్నది చైతన్యమేనని అనుభవమునకు అందును.

దేశకాలాదుల యందు తెలియబడు ప్రపంచము ఏదో ఒక అనుభవ భూమికకు పరిమితమయ్యే ఉన్నది. దేశకాలాదులనునవి పరస్పరము ఒక దానిపై మరొకటి అధారపడియుండుటచేత అవి ఏవియును తమలో సత్యమును నింపుకోజాలవు. మరొకదాని ప్రమేయం లేనిదే ఏ ఒక్కటి తెలియబడదు. మనము చేయు ఆలోచనకూడా దేశకాలాదుల పరిధినుండే జరుగు చున్నందున మనము చేయు ఆలోచన దేశకాలాదులను అధిగమించదు. దేశ కాలాలకు అతీతముగా వెళ్ళినప్పుడే సత్యము ఎఱుకపడును. ఆ స్థితిలో అభేదదర్శనమే తెలియును. ఇదియే మోక్షము.

'అనిమిత్త స్య చిత్త స్యేతి యా మోక్షాఖ్యా అనుత్పత్తిః సా
సర్వదా సర్వావస్థాసు సమా నిర్విశేషా అద్వయా చ'

"ఏది మనస్సు కదలని స్థితియైయున్నదో, మరొక కారణములేనిదై యున్నదో, సర్వావస్థలయందు సమముగా యున్నదో, నిర్విశేషమై, అద్వయ సత్తాస్వరూపమై ఉన్నదో అదియే మోక్షము" అని శ్రీశంకర భాష్యము తెలియజేయుచున్నది.

ఏవంచ వేదాంత వాక్యైః సద్గురూపదేశేన చ సర్వేష్వపి భూతేషు
యేషాం బ్రహ్మ బుద్ధిః ఉత్పన్నాతే జీవన్ముక్తాః ఇత్యర్థః

భావము :– ఈ విధముగా వేదాంతవాక్యముల యొక్క భావమును, సద్గురువు చెంత ప్రవచన రూపములో తెలుసుకొని సర్వభూతములయందు బ్రహ్మమునే దర్శించు మహాత్ములెవరో వారే జీవన్ముక్తులు.

వ్యాఖ్య

గురు ప్రవచనము ద్వారానే వేదాంత శాస్త్రము అనుభవమునకు అందును. సాంప్రదాయ విదుడైన గురువు వేదాంత వాక్యముల యందలి లక్ష్యార్థములను వివరించి శిష్యునికి అభేద దర్శన మగునట్లు ఆశీర్వదించును.

శిష్యుడు ఎంత ప్రజ్ఞావంతుడైనను తనకు తానుగా శాస్త్రలోతులను గ్రహించలడు. గొప్పశాస్త్రజ్ఞుడైనను స్వతంత్రముగా ఆధ్యాత్మిక విద్యను అభ్యసించకూడదని శ్రీశంకరులు తెలియజేస్తూగా హృదయ సంబంధమైన

ఒక ప్రత్యేక భాష ద్వారా, ఒక ప్రత్యేకశైలిలో బోధించినపుడే వేదాంత జ్ఞానము అనుభవమునకు అందును. అట్టిశైలి, శక్తి గురుదేవుని వద్దనే ఉండును. అతని శక్తి మనపై ప్రసరించుటవలననే మనకు శాస్త్ర హృదయము అవగతమగును.

నను జీవన్ముక్తః కః?

భావము :– జీవన్ముక్తుడనగా నెవరు?

యదాదేహాహం పురుషోఽహం బ్రాహ్మణోహం
శూద్రోహ మస్మీతి దృఢ నిశ్చయః తథా నాహం
బ్రాహ్మణః న శూద్రః న పురుషః కింతు
అసంగః సచ్చిదానంద స్వరూపః ప్రకాశరూపః
సర్వాన్తర్యామి చిదాకాశరూపోఽస్మీతి దృఢ
నిశ్చయ రూపః అపరోక్ష జ్ఞానవాన్ జీవన్ముక్తః

భావము :– ఏవిధముగా నేను శరీరమును, పురుషుడను, బ్రాహ్మణుడను, నేను శూద్రుడను అనెడి నిశ్చయ జ్ఞానము ప్రతివానికి కలదో అదేవిధముగా నేను బ్రాహ్మణుడనుకాను, శూద్రుడనుకాను, పురుషుడనుకాను, నేను సంగత్వము లేనివాడను, సచ్చిదానంద స్వరూపుడను, ప్రకాశరూపుడను, సర్వాంతర్యామిని, వస్తురహిత చైతన్యమును అనెడి అపరోక్షజ్ఞానము ఎవరికి నిశ్చయముగ నుండునో అతడే జీవన్ముక్తుడు.

వ్యాఖ్య

ఇంద్రియములకు అందెడి జ్ఞానము ప్రత్యక్ష జ్ఞానము. అలాగాక దూరముగా నుండి అనుమాన ప్రమాణము ద్వారాను లేదా ఇతరులు తెలియజేయుటవలనను కలిగెడి జ్ఞానము పరోక్షజ్ఞానము. ఆత్మజ్ఞానము ఈరెండు జ్ఞానములద్వారా తెలియబడునదికాదు. మరియొక వస్తువును అంగీకరించని అద్వయస్థితియే తెలియబడునది. ఇట్టి జ్ఞానము ఆత్మయైనందున అది అపరోక్ష జ్ఞానమే అయిఉన్నది. ఇది అభేదస్థితియై ఉన్నందున ఉన్నదియేకాని కొన్నదికాదు. కానున్నది కాదు. లింగభేదములు, జాతిభేదములు దర్శనీయములు కావు.

జీవన్ముక్తుని యొక్క స్థితిని తెలియజేయుచు కొన్ని విధాయక నిర్వచనములను, కొన్ని నిషేధ నిర్ణయములను తెలుపుచూ ఆత్మ యొక్క అస్తిత్వమును వివరించుచున్నారు.

జీవన్ముక్తుడు ఆత్మయే అయినందున అతనిలో ఏవిధమైన గుణములు కదిలేందుకు వీలులేదు. గుణమున్నచో అది వస్తువు యగును. వస్తువైనది ఏదైనను నశించిపోవును. ఆత్మ అసంగము, కేవలమునై యున్నందున అది బాధల నుండి దుఃఖము నుండి విడిపడి యున్నది. జీవన్ముక్తుడు కర్మబంధాల నుండి విడిపడియున్నాడు. దేశకాలాదుల నుండి జారిపడియున్నాడు. మనస్సును అధిగమించియున్నాడు. సర్వము సత్తారూపమై యున్నదని గ్రహించి, ఏవస్తువూ తనకన్నా అన్యముకాదని గుర్తించి సర్వమును తనయందే గాంచుటచేత సర్వజ్ఞుడై, సర్వము తానే వ్యాపించియుండుటచేత సర్వగతమై, సర్వగతమైనందున నిత్యుడై భాసించుచు అమరుడై, అమృతానంద స్వరూపుడై ఉన్నాడు.

"విగత రాగ భయక్రోధాది సర్వదోషైః
సర్వదామునిభిః మనన శీలైర్వివేకిభిః వేద
పారగైః అవగత వేదాన్తార్థ తత్త్వర్జ్ఞానిభిః
నిర్వికల్పః సర్వ వికల్ప శూన్యః అయం ఆత్మా
ద్రష్టః ఉపలబ్ధో వేదాన్తార్థ తత్పరైః"

" అనురాగము, భయము, క్రోధము మొదలగు సర్వదోషముల నుండి విడిపడినవారును, సర్వదా మననశీలురై వివేకవంతు లగువారును, వేద పారంగతులైనవారును, వేదాంత విజ్ఞానమును చక్కగా నెఱిగినవారును, వికల్పము నెరుగనివారుని, అగు మహాత్ములు సర్వోపద్రవముల నుండి వేరువడి ఆత్మద్రష్టలగుచున్నారు" అని శ్రీశంకరులవారు తమ ఉపనిషద్భాష్యంలో తెలిపియున్నారు.

బ్రహ్మైవాహం అస్మి ఇతి అపరోక్షజ్ఞానేన నిఖిల కర్మ బంధ నిర్ముక్తః స్యాత్

భావముః– "నేనే బ్రహ్మమును" అనెడి అపరోక్ష జ్ఞానము వలన జీవన్ముక్తుడు సర్వకర్మ బంధములనుండి విడివడుచున్నాడు.

వ్యాఖ్య

మన మాచరించెడి స్థూలకర్మలు స్థూల ఫలితములను అందించుచుండ, సూక్ష్మవాసనలు, సూక్ష్మఫలితములను అందించుచున్నవి. సూక్ష్మఫలితములే పాపపుణ్యములు. జ్ఞానమనెడి అగ్ని కదలగనే ఈ సర్వకర్మములు దగ్ధమై పోవును. ఈ

ఎవనియందు 'నేను–నాది' అను భావములు పొరపాటునకూడా కదలవో అతడే జీవన్ముక్తుడు. తన ఆంతర్యములోగాని, బాహ్యములో గాని నడిచే మార్పులవలన అతడు చెదరడు. పూర్ణరూపుడై ఉండును.

కర్మాణి కతివిధాని సన్తీతి చేత్ ఆగామి సంచిత ప్రారబ్ధ భేదేన త్రివిధాని సన్తి

భావము :– కర్మ లెన్ని విధములు? అని అడిగినచో అవిమూడు విధములని చెప్పబడును. *1)* ఆగామి కర్మ *2)* సంచిత కర్మ *3)* ప్రారబ్ధ కర్మ.

ప్రారబ్ధము నాచరించుచు కర్తృత్వ భావముతో ఈ జన్మలో ఆచరించెడి కర్మను ఆగామి కర్మ అందురు. ఆగామి కర్మలు జీవి మరణానంతరము సంచిత కర్మముగా మారిపోవును. జ్ఞానోదయము కలిగిన తరువాత కర్తృత్వ భావన ఉండేందుకు వీలులేదు. ఇదియే జ్ఞాని యొక్క ఆగామికర్మ.

జ్ఞానోత్పత్త్య నన్తరమ్ జ్ఞాని దేహకృతమ్ పుణ్యపాప
రూపం కర్మ యదస్తి త దాగామి ఇత్యభిధీయతే

భావము :– అపరోక్ష జ్ఞానము ఉదయించిన తరువాత జీవన్ముక్తుని దేహముద్వారా ఆచరించబడిన పుణ్య పాప కర్మల ఫలితములను ఆగామి అందురు.

సంచిత కర్మ కిం?

భావము :– సంచిత కర్మ అనగానేమి ?

అనంత కోటి జన్మానాం బీజ భూతం సత్ యత్కర్మ
జాతం పూర్వార్జితం తిష్టతి తత్ సంచితం జ్ఞేయం

భావముః– అనేక జన్మలలో ఆర్జింపబడి, బీజరూపమున ఉంటూ, రాబోవు జన్మలకు కారణభూతమగుచు ఏవి వున్నవో అట్టి కర్మ ఫలితములను సంచితకర్మ అందురు.

ప్రారబ్ధ కర్మ కిం? ఇతిచేత్

భావము : ప్రారబ్ధ కర్మ మనగానేమి? అని అడిగినచో

ఇదం శరీరం ఉత్పాద్య ఇహలోకే ఏవం సుఖ దుఃఖాది

ప్రదం యత్కర్మ తత్ ప్రారబ్ధం భోగేన నష్టం భవతి

ప్రారబ్ధ కర్మాణాం భోగాదేవ క్షయ ఇతి

భావము :– ఈ శరీరమును కలుగజేసి ఈ లోకములో సుఖదుఃఖరూప ఫలములను అందించి, అనుభవించగనే నశించిపోవునది ఏదియో అదియే ప్రారబ్ధ కర్మ.

సంచితం కర్మ బ్రహ్మైవ అహం ఇతి నిశ్చయాత్మక జ్ఞానేన నశ్యతి

భావము:– "నేను బ్రహ్మము" అనెడి జ్ఞానము వలన సంచిత కర్మ నశించును.

ఆగామి కర్మ అపి జ్ఞానేన నశ్యతి కించ ఆగామి కర్మాణాం

నలినీ దలగత జలవత్ జ్ఞానినాం సంబంధో నాస్తి

భావము :– జ్ఞానము వలన ఆగామికర్మ కూడా నశించి పోవును. పద్మ పత్రము జల బిందువుచే అంటబడనట్లు జ్ఞాని ఆగామి కర్మచే అంటబడడు.

కించ యే జ్ఞానినం స్తువన్తి భజన్తి అర్చయన్తి తాన్ప్రతి

జ్ఞానికృతం ఆగామి పుణ్యం గచ్ఛతి

భావము :– ఆగామి కర్మ కల్పితముగా జ్ఞానిలో కనుపించినపుడు అట్టి కర్మలోనున్న పుణ్యము ఆ మహాత్ముని స్తుతించువారికి, భజించు వారికి, అర్చించు వారికి అందును.

వ్యాఖ్య

తాను తరించిన తరువాతకూడాను జ్ఞానికి ప్రారబ్ధవశాత్తు దేహము కలిసియే యుండును. జీవించియున్న దేహము కర్మనాచరించ కుండా ఉండలేదు. జ్ఞానియొక్క దేహము ద్వారా కూడా కర్మాచరణ జరుగును. జ్ఞానిలో కోరిక లుండవు గనుక తన దేహము ద్వారా జరిగే కర్మ లోకకళ్యాణము

కొరకే అయి ఉంటుంది. అట్టిది పుణ్యకర్మయే అగును. పుణ్యకర్మయొక్క పుణ్యఫలము ఎవరికి చెందాలి. ఎవరు ఆచరించారో వారికేచెందాలి. మరి ఇక్కడ ఆచరించిన జ్ఞానికి కర్తృత్వభావన లేనందున భోక్తృత్వ భావన కూడా ఉండేందుకు అవకాశము లేదు. మరి ఆ పుణ్యము ఎవరికి చెందాలి ? అను ప్రశ్న వచ్చును. ఈ ప్రశ్నకు సమాధానమును శంకరులు ఇచ్చుట అందించుచున్నారు.

ఆప్తకాముడై, ఆత్మవిదుడైన ఆ జ్ఞానిని ఎవరు స్తుతించుదురో, భజించుదురో, అర్చించుదురో అట్టివారికి ఆ జ్ఞానియొక్క పుణ్యము అందును. మరి అట్టి జ్ఞానిని అసంస్కారులు ద్వేషించవచ్చు. వారి పరిస్థితి ఏమిటి ? ఈ విషయమునకు సమాధానమును ఇక చెప్పబోవుచున్నారు.

యే జ్ఞానినామ్ నిన్దన్తి ద్విషన్తి దుఃఖప్రదానమ్

కుర్వన్తి తాన్ ప్రతి జ్ఞాని కృతం సర్వం ఆగామి

క్రియమాణం యదవాచ్యం కర్మ పాపాత్మకం

తత్ గచ్ఛతి

భావము :– కల్పిత ఆగామి కర్మలోనున్న పాపభాగము జ్ఞానిని నిందించు వారికి, ద్వేషించువారికి, బాధించువారికి అందును.

జ్ఞానిని స్తుతించిన వారికి జ్ఞానియొక్క పుణ్యము అందునట్లు, అట్టి మహాత్ముని ద్వేషించిన వారికి జ్ఞాని ఆగామి కర్మలోని పాప భాగము అందును.

అయితే జ్ఞాని పాపకర్మల నాచరించునా? అనే సందియము రావచ్చును. జ్ఞానితెలిసి ఏ చెడు కర్మను ఆచరించడు. అతనిఎఱుకలో లేకుండా జరిగే పాపకర్మల వలన కలిగెడి పాపభాగము ఆ మహాత్ముని ద్వేషించిన వారికి, దూషించిన వారికి అందును.

సాధకులారా! ఇక్కడ ఒక విషయమును జాగ్రత్తగా గమనించి గుర్తించాలి. పుణ్యఫలమును పొందుట శ్రమతోకూడిన పనికాదు. మహాత్ములను గూర్చి సద్భావపూరితమైన చర్చను కొనసాగించినను వారిని పూజించినను మనకు పుణ్యము లభించును.

ఏ పుణ్యకార్యమును చేయలేని మనము తెలిసి తెలియని అమాయక ధోరణిలో మహాత్ముల బ్రతుకులకు భాష్యము చెప్పడానికి కూడా వెనుకాడము. మనము వదిలేది పలుకులేకదా ? శబ్దాలేకదా? అనుకుంటాము గాని ఆ పలుకులే మనకు పాపపు మూటలను తయారు చేసి పెడుతున్నాయని, ఆ శబ్దాలే మన జీవన సాధాన్ని శైధిల్యం చేస్తున్నాయని గుర్తించలేము. మహాత్ములను నిందించడమే మహాపాప మనే నిత్యసత్యాన్ని గుర్తించలేము.

ఆలోచించండి. చేసిన పాపాలుచాలు. మహాత్ములను నిందించి నూతన పాపములను తయారు చేసుకోకుండా జీవించెదము గాక !

తథాచ ఆత్మవిత్ సంసారం తీర్త్వా బ్రహ్మానందంఇహైవ ప్రాప్నోతి

భావము :– అలాగున ఆత్మవిదుడు సంసారమును దాటి ఇచ్చటనే బ్రహ్మానంద ప్రాప్తిని పొందుచున్నాడు.

తరతి శోకమాత్మవిత్ ఇతిశ్రుతేః

భావము :– ఆత్మవిదుడు శోకమును దాటును అని వేదములు తెలిపినవి.

వ్యాఖ్య

ఇచ్చట ఆచార్యులవారు సంప్రదాయ రక్షణ సాగించుచున్నారు. స్వీయ రచనను సాగించినపుడు దానికి ప్రమాణమును చూపవలసిన భాధ్యత రచయితపై నున్నది. వేదప్రమాణములేని తత్త్వ దర్శనము అనుసరించ దగినదికాదు. కనుక తాను బోధించు విషయమునకు శ్రుతి ప్రమాణము నందించుచున్నారు.

"ఆత్మ విదుడు శోకమును దాటును " అని ఛాందోగ్య శ్రుతిని ఉదహరించుచున్నారు.

ద్వైతము దోషము గనుక శోకమును అందించింది. ఇదియే అజ్ఞానము. జ్ఞానము కలిగిన దశలో ద్వైతము అంతరించు చున్నందున తజ్జనిత దోషములు నివారింపబడి శోకము కనుమరుగగుచున్నది. అద్వైతము అనుభూతిగా మిగులు చున్నది. అద్వైతానుభూతి నందు ఏకత్వమే అనుభవ గ్రాహ్యము గనుక అట్టి దివ్యస్థితిలో శోక మోహాదులు కదిలే అవకాశము లేదు.

"అహం న కించిచ్చిదితి మాత్వా ధీరో నశోచతి "

"నేను జ్ఞానమే గాని మరొకటి గానేరను; అని తలంచుట చేత ధీరుడు ఎన్నడూ శోకించడు" అని అన్నపూర్ణోపనిషత్తు చెబుతుంది.

మరి ధీరుడెవరు ? ఈ ప్రశ్నకు కఠోపనిషత్తు సమాధానము నందిస్తుంది.

అథ ధీరా అమృతత్వం విదిత్వా
ధ్రువ మధ్రువే ష్విహ న ప్రార్థయన్తే.

"అస్థిరమైన వస్తు ప్రపంచము వెనుక స్థిరమై ఉండు అమృత మయమగు ఆత్మను తెలుసుకొనినవారై ఈ లోకమున దేనిని వాంఛించ కుందురు " అని కఠోపనిషత్తు తెలుపుతుంది.

" స్వాత్మనైవ సదానంద రూపేణాస్మి స్వలక్షణః "

"నిత్యానంద స్వరూపమైన ఆత్మ లక్షణములనే కలిగి ఆత్మనే అయిఉన్నాను" అని జ్ఞాని యొక్క అంతరంగికానుభూతిని అధ్యాత్మోపనిషత్తు నిర్వచించినది.

తనుం త్యజతు వాకాశ్యం శ్వపచస్య గృహే అథవా జ్ఞానప్రాప్తి
సమయే ముక్తః అసౌ విగతాశయః ఇతీ స్మృతేశ్చ

భావముః– ఆత్మజ్ఞానము కలిగిన పిదప జీవన్ముక్తుడు తన శరీరమును కాశీలో విడిచినను, చండాలుని గృహమునందు విడిచినను అతడు సర్వకర్మ విముక్తుడైనందున ముక్త పురుషుడయ్యే ఉన్నాడు అని స్మృతులు కూడా తెలుపుచున్నవి.

ఇతి తత్త్వబోధ ప్రకరణమ్ సమాప్తమ్

భావము :– ఈ విధముగా తత్త్వబోధ యనెడి ప్రకరణ గ్రంథము సమాప్తమైనది.

ఓం....ఓం....ఓం....